
ఈనాడు హైదరాబాద్

HMDA

గురువారం 17 ఆగస్టు 2017 | 24 పేజీలు



రాష్ట్ర జనాభాలో మూడొంతుల మంది అవుటర్ రింగ్ రోడ్డు లోపలే ఉన్నారు. వచ్చే ఏడాదిలోపు వీరున్న ఇంటింటికి నల్లా కనెక్షన్ ఇస్తాం. ప్రతి వ్యక్తికి రోజు 135 లీటర్ల చొప్పున నాణ్యమైన నీటిని అందిస్తాం. ప్రస్తుతం నీటి సరఫరా 7 మిలియన్ గ్యాలన్లు. వచ్చే రోజుల్లో ఇందుకు నాలుగున్నర రెట్లు అధికంగా సరఫరా చేస్తాం. అంతేకాదు... మహా నగరంలో లక్షా 50వేల కొత్త నల్లా కనెక్షన్లు ఇవ్వబోతున్నాం.

–ఇంటింటికి నల్లా కనెక్షన్ ఇచ్చే పథకం పైలాన్‌ను కొంపల్లిలో ఆవిష్కరించిన సందర్భంగా మంత్రి కేటీఆర్

మీ చిన్నారి రాత్రి వేళల్లో తరచూ నిద్ర లేస్తోందా?

వసుంధర కుటుంబం ...వివరాలు 11లో

మిస్ ట్విన్ సిటీస్ పోటీలో పాల్గొనేందుకు ముద్దుగుమ్మలు తరలి వచ్చారు. ఈ సందర్భంగా అమీర్‌పేటలోని హోటల్ గ్రీన్‌పార్క్ మ్యారీగోల్డ్‌లో ఏర్పాటు చేసిన క్యాట్‌వాక్‌లో పాల్గొని హొయలు పోయారు.



వివరాలు 5లో

నేటి నుంచి పిల్లలకు తట్టు-పొంగు టీకాలు

7.06 లక్షల మంది గుర్తింపు

పిల్లలకు ప్రాణాంతకమైన వ్యాధుల నుంచి రక్షించేందుకు తట్టు, పొంగు (రుబెల్లా) టీకాలు వేసేందుకు జిల్లా యంత్రాంగం ఏర్పాట్లు చేసింది. తొమ్మిది నెలల వయస్సు నుంచి 15ఏళ్లలోపు పిల్లలకు నేటి నుంచి వీటిని వేస్తారు. పిల్లలకు తొలిసారిగా వీటిని వేయనుండటం గమనార్హం. జిల్లాలో 9నెలల నుంచి 15ఏళ్లలోపు పిల్లలు 7,06,814 మంది ఉన్నట్లు గుర్తించారు. ఐదు వారాల వ్యవధిలో వీరందరికీ టీకాలు వేస్తారు. ఇందుకోసం ఏఎన్ఎం సహా ముగ్గురు సభ్యులతో 2,766 బృందాలు ఏర్పాటయ్యాయి. ఇవి అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలల్లో పిల్లలకు టీకాలు వేస్తాయి. పిల్లల తల్లిదండ్రులు ఎలాంటి సందేహాలూ మనసులో పెట్టుకోకుండా తమ పిల్లలకు టీకాలు వేయించాలని డీఎంహెచ్ఓ భానుప్రకాశ్ కోరారు. టీకా వేసినట్లు గుర్తుగా పిల్లవాడి వేలిపై చుక్క పెడతారు. ఇది నెల రోజుల పాటు చెరగదు. కార్యక్రమం చివరిలో మరో వారం రోజుల పాటు మిగిలిన వారికి టీకాలు వేస్తామన్నారు.

–ఈనాడు, హైదరాబాద్

బల్దియాలో భలే దందా!



- నిరుద్యోగుల నుంచి రూ.లక్షల వసూళ్లు
- ముఠాలుగా అధికారులు, నేతలు
- పర్యవేక్షణ లేక పెరుగుతున్న మోసాలు

ఈనాడు, హైదరాబాద్

జీహెచ్ఎంసీలో ఉద్యోగాలు ఇప్పిస్తామని నిరుద్యోగులను ముంచుతున్న ముఠాలు పెరుగుతున్నాయి. ఎక్కడ ఖాళీలు ఏర్పడుతున్నాయో తెలుసుకోవడం.. ఆపై నిరుద్యోగులను మాటలతో ఆకట్టుకుని ఒక్కొక్కరి నుంచి రూ.రెండు లక్షల నుంచి రూ.4లక్షల వరకు వసూలు చేస్తున్నారు. కొందరైతే మూడో కంటికి తెలియకుండా.. చివరకు పరిపాలన విభాగం అనుమతి లేకుండానే విధుల్లో చేర్చేస్తున్నారు. ఇందులో అధికారులతోపాటు, రాజకీయ నేతల పాత్రా ఉంది. చివరకు వీరి మధ్య ఆధిపత్య పోరు తలెత్తడంతో అక్రమాలు ఒక్కొక్కటిగా బయటికొస్తున్నాయి.

అవసరాన్ని ఆసరాగా చేసుకుని నిరుద్యోగులను నిలువునా ముంచుతోన్న ముఠాలకు జీహెచ్ఎంసీ కార్యాలయాలు వేదికలుగా మారుతుండటం ఆందోళన కలిగిస్తోంది. బల్దియా సర్కిల్ కార్యాలయాలు, డంపింగ్ యార్డులు, పార్కింగ్ యార్డుల్లో ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ కంప్యూటర్ ఆపరేటర్, అటెండెంట్, డ్రైవరు, శానిటరీ సూపర్‌వైజరు నుంచి చివరకు రహదారులను శుభ్రం చేసే పారిశుద్ధ్య కార్మికుల ఉద్యోగాలనూ అమ్మకానికి ఉంచుతున్నారు. గతంలో పారిశుద్ధ్య కార్మికులుగా నియమించుకునేందుకు కొందరు సర్కిల్ సహాయ ఆరోగ్య అధికారులు అభ్యర్థుల నుంచి రూ.లక్ష, రూ.లక్షన్నర డబ్బు తీసుకుంటూ దొరికిపోయిన విషయం తెలిసిందే. ఇప్పుడు పైస్థాయి విభాగాల్లోనూ నియామకాలు కల్పిస్తామంటూ రూ.లక్షలు వసూలు చేస్తున్న ముఠాలు ఒక్కొక్కటిగా బయటకొస్తున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం జీతాలు పెంచుతుందని, ఎప్పటికైనా ప్రభుత్వం క్రమబద్ధీకరణ చేపడుతుందని నిరుద్యోగులు డబ్బు చెల్లించేందుకు సిద్ధమవుతున్నారని సీనియర్ ...మిగతా 4లో

కొలనులకు విఘ్నాలు!

- వేగం పెంచితేనే పనులు పూర్తి
- పదింటిపై అధికారుల దృష్టి

ఈనాడు, హైదరాబాద్



గణేశ ఉత్సవాల సందర్భంగా తలపెట్టిన కొత్త నిమజ్జన కొలనుల్లో కొన్ని నిర్మాణాలైనా పూర్తి కావాలంటే యుద్ధప్రాతిపదికన కనీసం మరో పక్షం రోజులైనా శ్రమించాల్సిదే. పనులు కాస్త ఆలస్యంగా ప్రారంభం కావడం.. కొలనులను పటిష్ఠ పరిచేందుకు కావాల్సిన మట్టి లభ్యత లేకపోవడం లాంటి కారణాల వల్ల పనులు ఆశించిన స్థాయిలో జరగడం లేదు. ఈ ఏడాది జరిగే నిమజ్జన సమయానికి 15 కొత్త కొలనులను అందించాలని భావిస్తున్నా అవి ఏమేరకు పూర్తవుతాయన్న సందేహాలు కలుగుతున్నాయి. ఇంకా ఒక చెరువు నిర్మాణానికి టెండర్ల ప్రక్రియే పూర్తి కాలేదు.

పర్యావరణ హితం కోసం.. వినాయక చవితి వేడుకలు నగరంలో అత్యంత ఘనంగా నిర్వహించే విషయం తెలిసిందే. ప్రతి గల్లీలోనూ వినాయక విగ్రహాలు ఏర్పాటు చేసి పూజలు నిర్వహిస్తుంటారు. తమ శక్తికి మించి భారీ ఎత్తున విగ్రహాలు ఏర్పాటు చేస్తుంటారు. నిమజ్జనం రోజున హుస్సేన్‌సాగర్‌కు వేల విగ్రహాలు వస్తుండటంతో అనేక గంటల ...మిగతా 4లో

నిమజ్జనానికి ఉద్దేశించినవి ఇవే..

చెరువు	అంచనా (రూ.లో)
మూసాపేట ముళ్లకత్వ చెరువు:	1.08 కోట్లు
రాజేంద్రనగర్ పత్తికుంట చెరువు:	1.18కోట్లు
అల్వాల్ కొత్త చెరువు:	89 లక్షలు

రూ. కోటి చొప్పున..

సూరారం(కుత్బుల్లాపూర్) చెరువు, హస్మత్‌పేటలోని బోయిన్ చెరువు, నాగోలు చెరువు, ఉప్పల్‌లోని నల్ల చెరువు

రూ. 90 లక్షలు చొప్పున..

నెక్నంపూర్‌లోని పెద్ద, చిన్న చెరువు పఠాన్ చెరువు, రాయసముద్రం చెరువు, హాఫీజ్‌పేట చెరువు, లింగంపల్లి చెరువు, రాయదుర్గం చెరువు, అంబేడ్కర్ చెరువులు



కృష్ణ (30)



నాగేశ్ (30)

మరో వ్యక్తిని బతికించి.. బలయ్యారు..

... ఘటన వివరాలు 2లో



మెహిదీపట్నం అయోధ్య నగర్‌లో ఈ గోడ కూలడం వల్లే ఇద్దరు కూలీలు మృత్యువాత పడ్డారు.

గోడ కూలి ఇద్దరు కూలీల మృతి

మరో వ్యక్తిని బతికించి.. బలయ్యారు ● నష్ట పరిహారం కోసం బంధువుల ఆందోళన



రోదిస్తున్న మృతుల బంధువులు

మెహిదీపట్నం, న్యూస్‌టుడే: నిర్మాణంలో ఉన్న భవనానికి చెందిన పాత ప్రహరీ గోడ కూలి ఇద్దరు కూలీలు చనిపోయారు. మృతుల కుటుంబాలకు నష్ట పరిహారం చెల్లించాలని బంధువులు ఆందోళనకు దిగారు. అధికార పార్టీకి చెందిన నేతలతో పాటు భాజపా, సీపీఎం నేతలు మద్దతు పలకడంతో ఉద్రిక్తత నెలకొంది. దాదాపు ఏడు గంటల పాటు మృతదేహాలు సంఘటనా స్థలంలోనే ఉన్నాయి. మెహిదీపట్నం పీవీ ఎక్స్‌ప్రెస్ వే పిల్లర్ నెంబరు 28(అయోధ్యనగర్) వద్ద ఆరు అంతస్తుల భవన నిర్మాణం జరుగుతోంది. బుధవారం ఉదయం 9గంటల సమయంలో మెహిదీపట్నం భోజగుట్టకు చెందిన కృష్ణ(30), నాగేశ్(30), శివ కూలి పనికోసం వచ్చారు. కృష్ణ స్వస్థలం మహబూబ్‌నగర్ జిల్లా నవాబ్‌పేట మండలం గురుకుంట వాసి కాగా.. నాగేశ్‌ది మహారాష్ట్ర షోలాపూర్ స్వస్థలం. గత కొన్ని సంవత్సరాల క్రితం పొట్టకూటి కోసం ఇద్దరూ నగరానికి వచ్చారు. గతంలో నిర్మించిన ప్రహరీగోడ పక్కనున్న ఇనుప రాడ్‌లను పక్కకు తప్పిస్తున్న క్రమంలో ఒక్కసారిగా గోడ కూలింది. కృష్ణ, నాగేశ్‌పై కూలింది. తమ పక్కనున్న శివను పక్కకు నెట్టడంతో అతను ప్రాణాలతో బయటపడ్డాడు. భోజగుట్టకు చెందిన ఇద్దరు వ్యక్తులు మృతి చెందారన్న విషయం తెలుసుకున్న ప్రజలు పెద్ద ఎత్తున అయోధ్యనగర్ చేరుకున్నారు. అన్ని పార్టీల నేతలు నష్టపరిహారం కోసం నిరసనకు దిగారు. మధ్యాహ్నం 3 గంటల సమయంలో భవన యజమాని షకీల్ ఆసిఫ్‌నగర్ ఏసీపీ కార్యాలయానికి వచ్చాడు. ఒక్కో మృతుని కుటుంబానికి రూ. 6.5 లక్షలు చొప్పున మొత్తం రూ. 15లక్షలు ఇస్తానని హామీ ఇవ్వడంతో నాయకులు అంగీకరించారు. ఒక్కొక్కరికి రూ. 6లక్షల నష్ట పరిహారం, రూ. 30 వేలు దహన సంస్కారాల కోసం ఇస్తామని కార్మికశాఖ ప్రకటించింది. ఆపద్బంధు పథకం కింద ఒక్కొక్కరికి రూ. 50 వేలు అందేలా చూస్తామని తహసిల్దార్ తెలిపారు. కృష్ణకు భార్య, కొడుకు సంజీవ(6), కూతురు మహాలక్ష్మి(5) ఉన్నారు. నాగేశ్‌కు భార్య, కూతుళ్లు మమత(5), నిహారిక(3), కొడుకు కార్తిక్(4) ఉన్నారు.

'రెప్పపాటులో తప్పింది..'



శివ

'మేము నాంపల్లిలో పనికి వెళుతున్నాం. నాగేశ్ మామ సాయిలు మమ్మల్ని కలిశాడు. మెహిదీపట్నంలో అర్జెంటుగా పని ఉంది అని చెప్పాడు. నేను కృష్ణ, నాగేశ్.. వెళ్లాము. భవనంలో దాదాపు 20 మంది వరకు పని చేస్తున్నాం. ప్రహరి పక్కన ఉన్న ఇనుప రాడ్స్‌ను తొలగిస్తున్నాం. అకస్మాత్తుగా గోడకు పగుళ్లు ఏర్పడ్డాయి. ప్రమాదాన్ని పసిగట్టిన నాగేశ్, కృష్ణ పక్కనే ఉన్న నన్ను ఇద్దరూ పక్కకు నెట్టారు. అంతలోనే వారిపై గోడ కూలింది. శిథిలాలు తొలగించి బయటికి తీశాం. అప్పటికే వారిద్దరు మృతి చెంది ఉన్నారు'.. అని ప్రత్యక్ష సాక్షి, ప్రమాదం నుంచి రెప్పపాటులో బయటపడ్డ శివ(18) చెప్పారు. వాళ్లు నన్ను పక్కకు నెట్టకపోతే, చనిపోయి ఉండే వాడినని గద్గద స్వరంతో శివ చెప్పారు.

అనుమతి లేని ఆరు అంతస్తులు!

బల్దియా పట్టించుకోక పోవడంతో ప్రాణాలు బలి



నిర్మాణంలో ఉన్న భవనం

మెహిదీపట్నం,న్యూస్‌టుడే: ప్రహరీ గోడ కూలి ఇద్దరు కూలీల ప్రాణాలు గాలిలో కలిసి పోయిన సంఘటనలో గ్రేటర్ పట్టణ ప్రణాళికా విభాగం అధికారులు పట్టించుకోకుండా నిర్లక్ష్యం వహించిన తీరు స్పష్టంగా కనిపిస్తోంది. మెహిదీపట్నం ప్రధాన రహదారిలో జీ+2 భవన నిర్మాణం కోసం బల్దియా అధికారులు అనుమతి జారీ చేశారు. సెల్లార్‌తో పాటు అయిదు అంతస్తుల నిర్మాణం పూర్తి అయింది. ఆరో అంతస్తు కోసం సెంట్రింగ్ కూడా ఏర్పాటు చేశారు. భారీ నిర్మాణం.. అధికారుల కంట పడక పోవడం విచిత్రమే! మెహిదీపట్నం, పీవీ ఎక్స్‌ప్రెస్ వే పిల్లర్ నెంబరు 28, ప్రధాన రహదారిలో ఆషాబేగం, అమ్రిన్ బేగం, షాహనాజ్ బాను, పర్వీన్ బేగం పేరుతో 239+239 గజాల స్థలం ఉంది. యజమానులు సెల్లార్ తవ్వుతున్నప్పుడే స్థానికుల నుంచి పెద్ద ఎత్తున నిరసన వ్యక్తం అయ్యింది. కొందరు ఫిర్యాదులు కూడా చేశారు. ఎలాంటి చర్యలు చేపట్టలేదు. రాజకీయ పైరవీలతో అధికారులపై ఒత్తిడి తీసుకొచ్చారు.

గ్రేటర్ నోటీసులు... జీ+2 నిర్మాణం కోసం అనుమతి మంజూరు చేసిన టౌన్ ప్లానింగ్ అధికారులు జీ+5 అంతస్తుల నిర్మాణం పూర్తి అయిన తర్వాత యజమానులకు నోటీసులు జారీ చేశారు. స్థానిక కార్పొరేటర్ అభ్యంతరం వ్యక్తం చేసినా.. ఆయన పార్టీకే చెందిన ప్రజా ప్రతినిధులు అడ్డు తగిలినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ భవన నిర్మాణాన్ని ఆసరాగా చేసుకుని మరికొన్ని పుట్టుకొస్తున్నాయి. నిర్మాణం తర్వాత పాతబస్తీలోని ఓ ప్రముఖ వస్త్ర వ్యాపారికి భవనాన్ని లీజుకు ఇస్తున్నట్లు తెలుస్తోంది. బుధవారం సంఘటన తర్వాత మెహిదీపట్నం, అయోధ్యనగర్‌కు వచ్చిన సిటీ ప్లానర్, జడ్సీకి ఈ భవన నిర్మాణం గురించి అవగాహన లేకపోవడం నిర్లక్ష్యానికి అద్దం పడుతోంది. బాధ్యులైన టౌన్ ప్లానింగ్ అధికారులపై చర్యలు తప్పవని సిటీ ప్లానర్ వసంతరావు చెబుతున్నారు. స్థల యజమానులకు ఇప్పటికి మూడు సార్లు నోటీసులు జారీ చేశామని పట్టణ ప్రణాళిక అధికారులు చెబుతున్నారు. ఈ భవనం కూల్చివేత సందర్భంగా రక్షణ కల్పించాల్సిందిగా పోలీసు ఉన్నతాధికారులను కూడా కోరామని అంటున్నారు. షరా మాములు అన్నట్లుగా, కింది స్థాయి సిబ్బందిపై వేటు వేసి. . అసలు బాధ్యులపై చర్యలు తీసుకోరని స్థానికులు ఆరోపిస్తున్నారు.

భవనంపైనుంచి పడి కార్మికుడి మృతి

శేరిలింగంపల్లి: భవనం మీదనుంచి పడి భవన నిర్మాణ కార్మికుడు మృతిచెందిన ఘటన చందానగర్ ఠాణా పరిధిలో చోటుచేసుకుంది. ఎస్ఐ సైదులు తెలిపిన వివరాల ప్రకారం. .. ఒడిశా ప్రాంతానికి చెందిన దేబేంద్రనామ సూద్ర(24) గంగారం పీజేఆర్‌ఎన్‌క్లేవ్ ప్రాంతంలో అపర్ణాహిల్ పార్కు బహుళంతస్థుల నిర్మాణంలో కొన్నాళ్లుగా పనిచేస్తున్నాడు. చుట్టుపక్కల ఊళ్లకి చెందిన బంధువులతో కలిసి వచ్చి ఇక్కడ గుడిసెల్లో ఉంటూ పనిచేస్తున్నాడు. భార్యాపిల్లలు ఊరిలో ఉంటున్నారు. మంగళవారం సాయంత్రం సమయంలో 7వ అంతస్థులో పనిచేస్తున్న దేబేంద్ర అదుపుతప్పి కింద పడటంతో తలకి తీవ్ర గాయాలై అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. ఈ మేరకు రాత్రి ఫిర్యాదు చేయడంతో కేసు నమోదుచేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. బహుళంతస్థుల భవనాల నిర్మాణాలు చేస్తూ కార్మికుల కోసం భద్రతా చర్యలు తీసుకోకుండా పనులు చేస్తుండటంతో ఈ ఘటన చోటుచేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ మేరకు అపర్ణా నిర్మాణ యాజమాన్యంతో పాటు సైట్ ఇంజినీర్, భద్రతా విభాగం ప్రతినిధిపై కేసులు నమోదుచేసినట్లు ఎస్ఐ చెప్పారు.

చోరీకి పాల్పడిన ఇద్దరు బాలురు..

పరిశీలన గృహానికి తరలింపు

సైదాబాద్, న్యూస్‌టుడే: అర్ధరాత్రి ఓ ఇంట్లో చొరబడి చోరీకి పాల్పడిన ఇద్దరు బాలురను సైదాబాద్ పోలీసులు బుధవారం అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి 43 గ్రాముల బంగారు ఆభరణంతో పాటు మూడు చరవాణులను స్వాధీనం చేసుకుని హైదరాబాద్ జిల్లా బాలల న్యాయ మండలి ముందు హాజరుపర్చారు. అదనపు ఇన్‌స్పెక్టర్ కోరుట్ల నాగేశ్వర్‌రావు కథనం ప్రకారం.. సైదాబాద్ డివిజన్ శంకేశ్వర్‌బజార్ పరిధి సాయిరాంబస్తీకి చెందిన ఇద్దరు బాలురు గతనెల 26న చోరీ చేశారు. ఐఎస్‌సదన్ డివిజన్ పరిధి ఖాజాబాగ్‌కు చెందిన ఇలియాస్ ఖాన్ నివాసంలో అర్ధరాత్రి చొరబడి బంగారు ఆభరణం, చరవాణులు చోరీ చేసి పరారైయ్యారు. బుధవారం సదరు ఆభరణాన్ని విక్రయించేందుకు చంపాపేటలో అనుమానాస్పదంగా సంచరిస్తుండగా పోలీసులకు విశ్వసనీయ సమాచారం అందింది. దీంతో పోలీసులు ఇద్దరు బాలురను అదుపులోకి తీసుకున్నారు. ఇరువురు నేరాన్ని అంగీకరించడంతో బాలల న్యాయ మండలి ముందు హాజరుపర్చి, సైదాబాద్‌లోని బాలుర పరిశీలన గృహానికి తరలించారు.


న్యాయవాది ముసుగులో మోసాలు

అవినీతి వ్యతిరేక కమిటీ పేరిట వసూళ్లు



నిందితుడు చంద్రశేఖర్

దిల్‌సుఖ్‌నగర్, న్యూస్‌టుడే: అవినీతి వ్యతిరేక కమిటీ పేరుతో ఓ న్యాయవాది మోసాలకు పాల్పడుతున్న వైనం వెలుగు చూసింది. మీకు ఏదైనా ఇబ్బందులుంటే మా యాంటీ కరప్షన్ కమిటీని సంప్రదించాలంటూ ప్రకటనలు ఇస్తూ నమ్మివచ్చిన వారి వద్ద అందినకాడికి దండుకోవడమే పనిగా పెట్టుకున్నాడు. బాధితుల ఫిర్యాదుతో పోలీసులు అతడిని అరెస్టు చేసి కటకటాల్లోకి నెట్టిన సంఘటన చైతన్యపురి ఠాణా పరిధిలో బుధవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం వివరాలు.. కొత్తపేట వాసవీ కాలనీకి చెందిన దామెర చంద్రశేఖర్(40) వృత్తి రీత్యా న్యాయవాది. 2011లో యాంటీ కరప్షన్ కమిటీ పేరిట ఓ సంస్థను తెరిచాడు. ఎవరికి ఏ అవసరం ఉన్నా తన చరవాణి నంబర్‌ను సంప్రదించాలంటూ పత్రికల్లో, టీవీల్లో ప్రకటనలు ఇచ్చేవాడు. ఈ ప్రకటనలు చూసిన ఉప్పల్‌కు చెందిన రాణి అతన్ని ఆశ్రయించి జీహెచ్‌ఎంసీలో మార్టిగేజ్‌లో ఉన్న అపార్టుమెంట్ విషయాన్ని అతడికి తెలిపింది. దానిని విడిపిస్తానంటూ ఆమె వద్ద రూ. 2.50 లక్షల తీసుకొని మొహం చాటేశాడు. అదేవిధంగా ఆర్కేపురం ప్రాంతానికి చెందిన అల్పన అనే మహిళ అపార్టుమెంట్ కొనుగోలు చేసేందుకు సిద్ధపడి 2014లో న్యాయ సలహా కోసం చంద్రశేఖర్‌ను ఆశ్రయించారు. ఆ అపార్టుమెంట్ డాక్యుమెంట్లు సరిగా లేవని తాను మరో అపార్టుమెంట్ ఇప్పిస్తానని, అవసరమైన బ్యాంకు రుణం కూడా ఇప్పిస్తానంటూ అందుకు రూ. 5 లక్షలు అడ్వాన్స్‌గా చెల్లించాలని ఆమె నుంచి డబ్బులు తీసుకున్నారు. అల్పన కుటుంబ సభ్యులు తమకు నచ్చిన అపార్టుమెంట్ చూసుకొని దానికి సంబంధించిన డాక్యుమెంట్లు తీసుకుని అతడిని ఆశ్రయించినప్పుడల్లా దస్త్రాలు సరిగా లేవంటూ పేర్కొంటుండడంతో వారికి అనుమానం వచ్చి డబ్బులు తిరిగి ఇచ్చేయాలని ఒత్తిడి చేయడంతో వారి నుంచి తప్పించుకు తిరుగుతున్నాడు. దీంతో మోసపోయినట్లు గుర్తించిన బాధితులు అల్కాపురికి చెందిన అల్పన, ఉప్పల్‌కు చెందిన రాణి చైతన్యపురి ఠాణాలో ఫిర్యాదు చేశారు. దీంతో కేసు నమోదు చేసిన పోలీసులు బుధవారం నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.



సిద్ధమవుతోంది స్టీల్ వంతెన

సికింద్రాబాద్ ఒలిఫెంటా బ్రిడ్జి వద్ద మెట్రో స్టీల్ వంతెన పనులను శరవేగంగా పూర్తి చేస్తున్నారు. ఇప్పటికి 180 మీటర్లు పూర్తయిందని.. మిగిలింది 20 మీటర్లేనని.. ఐదు రోజుల్లో పూర్తి చేస్తామని అధికారులు చెబుతున్నారు.
–న్యూస్‌టుడే, రెజిమెంటల్‌బజార్

వేధింపులు తాళలేక వివాహిత ఆత్మహత్య

ఘట్‌కేసర్, న్యూస్‌టుడే: సంతానం కలగలేదని నిత్యం భర్త, అత్తింటి వాళ్ల వేధింపులు భరించలేక ఓ వివాహిత ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన ఘట్‌కేసర్ పోలీసుస్టేషన్ పరిధిలో జరిగింది. సీఐ బి.ప్రకాష్ వివరాల ప్రకారం.. శామీర్‌పేట మండలం కేశవరం గ్రామానికి చెందిన రాధిక(26)కు ఘట్‌కేసర్ మండలం పోచారం పంచాయతీ అన్నోజిగూడకు చెందిన బండ గణేష్‌తో ఎనిమిది ఏళ్ల క్రితం వివాహం జరిగింది. రాధికకు సంతానం కలగకపోవడంతో భర్త గణేష్‌తోపాటు అత్త శివమ్మ, అత్తింటి బంధువులు ప్రకాష్, జ్యోతి ఆయెను వేధింపులకు గురి చేస్తున్నారు. ఈ క్రమంలో గణేష్‌కు మరో వివాహం చేయాలని నిర్ణయించుకున్నారు. విషయం తెలుసుకున్న రాధిక పుట్టింటి వాళ్లు పంచాయతీ పెట్టారు. అయినా వేధింపులు తగ్గలేదు. ఈనెల 13వ తేదీన మధ్యాహ్నం రాధిక బంధువుల పెళ్లికి వెళ్తున్నానని భర్తకు చెప్పింది. అందుకు ఒప్పుకోకపోవడంతో పాటు సంతానం విషయంపై మళ్లీ వేధింపులకు గురి చేశాడు. మనస్తాపం చెందిన ఆమె వెంట్రుకలకు రంగు వేసే పొడరును నీటిలో కలుపుకుని తాగేసింది. ఇదంతా చూస్తూ ఉండిపోయిన భర్త పట్టించుకోలేదు. పరిస్థితి విషమించడంతో ఆమెను భర్త ఉప్పల్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం ఎల్‌బీనగర్‌లోని కామినేని ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందినట్లు సీఐ తెలిపారు. మృతురాలి సోదరుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

వంచనకు గురైన బాలిక బలవన్మరణం

జగద్గిరిగుట్ట, న్యూస్‌టుడే: తాత్కాలికంగా సంరక్షణ గృహంలో ఉన్న ఓ బాలిక ఆత్మహత్య చేసుకుంది. జగద్గిరిగుట్ట పోలీసుల కథనం ప్రకారం... ఆదిలాబాద్ జిల్లా బైంసా మండలం, గుండేగావ్‌కు చెందిన బాలిక(15) స్థానిక పాఠశాలలో 9వ తరగతి చదువుతోంది. ఆమెను ఓ యువకుడు ప్రేమ పేరుతో వంచించాడు. బాలిక తల్లిదండ్రులు బైంసా పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా 376 సెక్షన్ కింద యువకుడిపై కేసు నమోదు చేశారు. బాలిక తన తల్లిదండ్రుల వద్దకు వెళ్లనని చెప్పడంతో పునరావాస కేంద్రానికి తరలించాలని కోర్టు సూచించింది. ఆల్విన్ కాలనీలోని ప్రభుత్వ సంరక్షణ గృహానికి ఇటీవల పోలీసులు తీసుకొచ్చారు. ఈ క్రమంలో తీవ్ర మనస్థాపానికి గురైన ఆమె బుధవారం తన గదిలో ఫ్యాన్‌కు ఉరేసుకుంది. సుసైడ్ నోట్‌లో ప్రేమించిన యువకుడి తల్లిదండ్రుల వేధింపుల కారణంగా చనిపోతున్నట్లు రాసి ఉంది.




హుస్సేన్ సాగర్.. కష్టం తీరనుంది!

నెలల కొద్దీ పెండింగ్‌లోనే కొత్త ఐఅండ్‌డీ ● తాజాగా ప్రాజెక్టుకు మోక్షం

ఈనాడు, హైదరాబాద్

వందల కోట్ల రూపాయలతో చేపట్టిన హుస్సేన్ సాగర్ ప్రక్షాళన పనులు గరళానికి అడ్డుకట్ట వేయలేకపోయాయి. రోజురోజుకీ పెరుగుతున్న ప్రమాదకర రసాయన వ్యర్థాలతో అసలుకే ఎసరొచ్చే ప్రమాదం ఏర్పడింది. ఈ తరుణంలో కూకట్‌పల్లి నాలా నుంచి మురుగు చేరకుండా మళ్లించేందుకు నెక్లెస్ రోడ్డులో నిర్మించనున్న 150 ఎంఎల్‌డీ ఐఅండ్‌డీ(ఇంటర్‌సెప్షన్ అండ్ డైవర్షన్)కి ఎట్టకేలకు మోక్షం లభించింది. నెలల కొద్దీ పెండింగ్‌లో ఉన్న ఈ ప్రాజెక్టు పనులు తాజాగా పట్టాలెక్కాయి.



ఇప్పటి వరకు హుస్సేన్ సాగర్ ప్రక్షాళన కోసం ఎంత ఖర్చు పెట్టారో తెలిస్తే ముక్కున వేలేసుకోక మానరు. ఏకంగా రూ.400 కోట్లకు పైమాటే. ఒక్క హెచ్ఎండీఏనే రూ.370 కోట్ల వరకు వెచ్చించింది. జైకా రుణం రూ.310 కోట్లు కాగా.. మిగిలిన రూ.60 కోట్లను ప్రభుత్వం సమకూర్చింది. కూకట్‌పల్లి నాలా మళ్లించేందుకు జల మండలి సుమారు రూ.50 కోట్ల వరకు ఖర్చు చేసింది. రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించడంతో ప్రక్షాళన పనులు వేగిరమయ్యాయి. బంజారా, పికెట్, బల్కాపూర్ నాలాల నుంచి వచ్చే మురుగు నీటిని సాగర్‌లో చేరకుండా నేరుగా మూసీలోకి మళ్లించారు. సాగర్‌లో పేరుకుపోయిన చెత్తాచెదారం, గుర్రపు డెక్క, ఇతర వ్యర్థాలను తొలగించేందుకు.. నీటిలో కరిగి ఉన్న ఆక్సిజన్ శాతాన్ని పెంచేందుకు విదేశాల నుంచి అధునాతన యంత్రాలను తెప్పించారు.

పూర్తయితే మురుగు కలవదంటున్న హెచ్ఎండీఏ

ఏం లాభం..?

ప్రక్షాళన పనులు కొంత వరకు సత్ఫలితాలనిచ్చాయి. గతంతో పోలిస్తే కాలుష్యం కొద్దిగా తగ్గినట్లుగా కాలుష్య నియంత్రణ మండలి(పీసీబీ), ఈపీటీఆర్ఐ తేల్చింది. తగ్గినట్లే తగ్గిన కాలుష్యం.. మళ్లీ పెరిగింది. ఏంటని ఆరా తీస్తే కూకట్‌పల్లి నాలా నుంచి ఇప్పటికీ ప్రమాదకర రసాయన వ్యర్థాలు కలుస్తున్నట్లుగా గుర్తించారు. ఇందుకు ప్రధాన కారణం ఆ నాలాను మళ్లించేందుకు ఏర్పాటు చేసిన పైపులైన్ సామర్థ్యం.. అప్పటికే నెక్లెస్‌రోడ్డులో ఉన్న ఐఅండ్‌డీ సామర్థ్యం కంటే తక్కువగా ఉండటమేనని తేల్చారు. రాత్రిళ్లు గరళం కలుస్తున్నట్లుగా గుర్తించారు. అప్రమత్తమైన హెచ్ఎండీఏ ఇంజినీరింగ్ అధికారులు ఆలోచనలో పడ్డారు. భవిష్యత్తులో చుక్క మురుగు చేరకుండా కొత్తగా 150 ఎంఎల్‌డీ ఐఅండ్‌డీ నిర్మించాలని నిర్ణయించారు. నెక్లెస్ రోడ్డులో ఉన్న 100 ఎంఎల్‌డీ ఐఅండ్‌డీ పక్కనే కొత్త దాన్ని కూడా ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు.


సమయం పట్టింది..!

కొత్తగా నిర్మించనున్న ఐఅండ్‌డీకి సంబంధించి డీటైల్డ్ ప్రాజెక్టు రిపోర్టు(డీపీఆర్)ను ఓ ప్రైవేట్ కన్సల్టెన్సీ గతేడాది చివర్లోనే హెచ్ఎండీఏకు అప్పగించింది. రూ.6.10 కోట్లు ఖర్చవుతుందని లెక్క తేల్చింది. వెంటనే హెచ్ఎండీఏ మార్పులు చేర్పులు చేసి.. పరిపాలనపరమైన అనుమతుల కోసం అయిదారు నెలల కిందటే ప్రభుత్వానికి పంపించింది. ఏం జరిగిందో తెలియదు కానీ పనులు మాత్రం పట్టాలెక్కలేదు. మరోవైపు ఫతేనగర్, బాలానగర్ తదితర ప్రాంతాల్లోని ఎలక్ట్రో ప్లేటింగ్ పరిశ్రమల నుంచి ప్రమాదకర వ్యర్థాలు కలుస్తుండటంతో సాగర్‌లో ప్రమాదకరమైన కాడ్మియం తీవ్రత పెరుగుతున్నట్లుగా పర్యావరణవేత్తలు ఆందోళన వ్యక్తం చేశారు. కొన్నాళ్ల పాటు ఇదే జరిగితే రూ.వందల కోట్లు వృథా కావడమే కాకుండా స్వచ్ఛ సాగరం ఇక కలగానే మిగిలిపోతుందంటూ హెచ్చరించారు. తాజాగా కొత్త ఐఅండ్‌డీకి మోక్షం లభించింది. టెండర్ ప్రక్రియ ద్వారా గుత్తేదారు సంస్థను ఎంపిక చేసి.. పనుల్ని అప్పగించారు. తాజాగా పది రోజుల కిందట పనులు ప్రారంభమయ్యాయి. ఆరు నెలల్లో పూర్తి చేయాలని హెచ్ఎండీఏ లక్ష్యంగా పెట్టుకుంది. వర్షాకాలం కావడంతో పనుల్లో కొద్దిగా జాప్యం చోటు చేసుకోనుంది. గణేష్ ఉత్సవాల సందర్భంగా కూడా కొన్ని రోజులు బ్రేక్ ఇవ్వనున్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ వచ్చే ఏడాది ఫిబ్రవరి, మార్చి వరకు కొత్త ఐఅండ్‌డీని అందుబాటులోకి తేనున్నట్లుగా అధికారులు వివరిస్తున్నారు.

పులిని తలపించేలా రంగులతో తీర్చిదిద్దిన ఈ ఆటో బుధవారం రాజ్‌భవన్ రోడ్డులో ప్రయాణిస్తుండగా వెనుక గోడపై గీసిన చిత్రంతో అరణ్యంలో ప్రయాణించిన అనుభూతిని కలగజేసింది.



అక్రమార్కుల చేతికే తాళాలు..!



- మొదటి తారీఖు నుంచే బియ్యం, గోధుమలు
- పదిహేనో తేదీ దాటితేనే కిరోసిన్
- అప్పటికే 70 శాతానికి పైగా పంపిణీ పూర్తి
- ఇవ్వకున్నా.. ఇచ్చినట్లుగా ఈపోస్‌లో నమోదు
- అదను చూసి పక్కదారి పట్టిస్తున్న వైనం
- అవకాశమిచ్చి చోద్యం చూస్తున్న పౌరసరఫరాల శాఖ

జిల్లా	కార్డులు	కిరోసిన్ కోటా(లీటర్లలో)
హైదరాబాద్	5,67,790	6,64,737
మేడ్చల్	4,62,864	5,11,297
రంగారెడ్డి	5,18,097	6,19,943

ఈనాడు, హైదరాబాద్

అసలే వ్యవస్థలోని లోపాలను ఆసరాగా చేసుకోని పేదల సాయాన్ని పక్కదారి పట్టించడం వాళ్లకు వెన్నతో పెట్టిన విద్య.. అలాంటిది అవకాశం ఇస్తే ఊరుకుంటారా.. రెచ్చిపోతారు.. నగరంలో కొన్ని చౌకధరల దుకాణాల్లో ఇప్పుడు జరుగుతుంది ఇదే.. ముఖ్యంగా నగర శివారు ప్రాంతాల్లో పరిస్థితి మరీ దారుణంగా ఉన్నట్లుగా సాక్షాత్తూ అధికారులే ఒప్పుకుంటున్నారు. ఇంతకీ క్షేత్రస్థాయిలో ఏం జరుగుతోంది..? స్వయంగా పౌరసరఫరాల శాఖాధికారులే అక్రమార్కుల చేతికి తాళాలు ఇస్తున్నారా..? కొందరు ఎలక్ట్రానిక్ పాయింట్ ఆఫ్ సేల్స్(ఈపోస్) యంత్రాలను ఎలా బురిడీ కొట్టిస్తున్నారు..? తెలుసుకోవాలనుకుంటే ఈ కథనంపై లుక్కేయండి మరి..!

ఇదీ లెక్క..

ప్రభుత్వం ప్రతి నెలా ఆహార భద్రతా లబ్ధిదారులకు సబ్సిడీ ధరలపై బియ్యం, కిరోసిన్, గోధుమలను చౌకధరల దుకాణాల ద్వారా అందజేస్తోంది.. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల పరిధిలో 15 లక్షల పైచిలుకు కార్డులున్నాయి. కార్డుదారుడికి ఎల్పీజీ గ్యాస్ కనెక్షన్ ఉంటే లీటర్.. లేకపోతే రెండు లీటర్ల కిరోసిన్ అందజేస్తున్నారు. అదీ కూడా లీటర్‌కు రూ.21 చొప్పున పంపిణీ చేస్తున్నారు. ఈ లెక్కన ఒక్క హైదరాబాద్ జిల్లాకే ప్రతి నెలా 6.64 లక్షల లీటర్ల కిరోసిన్‌ను సరఫరా చేస్తున్నట్లుగా గణాంకాలు చెబుతున్నాయి. అయితే.. ఈ లెక్కలు కాగితాలకే పరిమితమయ్యాయి.. క్షేత్రస్థాయిలో లబ్ధిదారులకు చేరడం లేదు.



చివర్లో వెళ్తేనే..

నగరంలో ప్రతి నెలా ఒకటో తారీఖు నుంచి 25 వరకు రేషన్ పంపిణీ చేస్తారు. ప్రతి శుక్రవారం సెలవు. సాధారణంగా ఒకటి నుంచి పదిహేనో తేదీ లోపలే 70 శాతానికి పైగా సరుకులు తీసుకుంటారు. అదే కిరోసిన్ విషయానికొస్తే 12 లేదా 13 తారీఖు అలాట్‌మెంట్ అవుతుంది.. 15 లేదా పదహారో తారీఖు ఆయిల్ కంపెనీల గోదాంల నుంచి చౌకధరల దుకాణాలకు చేరుతుంది. ఒక్కోసారి 18.. 19.. ఇరవయ్యో తేదీ కూడా అవుతున్నట్లుగా డీలర్లు వివరిస్తున్నారు. అంటే.. చివర్లో వెళ్లే వాళ్లకు మాత్రమే కిరోసిన్ అందుతుందన్న మాట. ఇక ముందు తీసుకున్న వాళ్ల పరిస్థితి అంతే. ఇచ్చేదే లీటర్.. రెండు లీటర్లు.. దానికోసం పదే పదే ఏం తిరుగుతాంలే అనుకుంటూ కొందరు అటువైపే వెళ్లడం లేదు. ఇంకొన్ని చోట్లనేమో డీలర్లు ఈ నెల తక్కువగా వచ్చింది.. వచ్చే నెలలో చూద్దాంలే అంటూ తిప్పి పంపుతున్నారు. ఇది ఏ ఒక్క నెలకో పరిమితం కాలేదు.. కొన్నేళ్ల నుంచి ఇదే పరిస్థితి. లెక్కలన్నీ చూసుకున్నాకా.. అదను చూసి మిగిలిన కోటాను చిరు వ్యాపారులకు లీటర్‌కు రూ.30-35 వరకు విక్రయిస్తున్నారు. మరికొందరేమో పెట్రోల్, డీజిల్ కల్తీ చేసే కేటుగాళ్లకు అమ్ముతున్నట్లుగా ఆరోపణలు వినిపిస్తున్నాయి.

సినిమా చూస్తున్నారు..

ఈ మొత్తం వ్యవహారంలో అసలు లోపం ఎవరి దగ్గర ఉందంటే.. అన్ని వేళ్లు పౌరసరఫరాల శాఖ వైపే చూపిస్తున్నాయి. అవును.. అసలు ఇచ్చేదే మూడు సరుకులు.. అవి కూడా ఒక్కసారి పంపిణీ చేయడం లేదు. అక్రమార్కుల చేతికి తాళాలు ఇచ్చి చోద్యం చేస్తున్నారన్న మాట. గతంలో ఆలస్యంగా కిరోసిన్‌ను సరఫరా చేయడం వల్ల అక్రమాలు జరుగుతున్నట్లుగా నగర పౌరసరఫరాల శాఖ గుర్తించింది.. అన్ని సరుకుల్ని మొదటి తేదీ నుంచే చౌకధరల దుకాణాల్లో అందుబాటులో ఉంచారు. కార్డుదారులు సైతం ఒకేసారి అన్నింటి తీసుకోని వెళ్లేవారు. కొన్ని నెలల వరకు ఇలాగే జరిగింది.. తర్వాత ఏమయ్యిందో ఏమో గానీ మళ్లీ పరిస్థితి మొదటికొచ్చింది. 'కిరోసిన్ పంపిణీలో ఆలస్యం జరుగుతున్న మాట వాస్తవమే. ఈపోస్ యంత్రాలు ఉన్నాకా అక్రమాలు ఎలా జరుగుతాయి. అలాంటి అవకాశమే లేదు' అంటూ సంబంధిత యంత్రాంగం స్పష్టం చేస్తుండటం గమనార్హం.

15 తర్వాతే రండి..

మనలో చాలా మందికి ఓ సందేహం వస్తుంది.. అదేంటంటే.. అన్ని దుకాణాల్లో ఈపోస్ యంత్రాలు ఉన్నాయి.. వేలి ముద్రలు వేస్తేనే కదా రేషన్ పంపిణీ చేస్తున్నారు.. అయినా.. కిరోసిన్ పక్కదారి ఎలా పడుతుంది..? ఇక్కడే కొందరు డీలర్లు తెలివిగా వ్యవహరిస్తున్నారు. వాస్తవానికి వేలి ముద్రలు వేయగానే.. ఏయే సరుకుల్ని పంపిణీ చేస్తున్నారో అందులో టిక్ చేయాలి. అప్పుడు ఓ ప్రింట్ అవుట్ వస్తుంది.. దాన్ని లబ్ధిదారులకు అందజేయాలి. కానీ.. అధిక శాతం మంది డీలర్లు అసలు ప్రింట్ ఇవ్వడం లేదు సరికదా కనిపించకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. బియ్యం, గోధుమలు మాత్రమే ఇస్తున్నారు. కానీ.. యంత్రంలో మాత్రం కిరోసిన్ కూడా ఇచ్చినట్లుగా నమోదు చేస్తున్నారు. ఎవరైనా కిరోసిన్ ఏదని అడిగితే ఇంకా రాలేదు.. 15 తర్వాత వచ్చి తీసుకోండంటూ సమాధానం చెబుతున్నారు. కావాలనుకుంటే అధికారులకు కూడా ఫిర్యాదు చేసుకోమని స్పష్టం చేస్తున్నారు. నిజానికి అప్పటికీ కిరోసిన్ కోటా చౌకధరల దుకాణాలకు చేరడం లేదు.

ఆన్‌లైన్ ట్రేడింగ్ పేరిట కుచ్చుటోపీ

- నిందితుణ్ని నిర్బంధించిన బాధితులు
- అపహరించారంటూ భార్య ఫిర్యాదు



తన భర్తను కిడ్నాప్ చేశారని ఫిర్యాదు చేసిన అపర్ణతో పాటు కుమార్‌రెడ్డి.. ఆరోపణలు ఎదుర్కొంటున్న క్లాసికల్ డ్యాన్సర్ సుధాకర్‌రెడ్డి

అమీర్‌పేట, న్యూస్‌టుడే: ఆన్‌లైన్ ట్రేడింగ్ వ్యాపారం పేరిట పలువురికి కుచ్చుటోపీ పెట్టిన వ్యక్తిని నిర్బంధించారంటూ ఎస్సార్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు అందింది. కేసు నమోదు అంశాన్ని పోలీసులు పరిశీలిస్తున్నారు. ఇన్‌స్పెక్టర్ వహీదుద్దీన్ వివరాల ప్రకారం.. చిత్తూరు జిల్లా సోమాల మండలం నెలిమందకు చెందిన ఎన్.కుమార్‌రెడ్డి అలియాస్ రెడ్డి కుమార్ భార్య అపర్ణతో దిల్‌సుఖ్‌నగర్‌లో నివసిస్తున్నాడు. అతనికి చెన్నైకి చెందిన ఓ ట్రేడింగ్ బుకీతో పరిచయమైంది. ఆన్‌లైన్ ట్రేడింగ్ వ్యాపారంలో లాభాలుంటాయని బుకీ చెప్పడంతో ఎఫెక్స్ అనే షేర్ మార్కెట్ వెబ్‌సైట్‌ను ప్రారంభించాడు. నగరంలో ఈవెంట్స్ నిర్వహించే మహాలక్ష్మితో పాటు పాటు క్లాసికల్ డ్యాన్సర్ సుధాకర్‌రెడ్డిలకు ట్రేడింగ్ వ్యాపారం గురించి వివరించాడు. చందానగర్‌లో ఓ కార్యాలయాన్ని తెరిచాడు. 30 మందితో ఓ స్కీమ్ ప్రారంభించి నెలకు రూ.2 వేల చొప్పున వసూలు చేశాడు. ప్రతీ నెల డ్రా తీస్తూ అయిదు నెలల పాటు డ్రాలో గెలుపొందిన వారికి రూ.25 వేల చొప్పున చెల్లిస్తూ వచ్చాడు. మరో 15 మంది స్కీమ్‌లో చేరారు. వారి నుంచి రూ.60 వేలు డిపాజిట్ చేయించుకుని డ్రాలో విజేతకు నెలకు రూ.60 వేల చొప్పున, డ్రాలో పేరు రాని వారికి నెలకు రూ.5 వేల చొప్పున ఇస్తూ పోయాడు. ఇలా స్కీమ్‌లో పెద్ద సంఖ్యలో సభ్యులు చేరారు. అనంతరం నష్టాల పేరిట బోర్డు తిప్పేశాడు. బాధితులు కొందరు చందానగర్ పోలీస్‌స్టేషన్‌లో కుమార్‌రెడ్డిపై ఫిర్యాదు చేసి మహాలక్ష్మి, సుధాకర్‌రెడ్డిలపై ఒత్తిడి పెంచారు. అమీర్‌పేటలో మళ్లీ కార్యాలయాన్ని తెరిచిన కుమార్‌రెడ్డిని వారిద్దరూ పట్టుకున్నారు. బల్కంపేటలోని ఇంటికి తీసుకెళ్లి డబ్బు ఇవ్వాలని నిలదీసి తమ వెంట తీసుకుపోయారు. వారం రోజులైనా తన భర్త ఇంటికి రాకపోవడంతో మహాలక్ష్మి, సుధాకర్‌రెడ్డిలే తన భర్తను కిడ్నాప్ చేశారంటూ అపర్ణ బుధవారం ఎస్సార్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. గాంధీనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఉన్న కుమార్‌రెడ్డితో పాటు మహాలక్ష్మి, సుధాకర్‌రెడ్డిలను పోలీసులు తీసుకొచ్చారు. కేసు విషయమై దర్యాప్తు చేస్తున్నామని, అన్ని కోణాల నుంచి పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామన్నారు. కుమార్‌రెడ్డిపై చిక్కడపల్లి, సైబరాబాద్ సీసీఎస్‌లలో కేసులు నమోదైనట్లు తెలిసింది.

మియాపూర్‌లో ఐటీ ఉద్యోగి దారుణం

- భార్యపై హత్యాయత్నం
- అపస్మారక స్థితిలో వదిలేసి వెళ్లిన వైనం



చికిత్స పొందుతున్న పుష్పశ్రీ

మియాపూర్, న్యూస్‌టుడే: జీవితాంతం కష్టసుఖాల్లో తోడు నీడగా ఉంటానంటూ అగ్నిసాక్షిగా ప్రమాణం చేసిన భర్త కిరాతకుడిగా మారాడు.. పెళ్లయిన నాటినుంచే చిన్న కారణాలతో సూటిపోటి మాటలతో శారీరకంగా, మానసికంగా వేధిస్తూ వచ్చిన ఆ మృగాడు చివరికి భార్యను కడతేర్చేందుకు సిద్ధమయ్యాడు. ఈ క్రమంలో అతడు తీవ్రంగా దాడిచేయడంతో అపస్మారక స్థితికి చేరిన ఆ మహిళ ప్రాణాపాయంనుంచి బయటపడి ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. మియాపూర్ ఠాణా పరిధిలో బుధవారం వెలుగులోకి వచ్చిన ఈ ఘటనకి సంబంధించి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం. . విజయవాడ సమీపంలోని కొండపల్లి పుష్పశ్రీకి, విజయవాడకి చెందిన బ్రహ్మేశ్వరరావుతో ఐదేళ్ల కిందట వివాహం జరిగింది. ఇతను గచ్చిబౌలిలోని ఓ సాఫ్ట్‌వేర్ సంస్థలో ఐటీ ఇంజినీరు. మియాపూర్‌లోని ఫ్రెండ్స్ కాలనీలో భార్యతో కలిసిఉంటున్నాడు. వీరికి పిల్లలు లేరు. పెళ్లయిన కొద్దిరోజుల నుంచి భార్యని పలు రకాలుగా వేధింపులకి గురి చేస్తున్నాడు. ఈ క్రమంలోనే.. మంగళవారం రాత్రి బ్రహ్మేశ్వరరావు భార్యని తీవ్రంగా కొట్టడంతో ఆమె అపస్మారక స్థితికి చేరుకుంది. ఆ స్థితిలో కూడా ఆమెను ఇంటి బయట ఉంచి ఫ్లాట్‌కు తాళం వేసి వెళ్లిపోయాడు. ఇది గమనించిన ఇరుగుపొరుగు వారు నగరంలోని బాధితురాలి బంధువులకి తెలిపారు. అనంతరం ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. పుష్పశ్రీ ఆరోగ్య పరిస్థితి మెరుగ్గానే ఉందని ఎస్ఐ అప్పారావు తెలిపారు. ఆమె తండ్రి మోహన్‌శంకర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు బ్రహ్మేశ్వరరావుపై వేధింపులతో పాటు హత్యాయత్నం కేసు నమోదు చేసినట్లు తెలిపారు. అతడి కోసం గాలిస్తున్నట్లు చెప్పారు.

బల్దియాలో భలే దందా!

(మొదటి పేజీ తరువాయి) అధికారులు విశ్లేషిస్తున్నారు.

ఇవిగో ఉదాహరణలు..: జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో స్టాటిస్టికల్ అధికారిగా పని చేస్తున్న వ్యక్తి ఉద్యోగులకు జీతాలు చెల్లించే ఏజెన్సీలను గుప్పిట్లో పెట్టుకున్నారు. వాళ్ల ద్వారా ఎక్కడెక్కడ ఖాళీలు ఏర్పడుతున్నాయో తెలుసుకుంటున్నారు. అక్కడ నియామకాలు చేసేందుకు నిరుద్యోగుల నుంచి రూ.2లక్షలకుపైగా వసూలు చేస్తున్నారు. ● అక్రమ నియామకాల్లో ఐటీ విభాగానికీ పాత్ర ఉంది. ప్రస్తుతం జీహెచ్ఎంసీలో బయోమెట్రిక్ హాజరు విధానం నడుస్తోంది. నిబంధనల ప్రకారం పరిపాలన విభాగం ద్వారా నియామక ఉత్తర్వులు వెళ్తే.. వాటి ఆధారంగా ఐటీ విభాగం బయోమెట్రిక్ హాజరులో అభ్యర్థి వేలి ముద్రలు నమోదు చేయాలి. కానీ పరిపాలన విభాగంతో సంబంధం లేకుండానే హాజరు పట్టికలో పేరు చేర్చి, జీతాలు చెల్లించేస్తున్నారు. ● మేయర్ పేషీలోనూ ఓ వ్యక్తి ఉద్యోగాలు ఇప్పిస్తామని డబ్బు తీసుకుంటున్నట్లు ఫిర్యాదులొస్తున్నాయి. ఇటీవల రూ.4లక్షలు తీసుకుని పట్టణ ప్రణాళిక విభాగంలో ఉద్యోగం ఇప్పించినట్లు సమాచారం. ● దళారులు పారిశుద్ధ్య విభాగంతోపాటు.. కార్యాలయాల్లోని వేర్వేరు ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ నిరుద్యోగుల నెత్తిన టోపీ పెడుతున్నారు. వీళ్లు నిరుద్యోగులను వెంటపెట్టుకుని జీహెచ్ఎంసీ కార్యాలయానికి వస్తున్నారు. ● డ్రైవర్ ఉద్యోగాలంటూ.. ఆయా సర్కిళ్లు, పార్కింగ్ యార్డుల్లోని ఇంజినీర్లు అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారు. రూ.50వేలు చెల్లించి ఉద్యోగంలో చేరానని బాధితులు చెబుతున్నారు.

కొలనులకు విఘ్నాలు!

(మొదటి పేజీ తరువాయి) పాటు ఈ కార్యక్రమం కొనసాగే పరిస్థితులు నెలకొంటున్నాయి. ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో చేసిన రంగు రంగుల విగ్రహాలను హుస్సేన్‌సాగర్‌లో నిమజ్జనం చేస్తుండటంతో ఇక్కడ నీటి కాలుష్యం స్థాయి భారీగా పెరిగిపోతోంది. ఈ పరిస్థితిని నివారించేందుకు బెంగళూరు తరహాలో ఏ ప్రాంతం విగ్రహాలు ఆ ప్రాంతంలోని చెరువుల్లోనే నిమజ్జనం చేసేలా ప్రోత్సహించాలని అధికారులు భావించారు. స్థానిక చెరువుల్లో విగ్రహాలు నిమజ్జనం చేసినా అవి కూడా కలుషితం కాకుండా ఉండేందుకు వీలుగా చెరువుల్లోని ఒక భాగంలో ప్రత్యేకంగా కొలనులు నిర్మిస్తారు. ఈ కొలను చుట్టూ మెట్లు ఉంటాయి. విగ్రహాన్ని సులభంగా నిమజ్జనం చేసేందుకు ఏర్పాట్లు చేస్తారు. ఇందుకోసం ఒక్కో నిమజ్జన కొలనుకు రూ.90లక్షల నుంచి రూ.1.20కోట్ల వరకూ కేటాయించి పనులు చేపట్టాలని ప్రభుత్వం ఆదేశించింది.

వేగం పెరగాల్సిందే.. : నిమజ్జన కొలనుల నిర్మాణ పనులు ఆశించినంత వేగంగా జరగడం లేదు. చెరువుల కట్టలు పటిష్ఠపరచడానికి అవసరమయ్యే మట్టి లభించడం లేదని అధికారులు చెపుతున్నారు. అయితే వీటిని సమయానికి సిద్ధం చేసేందుకు కృషి చేస్తున్నామని నీటి పారుదల శాఖ ఈఈ శేఖర్‌రెడ్డి స్పష్టం చేశారు.



రామంతాపూర్‌లోని జయసూర్య పొట్టి శ్రీరాములు ప్రభుత్వ హోమియోపతి కళాశాల 50 ఏళ్లు పూర్తి చేసుకుని స్వర్ణోత్సవాలకు ముస్తాబవుతోంది. 1967లో స్థాపించిన ఈ వైద్యకళాశాల నాటినుంచి నేటివరకు ఎంతో ప్రాచుర్యం పొంది రెండు తెలుగు రాష్ట్రాల్లో, దేశంలోనే అత్యుత్తమ స్థానాన్ని కైవసం చేసుకోవడం విశేషం.

23, 24న రామంతాపూర్ హోమియోపతి కళాశాల 50 వసంతాల వేడుకలు

వైద్య సేవకు.. స్వర్ణోత్సవం!





న్యూస్‌టుడే, హబ్సిగూడ

హోమియోపతి వైద్యం.. ప్రపంచంలోనే ప్రజాదరణ పొందిన వైద్యం. భారతదేశంలో దీనికి లభిస్తున్న ప్రచుర్యం ప్రపంచంలో దేనికీ ఉండదు. 200 ఏళ్ల నుంచి వాడుకలో ఉంది. హోమియోపతి వైద్య పితామహుడు డా.శామ్యూల్ హానిమన్. హోమియోపతి మందులతో రోగనివారణ శాశ్వతంగా ఉంటుందనే నమ్మకం ప్రజల్లో బాగా నాటుకుపోయింది. అందుకే హోమియోపతి వైద్యశాలకు అత్యంత ప్రాచుర్యం ఉంది. తెలుగు రాష్ట్రాల నుంచి ఎంతోమంది రోగులు రామంతాపూర్ ప్రభుత్వ హోమియోపతి వైద్యశాలకు ప్రజలు వస్తుంటారు. ఈనెల 23, 24న రామంతాపూర్‌లోని ప్రభుత్వ హోమియోపతి కళాశాలలోనే సిల్వర్ జూబ్లీ వేడుకలు జరుగుతాయని ప్రిన్సిపల్ డా.లింగరాజు తెలిపారు. 50 వసంతాల వేడుకలను అత్యంత వైభవంగా జరపడానికి ప్రణాళిక రూపొందించామన్నారు. పూర్వ వైద్య విద్యార్థులందరూ ఈ వేడుకలకు రావాలని ఆహ్వానాన్ని పంపించామన్నారు.

నాడు రెండు కళాశాలలు.. నేడు ఒకటిగా మార్పు..

రామంతాపూర్ ప్రధానరహదారిలో 5 ఎకరాల స్థలంలో 1967లో జయసూర్య హోమియోపతి కళాశాల, పొట్టి శ్రీరాములు హోమియోపతి కళాశాలగా రెండు వేర్వేరు కళాశాలలుండేవి. 1972లో ఈ రెండు కళాశాలలను ఒకటి చేసి జయసూర్య పొట్టిశ్రీరాములు హోమియోపతి వైద్యకళాశాలగా మార్చారు. ఈ కళాశాల ఇండియన్ బోర్డ్ ఆఫ్ మెడిసిన్ అండ్ హోమియోపతి ఆధ్వర్యంలో పనిచేసింది. గత ఏడాది నుంచి వరంగల్ కాళోజీ నారాయణరావు హెల్త్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో నడుస్తోంది.


శిక్షణలో వైద్య విద్యార్థులు

ఎయిడ్స్‌కు మందు కనిపెట్టిన ఘనత..



రామంతాపూర్‌లోని జేఎస్‌పీఎస్ హోమియోపతి వైద్యశాల.. ఎయిడ్స్ మహమ్మారికి మందును కనుక్కోవడం ఒక చారిత్రాత్మక ఘట్టం. తెలుగు రాష్ట్రాల్లో ఎందరో ఎయిడ్స్‌తో బలైపోతున్నారు. ఇలాంటి రోగాన్ని నయం చేసే వైద్యాన్ని డా.ప్రవీణ్‌కుమార్ ఇతర వైద్యులు కలిసి కనిపెట్టడంతో దేశంలోని ఎయిడ్స్ రోగులందరూ రామంతాపూర్ వైద్యశాలకు తరలివస్తున్నారు.

హోమియోపతి వైద్యశాల ప్రత్యేకత..

రామంతాపూర్ హోమియోపతి వైద్యశాలలో ఈ ఏడాది నుంచి రోగుల కోసం ప్రత్యేక క్లినిక్‌ను ప్రారంభించారు. ఈ శిబిరం ప్రధానంగా మూత్రపిండాల రాళ్లు, పిస్టులా, మెదడువాపు వ్యాధి, విషజ్వరం, సీజనల్ వ్యాధుల నివారణకు ప్రత్యేకం. హోమియోపతి వైద్యశాలకు ప్రతిరోజు 800 నుంచి 1000 మంది రోగులు వస్తుంటారు. ఇన్‌పేషెంట్ విభాగంలో రోజుకు 50 మంది చికిత్స కోసం చేరుతున్నారు.

కళాశాల విద్యార్థి కావడం గర్వకారణం

–డా. రాజేందర్‌రెడ్డి, ఆయూష్ కమిషనర్



రామంతాపూర్‌లోని ప్రభుత్వ హోమియోపతి కళాశాలలో వైద్య విద్యార్థిని కావడం నాకు గర్వంగా ఉంది. ఇక్కడ చదువుకుని, ఇక్కడే వైద్యునిగా, ఆయూష్ అదనపు డైరక్టర్‌గా, నేడు ఆయూష్ కమిషనర్‌గా కొనసాగడం చాలా ఆనందంగా ఉంది. అయితే కళాశాలలో వేడుకలను జరుపుకోవాలంటే ఆడిటోరియం లేదు. దానిని నిర్మించడానికి చర్యలు తీసుకుంటాం. అంతేకాకుండా హోమియోపతి కళాశాలకు జాతీయ స్థాయిలో గుర్తింపు వచ్చేవిధంగా చర్యలు తీసుకుంటా.

ఏరోజున దేనికి చికిత్స?

సోమవారం	ఎయిడ్స్
మంగళవారం	మధుమేహం
బుధవారం	హైపర్ టెన్షన్
గురువారం	ఎయిడ్స్
శుక్రవారం	ఊపిరితిత్తుల సంబంధిత వ్యాధులకు
శనివారం	ఊబకాయం

నాటి విద్యార్థులే వీరు..

నాడు కళాశాలలో 40 మందితో ప్రారంభమై నేడు వేలాది మంది వైద్యవిద్యను అభ్యసిస్తున్నారు. వైద్యవిద్యను అభ్యసించినవారు నేడు ఉన్నత స్థానంలో ఉన్నారు. దిల్లీలో తెలంగాణ ప్రభుత్వ అధికార ప్రతినిధి డా.వేణుగోపాలచారి, ఆయూష్ కమిషనర్ డా.రాజేందర్‌రెడ్డి ఈ కళాశాలల విద్యార్థులే. వీరు కాక ఎందరో వైద్యులు వివిధ వైద్య వృత్తిలో కొనసాగుతున్నారు. ఈక్రమంలో పూర్వ విద్యార్థులందరు కలిసి వేడుకలను నిర్వహించనుండటం విశేషం.



మిస్ ట్విన్ సిటీ-2017 ఎంపిక ప్రక్రియ ప్రారంభం

అమీర్‌పేట: 'సూత్ర' ఆధ్వర్యంలో ఈ మాసాంతంలో నగరంలో నిర్వహించనున్న మిస్ ట్విన్ సిటీ-2017 పోటీల ప్రక్రియ బుధవారం ప్రారంభమయింది. నగరంలోని వివిధ ప్రాంతాలకు చెందిన యువతులు ఎంపిక పోటీల్లో పాల్గొని ర్యాంప్‌పై క్యాట్‌వాక్‌తో ఆకట్టుకొన్నారు. తమ ప్రతిభా పాటవాలను ప్రదర్శించారు. అమీర్‌పేటలోని గ్రీన్‌పార్క్ మ్యారీగోల్డ్ హోటల్‌లో దీనికి వేదికైంది. 15 మంది ముద్దుగుమ్మలు హాజరుకాగా ఫ్యాషన్ షో కూడా నిర్వహించారు. ఎంపికైన యువతులకు నిర్వాహకులైన మోనిక, ఉమేష్ మధ్యాన్‌లు బ్యాడ్జి నంబర్లను కేటాయించారు.

మట్టి విగ్రహాల తయారీ పోటీలు


విలేకరులతో మాట్లాడుతున్న రాధిక, ప్రభాకర్

నారాయణగూడ, న్యూస్‌టుడే: పర్యావరణానికి హాని లేకుండా గణేష్ నవరాత్రుల విశిష్టతను తెలియజేయాలని కాలుష్య నియంత్రణ మండలి, ఎన్‌జీసీల సంయుక్తాధ్వర్యంలో మట్టి వినాయక విగ్రహాల తయారీపై పోటీలు నిర్వహించనుంది. బుధవారం నారాయణగూడలో ఎన్‌జీసీ సమన్వయకర్త ప్రభాకర్, కాలుష్య నియంత్రణ మండలి ప్రాజెక్టు డైరెక్టర్ రాధిక మాట్లాడుతూ.. పోటీల్లో పాల్గొనే వారికి మట్టి అందిస్తామన్నారు. పూజ చేసేందుకు వాడే పత్రి విశేషాలనూ వివరిస్తామన్నారు. 18న ఉదయం సీఎంఆర్ మోడల్ స్కూల్ (బోయిన్‌పల్లి), అదే రోజు మధ్యాహ్నం సికింద్రాబాద్ మహబూబ్ కళాశాల, 19న నారాయణగూడ కేశవ స్మారక పాఠశాల, మధ్యాహ్నం మలక్‌పేట్ ప్రభుత్వ పాఠశాల, 20న పబ్లిక్‌గార్డెన్స్‌లోని జవహర్ బాలభవన్, మధ్యాహ్నం బోయిన్‌పల్లిలోని స్వర్ణధామ్ కాలనీలో పోటీలు ఉంటాయన్నారు. 22న సరస్వతి శిశుమందిర్ (బండ్లగూడ)లో నిర్వహించే కార్యక్రమంలో విజేతలకు ప్రశంసా పత్రాలు ఇస్తామని రాధిక వివరించారు. వివరాలకు 91002 69797, 92462 73583 నంబరులో సంప్రదించాలని కోరారు.





నాటిన 'ఫలాలు'!

హరితహారంలో మొక్కలు నాటితే అవి చెట్లుగా ఎదిగి నీడనివ్వడమే కాకుండా పండ్లనూ అందిస్తాయని ఈ చిత్రాలతో తెలుస్తుంది

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటండి: బ్యాడ్మింటన్ క్రీడాకారిణి పీవీ సింధు

పేట్‌బషీరాబాద్: పర్యావరణ పరిరక్షణకు మొక్కల పెంపకం ఎంతో అవసరమని ప్రముఖ బ్యాడ్మింటన్ క్రీడాకారిణి పి.వి.సింధు తెలిపారు. హరితహారంలో భాగంగా బుధవారం సుచిత్రా అకాడమీలో ఆమె జీహెచ్‌ఎంసీ కమిషనర్ జనార్దన్‌రెడ్డితో కలిసి మొక్క నాటారు. మొక్కల పెంపకంపై విద్యార్థులకు చిన్నతనం నుంచే అవగాహన కల్పించాలని సూచించారు. క్రీడల ద్వారా మానసికోల్లాసంతో పాటు ఆత్మస్థైర్యం పెంపొందే అవకాశాలుంటాయన్నారు. జీహెచ్‌ఎంసీ కమిషనర్ జనార్దన్‌రెడ్డి మాట్లాడుతూ.. స్వచ్ఛభారత్‌పై అవగాహన కల్పించేందుకు కరచాలనానికి బదులు స్వచ్ఛ నమస్కార్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో జోనల్ కమిషనర్ శంకరయ్య, కుత్బుల్లాపూర్ ఉపకమిషనర్ సుధాంష్ తదితరులు పాల్గొన్నారు.


మొక్కకు నీరు పోస్తున్న పి.వి.సింధు, జనార్దన్‌రెడ్డి

రాజేంద్రనగర్

శంషాబాద్ మార్కెట్‌లో... కూరగాయల ధరలు

శంషాబాద్: శంషాబాద్ మార్కెట్‌లో బుధవారం నాటి కూరగాయల ధరలు (కిలో రూపాయల్లో) టమాటా 45, ఆలుగడ్డ 25, బెండకాయ 35, దొండకాయ 25, కాకరకాయ 45, చిక్కుడుకాయ 50, బీరకాయ 40, దోసకాయ 30, గోకరకాయ 30, సొరకాయ 20, పొట్లకాయ 20, వంకాయ తెల్లది 40, వంకాయ నల్లది 30, పచ్చిమిర్చి 50, ఉల్లిగడ్డలు 30, బీర్నీసు 30.

నేరాల చీకట్లపై...

☛ ప్రతిష్ఠాత్మకంగా దీపాల ఏర్పాటు

☛ మైలార్‌దేవుపల్లి డివిజన్ ఆదర్శం

ఎల్‌ఈడీ వెలుగులు

న్యూస్‌టుడే, కాటేదాన్

ఓ వైపు అంధకారంతో కొట్టుమిట్టాడుతున్న ప్రజలు... మరోవైపు చీకట్లో నేరగాళ్ల చేతివాటం... ఈ పరిస్థితుల్లో బేజారవుతున్న పోలీసులకు ఎల్‌ఈడీ దీపాలు ప్రయోజనకరంగా మారనున్నాయి. గ్రేటర్ అధికారులు ప్రతిష్ఠాత్మకంగా మొదట మైలార్‌దేవుపల్లి డివిజన్, ఆ తర్వాత రాజేంద్రనగర్ సర్కిల్ వ్యాప్తంగా దీపాలను ఏర్పాటు చేస్తున్నారు. ఈ ప్రక్రియలో ప్రత్యేకంగా సైబరాబాద్ పోలీసులు, ట్రాఫిక్ అధికారుల సలహాలు, సూచనలు పాటిస్తుండటం గమనార్హం. ఎల్‌ఈడీ దీపాలతో రాత్రిళ్లు వాహన చోదకులు వెతలు తీరనున్నాయి. ముత్తూట్ ఫైనాన్స్, బాలికల అపహరణలు, చీకటిపడితే చాలు దొంగల స్వైరవిహారంతో బేజారవుతోన్న పోలీసులకు ఎల్‌ఈడీ వెలుగులు ఊరట కలిగించనున్నాయి. ఈ దీపాల కాంతుల్లో వంద మీటర్ల దూరంలో తచ్చాడుతున్న అనమానితులనూ గుర్తించే అవకాశముంది. రహదారి ప్రమాదాలకు పాల్పడి మాయమవుతోన్న వాహనాలను గుర్తించేందుకు పూర్తిస్థాయిలో వీలు కలుగుతోంది. దీంతోపాటు మరిన్ని ప్రధాన ప్రాంతాల్లో సీసీ కెమెరాల ఏర్పాటు ఆవశ్యకత ఉందని పోలీసులు అభిప్రాయపడుతున్నారు. ఈ దీపాలతోనే ఎక్కడెక్కడ సీసీ కెమెరాలు అవసరం ఉన్నాయో పోలీసులు గుర్తిస్తుండటం విశేషంగా మారింది. జోనల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి, రాజేంద్రనగర్ సర్కిల్ అధికారులు నిత్యం సైబరాబాద్ పోలీసుల సలహాలు పాటిస్తున్నారు. అధికారులకు స్థానిక మైలార్‌దేవుపల్లి, రాజేంద్రనగర్ పోలీసులు తమ పూర్తి సహకారాలను అందించడమే కాకుండా తాము గుర్తిస్తున్న అనుమానిత బస్తీలు, రహదారులు, చౌరస్తాల్లో ఎల్‌ఈడీ వెలుగు అందిస్తున్న సహకారంతో ప్రత్యేక నిఘా పెడుతున్నారు.

ప్రయోజనాలివీ...

రాజేంద్రనగర్ సర్కిల్ మైలార్‌దేవుపల్లి డివిజన్‌లోని ప్రమాదాలకు నిలయంగా మారిన బెంగళూరు జాతీయ రహదారి, పాతకర్నూలు రోడ్డు, ఆపై మెహిదీపట్నం మార్గంలో ఉన్న కారిడార్ ఎక్స్‌ప్రెస్‌వే కింది మార్గం, హసన్‌నగర్ నుంచి నగరానికి వెళ్లే జాతీయ రహదారితో పాటు హిమాయత్‌సాగర్ మార్గం తదితర ప్రాంతాల్లో ఏర్పాటైన ఎల్‌ఈడీ దీపాల వెలుగులు వాహన చోదకులకు ఆసరాగా మారింది. ఈ వెలుగులతో రహదారుల్లో అలసట నుంచి ఉపశమనం కలిగేందుకు వాహనాదారులు పార్కింగ్‌లు చేసుకోగలిగే అవకాశముంది. రహదారులతో పాటు అంతర్గత మార్గాల్లో మైలార్‌దేవుపల్లి డివిజన్‌లోనే 90 శాతం... 6 వేలకు పైగా ఈ బల్బులు అమర్చినట్లు అధికారులు పేర్కొంటున్నారు. మరో పదిరోజుల్లో డివిజన్‌లో వందశాతం పూర్తి కానున్న ఈ పనులు... సర్కిల్‌లోని మరో నాలుగు డివిజన్‌లలో వేగవంతంగా ముందుకు కొనసాగుతున్నాయి. మైలార్‌దేవుపల్లి ఠాణాతో పాటు రాజేంద్రనగర్ ఠాణా పరిధిలో నేరగాళ్ల ఆటకట్టించేందుకు ఈ ఎల్‌ఈడీ దీపాలు తోడ్పాటు అందించనున్నాయని పోలీసు అధికారులు పేర్కొంటున్నారు. ఈ రెండు ఠాణాల పరిధిలోనే అధికంగా జరిగే నేరాలు, రహదారి ప్రమాదాలను నివారించే అవకాశమొచ్చేసిందని అంతా సంతోషం వ్యక్తం చేస్తున్నారు.



దీపాలు పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ శ్రీనివాస్‌రెడ్డి



ఎల్‌ఈడీ బల్బుల ఏర్పాట్లతో ప్రకాశిస్తున్న రహదారులు

గ్రేటర్ హైదరాబాద్‌లోని మైలార్‌దేవుపల్లి డివిజన్‌లోనే ఎల్‌ఈడీ దీపాలు ఏర్పాటుచేయడం ప్రప్రథమమని స్థానిక కార్పొరేటర్ శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. గ్రేటర్ అధికారుల చొరవ విశేషమన్నారు. మరో వారంలో వందశాతం డివిజన్‌లో ఈ ఎల్‌ఈడీ దీపాల ఏర్పాట్లు పూర్తి కానున్నాయన్నారు. సర్కిల్ వ్యాప్తంగా పనులు వేగంగా కొనసాగుతున్నాయన్నారు.

'పూర్తిస్థాయిలో సహకరిస్తాయి'

నేరాలు, రహదారి ప్రమాదాల నివారణకు ఎల్‌ఈడీ దీపాలు పూర్తిస్థాయిలో సహకరిస్తాయని మైలార్‌దేవుపల్లి ఇన్‌స్పెక్టర్ జగదీశ్వర్ పేర్కొన్నారు. తాజాగా డివిజన్‌తో పాటు ఠాణా పరిధిలో ఎల్‌ఈడీ దీపాల ఏర్పాటుకు అధికారులు మా సహకారాన్ని తీసుకోవడం శుభప్రదమన్నారు. పూర్తిస్థాయిలో తాము రాజేంద్రనగర్ సర్కిల్ అధికారులు, ఆపై జోనల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డికి అందుబాటులో ఉంటున్నామని చెప్పారు. రానున్న పది రోజుల్లో ఠాణా పరిధిలో నేరాలను అరికట్టేందుకు వందశాంతం సిద్ధం కానున్నామని వివరించారు.

క్రూర జంతువు కోసం గాలింపు



పంట పొలాల్లో ఏర్పాటు చేసిన బోన్లు

శంషాబాద్ గ్రామీణ: వ్యవసాయ పంట పొలాల్లో పశువుల పాకలపై గుర్తుతెలియని క్రూర జంతువు వరుసగా పంజా విసురుతోంది. పది రోజుల వ్యవధిలో నాలుగు ఘటనలో నాలుగు మూగ జీవాలు మృత్యువాత పడటంతో పెద్ద షాపూర్ గిరిజన తండాకు చెందిన రైతులు ఆందోళనకు గురవుతున్నారు. రెండేళ్ల క్రితం ఇలాంటి ఘటనలతో రైతులు అల్లాడారు. ప్రస్తుతం గొల్లూర్ అటవీ ప్రాంతానికి ఆనుకొని ఉన్న వ్యవసాయ పంట పొలాల దగ్గర పశువుల పాకలపై గుర్తుతెలియని క్రూర జంతువు దాడి చేసి, మూగ జీవాలను పొట్టన పెట్టుకొంటోంది. ఆ క్రూర జంతువు ఆచూకీ కోసం అటవీ శాఖ అధికారులు రేయింబవళ్లు శ్రమిస్తున్నారు. దాన్ని గుర్తించడానికి వ్యవసాయ పంట పొలాల్లో అత్యాధునిక పరిజ్ఞానం తో కూడిన 22 కెమెరాలు, 5 బోనుల్ని ఏర్పాటు చేశారు. అటవీ శాఖ జిల్లా అధికారి వినోద్ పర్యవేక్షణలో క్రూర జంతువును ప్రాణాలతో బంధించడానికి సర్వ శక్తులూ ఒడ్డుతున్నారు.

కూడలిలో స్తంభమేల?

మణికొండ: మణికొండ పంచవటి సాయిలక్ష్మికాలనీలో ప్రధాన రహదారిలోని కూడలిలో ఏర్పాటు చేసిన ఎల్‌ఈడీ దీపాల స్తంభం ప్రమాదకరంగా ఉందని కాలనీవాసులు వ్యక్తం చేస్తున్నారు. పంచవటికాలనీలోని పలు వీధుల్లో విద్యుత్తు దీపాల ఏర్పాటుకు కొత్తగా స్తంభాలను ఏర్పాటు చేశారు. కాలనీ ప్రధాన రహదారిలోని రెండు కూడళ్లలో రోడ్డు మధ్యలోనే ఎల్‌ఈడీ దీపాలతో స్తంభాన్ని అమర్చారు. కాలనీ ప్రతినిధుల సూచన మేరకే తాము చేశామని గ్రామ పంచాయతీ సిబ్బంది వెల్లడిస్తుండగా.. ఇరుకుగా ఉన్న కూడలిలో స్తంభాల ఏర్పాటుతో భవిష్యత్తులో ప్రమాదాలు వాటిల్లే అవకాశం ఉందని కాలనీవాసులు వ్యక్తం చేస్తున్నారు. కూడలిలో రోడ్డుకు ఇరువైపులా స్తంభాలను ఏర్పాటు చేసిన నాలుగు వైపులా వెలుతురు ఇచ్చేలా దీపాలను అమరిస్తే మరింత సౌలభ్యంగా ఉంటుందని వెల్లడిస్తున్నారు. ఈ విషయమై సర్పంచి నరేందర్‌రెడ్డిని వివరణ కోరగా... అవసరమైతే స్తంభాలను తొలగించి... రోడ్డు పక్కన ఏర్పాటు చేయిస్తామని, కాలనీలో నూతనంగా నిర్మిస్తున్న రామాలయానికి వెళ్లే మార్గంలో సిమెంట్ రోడ్డు పనులను వచ్చే వారంలో చేపడతామని వెల్లడించారు.



పంచవటికాలనీ రహదారిలో మధ్యలో స్తంభం

వాహనం నడిపిన... బాలుడిపై కేసు నమోదు

రాజేంద్రనగర్: ద్విచక్ర వాహనాన్ని అతివేగంగా నడుపుతూ రహదారిపై ఇతరులకు ఇబ్బందులు కలిగించిన ఓ బాలుడి(16)ని రాజేంద్రనగర్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. రాజేంద్రనగర్ ఠాణా సీఐ ఉమెందర్ తెలిపిన వివరాల మేరకు... గోల్కొండకు చెందిన బాలుడు బుధవారం ద్విచక్ర వాహనంపై ఆరాంఘర్ నుంచి అత్తాపూర్ వైపు అతివేగంగా వెళ్తున్నాడు. ఇతర వాహనదారులకు ఇబ్బందుల్ని సృష్టించాడు. పోలీసులు వాహనాన్ని ఆపి అతని ధ్రువపత్రాలు పరిశీలించారు. వయసు పదహారేళ్లు అని ఉండటంతో అతన్ని అదుపులోకి తీసుకొని, కేసు నమోదు చేసినట్లు రాజేంద్రనగర్ ఠాణా సీఐ ఉమెందర్ తెలిపారు.

'దేశాభ్యున్నతికి పాటుపడాలి'



కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు

శంషాబాద్: మనదేశం అభ్యున్నతి కోసం కృషి చేయాలని వక్తలు అభిప్రాయపడ్డారు. శంషాబాద్ మండల కేంద్రంలో స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా బుధవారం శ్రీచైతన్య టెక్నో పాఠశాలలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తొమ్మిదో తరగతి విద్యార్థులు విద్యావ్యవస్థ గురించి మాట్లాడారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకటరెడ్డి, డీన్ కృష్ణకిషోర్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

కిక్‌బాక్సింగ్ పోటీలకు 96 మంది ఎంపిక



విద్యార్థులతో మహిపాల్, రామాంజనేయులు తదితరులు

శంషాబాద్: రంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా జరిగిన కిక్ బాక్సింగ్ ఎంపిక పోటీల్లో తెలంగాణ నుంచి 96 మంది అర్హత సాధించారని కిక్ బాక్సింగ్ రాష్ట్ర అధ్యక్షులు సి.రామాజంనేయులు తెలిపారు. శంషాబాద్ మండల కేంద్రంలో రంగారెడ్డి జిల్లా కిక్ బాక్సింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్టేట్ మీట్ నేషనల్ టీమ్ సెలెక్షన్స్‌ను శంషాబాద్ బాలుర ఉన్నత పాఠశాలలో 13న నిర్వహించారు. 20 జిల్లాల నుంచి 250 మంది విద్యార్థులు పోటల్లో పాల్గొన్నారు. గెలుపొందిన వారికి బంగారు, వెండి, క్యాంసం పతకాలను అందించారు. వచ్చే నెల 6 నుంచి 10 తేదీల్లో ఛత్తీస్‌గఢ్, రాయ్‌పూర్‌లలో నిర్వహించే పోటీల్లో వీరు పాల్గొంటారు. కిక్ బాక్సింగ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.మహిపాల్, రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు ఎం.నర్సింగరావు, ప్రధాన కార్యదర్శి ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు ఘన సన్మానం



సురేష్‌కుమార్‌ను సన్మానిస్తున్న నేతలు

శంషాబాద్: తహసీల్దార్ సురేష్‌కుమార్‌ను శంషాబాద్ మండల కేంద్రంలో బుధవారం మండల తెరాస నాయకులు ఘనంగా సన్మానించారు. తెరాస మండల అధ్యక్షులు చంద్రారెడ్డి మాట్లాడుతూ... రెవెన్యూ దస్త్రాల ప్రక్షాళన కార్యక్రమాన్ని సమర్థంగా నిర్వహించిన అయిదుగురు తహసీల్దార్లలో శంషాబాద్ మండల తహసీల్దార్ సురేష్‌కుమార్‌కు స్వాతంత్ర్య దినోత్సవ వేడుక సందర్భంగా ఉప ముఖ్యమంత్రి మహమూద్ అలీ, చేవెళ్ల ఎంపీ విశ్వేశ్వరరెడ్డి, జిల్లా పాలనాధికారి రఘునందన్‌రావులు పురస్కారాన్ని అందించడం సంతోషకరమన్నారు. దూడల వెంకటేశ్, దీపా మల్లేశ్, సురేష్‌గౌడ్, దర్శన్, హనుమంతు, జీబీ సురేష్, దండు ఇస్తారి, కొనమల్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కొత్వాల్‌గూడ ఎంపీటీసీ ఆకస్మిక మృతి

శంషాబాద్: కొత్వాల్‌గూడ ఎంపీటీసీ ఆకస్మికంగా మృతి చెందారు. శంషాబాద్ మండల పరిధిలోని కొత్వాల్‌గూడ గ్రామానికి చెందిన కాంగ్రెస్ ఎంపీటీసీ కర్నం జయమ్మ(60) పదిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. బుధవారం మధ్యాహ్నం 3 గంటలకు కన్నుమూశారు.

రాజేంద్రనగర్

టీకా కార్యక్రమానికి రానున్న మంత్రి

కాటేదాన్: గురువారం మైలార్‌దేవుపల్లి ప్రభుత్వ పాఠశాలలో రంగారెడ్డి జిల్లా వైద్యాధికారులు చేపడుతున్న తట్టు, రుబెల్లా టీకా కార్యక్రమంలో మంత్రి మహేందర్‌రెడ్డి పాల్గొంటారని జిల్లా మెడికల్ హెల్త్ సూపర్‌వైజర్ శివకుమార్ తెలిపారు. విద్యార్థులే కాకుండా ప్రతిఒక్కరూ హాజరు కావాలని ఆయన కోరారు. కార్యక్రమానికి మైలార్‌దేవుపల్లి పోలీసులు భారీ బందోబస్తు నిర్వహిస్తున్నారు.

అస్తవ్యస్తంగా రహదారులు

అలసత్వంగా అధికారులు



పాడైన రాయన్నగూడ-మల్కారం అనుసంధాన రహదారి

ఆందోళనకు స్పందించని ప్రజాప్రతినిధులు

న్యూస్‌టుడే, శంషాబాద్‌గ్రామీణ

రహదారుల మరమ్మతులు, నిర్వహణను అధికారులు గాలికి వదిలేస్తున్నారు. అడుగడుగునా గతుకులు పడిన రహదారులు... స్థానికులు నడవలేని స్థితికి చేరుకొన్నాయి. ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యం కల్పించడానికి ప్రభుత్వం ఏటా వేల కోట్లు వెచ్చిస్తున్నా అధికారులు-ప్రజాప్రతినిధుల సమన్వయ లోపంతో బూడిదలో పోసిన పన్నీరే అవుతున్నాయి. వరుసగా కురుస్తున్న వర్షాలకు తారుదారులు గుంతల మయమయ్యాయి. ఎప్పటికప్పుడు మరమ్మతులు, నిర్వహణ చేపట్టాల్సిన అధికారులు చేష్టలుడిగి చూస్తుండటంతో గ్రామస్థులు నానా తంటాలు పడుతున్నారు.

పదేళ్లుగా పట్టించుకోక...

పాత శంషాబాద్ - కోళ్లపడకల్ మీదుగా శ్రీశైలం రహదారికి అనుసంధానంగా ఉన్న ఆర్ అండ్ బీ రోడ్డు విమానాశ్రయం నిర్మాణంలో బహదూర్ అలీ మక్తా దగ్గర తెగిపోయింది. ప్రత్యామ్నాయంగా జాతీయ రహదారిపై కిషన్‌గూడ జంక్షన్ దగ్గర రహదారిని అధికారులు పునర్ నిర్మించారు. శంషాబాద్ అంబేడ్కర్ చౌరస్తా నుంచి పాత శంషాబాద్ లోని బహదూర్ అలీ మక్తా వరకు దాదాపు 2 కిలో మీటర్ల ఆర్ అండ్ బీ రహదారి మరమ్మతులను అధికారులు పదేళ్లుగా పట్టించుకోవడం లేదు. ఈ దారి మీదుగా ధర్మగిరి ఆలయం, సీఐఎస్ఎఫ్ సిబ్బంది నివాస గృహాలు, మామిడి పల్లి, శ్రీశైలం రహదారికి అనుసంధానం ఉంది. ఫలితంగా నిత్యం ఆర్టీసీ బస్సులతో పాటు వేల సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. ఇంత ప్రాధాన్యం ఉన్న రహదారి మరమ్మతులను అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదు. ఆగ్రహించిన స్థానికులు రహదారిపై బైఠాయించారు. స్పందన లేక పోవడంతో వారం రోజులుగా రహదారి పక్కన గుడారం వేసుకొని నిరాహార దీక్షలు చేసినా స్పందించిన నాథుడే కరవయ్యారు.

బాగున్నా రూ.కోట్ల నిధులు

బంగారు తెలంగాణ నిర్మాణంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణ రోడ్ల మరమ్మతుల కోసం నవంబరు 2014లో జిల్లాకు రూ.2 వేల కోట్ల నిధులను విడుదల చేశారు. శంషాబాద్ మండలం గ్రామీణ రోడ్ల మరమ్మతులకు రూ.7.88 కోట్లు మంజూరయ్యాయి. సదరు శాఖ ప్రభుత్వ అధికారులు క్షేత్ర స్థాయిలో పర్యటించి బాగా దెబ్బ తిన్న అనుబంధ గ్రామాల అనుసంధాన రహదారుల మరమ్మతులకు అధికారులు వెచ్చించాలి. పలుకుబడి ఉన్న ప్రజాప్రతినిధులు సూచించిన బాగున్న రహదారులకూ అవసరం లేకున్నా అధికారులు రూ.లక్షలు పోసి మరమ్మతులు చేయడం దారుణం అంటు స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎలాంటి మరమ్మతులూ చేయాల్సిన అవసరం లేని సుల్తాన్‌పల్లి రోడ్డు రీబీటీకి రూ.40 లక్షలు, రాళ్లగూడ నుంచి సిద్ధులగుట్ట వరకు రూ.21 లక్షలను ఖర్చు చేశారు. తేలిక పాటి మరమ్మతులు చేయాల్సిన ఈ రహదారులకు నర్కుడ - కవ్వగూడ వరకు రూ.35 లక్షలు, తొండుపల్లి నుంచి శంకరాపూర్ వరకు రూ.90 లక్షలు, కొత్వాల్‌గూడ - సీఆర్ నగర్ వరకు రూ.75 లక్షలు, పెద్దషాపూర్ - జూకల్ వరకు రూ.66 లక్షలు, కొత్వాల్‌గూడ - ఎయిర్‌పోర్ట్ కాలనీ వరకు రూ.50 లక్షలు నిధులను అధికారులు ఖర్చు చేశారు.



శిథిలావస్థకు చేరిన పాత శంషాబాద్ రహదారి

నిధులున్నా... ప్రారంభమేదీ?

పాల్మాకుల్ గ్రామం నుంచి ఇనాంషేరీ, మేకల బండ తాండా అనుబంధ గ్రామాల మీదుగా ముచ్చింతల్ గ్రామం వరకు ఉన్న అనుసంధానం రోడ్డు మరమ్మతుల కోసం 2014లో కన్‌స్ట్రక్షన్స్ ఆఫ్ రూరల్ రోడ్స్ నిధుల నుంచి రూ.కోటి 49 లక్షలు మంజూరయ్యాయి. సరైన సౌకర్యం లేని ఇనాంషేరి, మేకలబండ తాండ వాసులు పడుతున్న కష్టాలు తీరతాయకున్నా ఆశలు అడియాసలయ్యాయి. ఈ రోడ్డుపై నడవడానికి పనికి రాకుండా ఉండటంతో మేకల బండ తాండ వాసులు దారి మళ్లారు. మేకల బండ తండా వాసులు అవసరాల కోసం బయటికి వెళ్లడానికి పి1 బైపాస్ రోడ్డుపై వెళుతున్నారు. తిరుగు ప్రయాణంలో ఇంటికి వస్తుండగా పాలమాకుల బస్టాప్ నుంచి జాతీయ రహదారి మీదుగా సుమారు ఐదు వందల మీటర్ల దూరం అపసవ్య దిశలో రావాల్సి వస్తుంది. ఇక్కడ రోడ్డు పల్లంగా ఉండటంతో నగరం నుంచి షాద్‌నగర్ వైపు జాతీయ రహదారిపై వెళుతున్న వాహనాలు మితి మీరి వేగంతో దూసుకురావడంతో ప్రాణాలను అర చేతిలో పెట్టుకొని వస్తున్నారు. మేకలబండ తాండ వాసులు వెళ్లాల్సిన ఇనాంషేరి మీదుగా ముచ్చింతల్ రోడ్డు మరమ్మతులకు నోచుకోక పోవడంతో ప్రాణ సంకటంగా మారింది. నిధులు మంజూరైనా రహదారి పనులను పూర్తి చేయాల్సిన స్థానిక ఎమ్మెల్యే ఇతర గ్రామాల రహదారుల మరమ్మతులకు కేటాయించడంతో ఇనాంషేరి, మేకల బండ గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



రహదారిని బాగు చేయాలంటూ బైఠాయించిన స్థానికులు

పట్టించుకునే వారేరీ...

రైతులు, వ్యవసాయ కూలీలు, కర్షకులు, కార్మికులు, ఇతరత్రా పనుల మీద పొరుగు గ్రామాలకు వెళ్లాలంటే స్థానికులకు అనుసంధాన రహదారులే దిక్కు. ఇవి శిథిలావస్థకు చేరి ఏళ్లు గడుస్తున్నా అటు అధికారులు కానీ ఇటు ప్రజాప్రతినిధులు కానీ పట్టించుకోవడం లేదు. మల్కారం - రాయన్నాగూడ, పెద్దషాపూర్ - చౌదరిగూడ, జూకల్-నానాజీపూర్, తదితర అనుసంధాన గ్రామాల రహదారులు శిథిలావస్థకు చేరడమే కాకుండా నడవడానికి పనికి రాకుండా గతుకుల దారులగా మారాయి. శంషాబాద్ మండల గ్రామీణ రహదారుల మరమ్మతుల కోసం మంజూరైన కోట్ల నిధులతో ఈ రహదారులను మరమ్మతులు చేయాల్సిన అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు.

ధ్వజస్తంభం ప్రతిష్ఠాపన నేడు

మణికొండ: మణికొండ క్వార్టర్లలోని హనుమాన్ దేవాలయ ప్రాంగణంలో నూతన ధ్వజస్తంభం ప్రతిష్ఠాపనను గురువారం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ ప్రతినిధి రాజేందర్‌గౌడ్ తెలిపారు. నూతనంగా తయారు చేయించిన ధ్వజస్తంభాన్ని ప్రత్యేక పూజలతో ప్రతిష్ఠిస్తున్నట్లు చెప్పారు. ఉదయం జరిగే పూజల్లో గ్రామస్థులు, కాలనీలవాసులు పెద్దసంఖ్యలో హాజరు కావాలన్నారు. అనంతరం పెద్దఎత్తున అన్నదానం చేశారు.

'రుణాలు సద్వినియోగం చేసుకోవాలి'



రుణాలను అందిస్తున్న స్వామిగౌడ్

నార్సింగి: ప్రభుత్వం అందిస్తున్న స్వయం ఉపాధి పథకాలను నిరుద్యోగులు సద్వినియోగం చేసుకుని తీసుకున్న రుణాలకు తిరిగి సకాలంలో చెల్లిస్తే మరి కొంతమందికి ప్రయోజనం కలుగుతుందని శాసనమండలి ఛైర్మన్ స్వామిగౌడ్ అన్నారు. కిస్మత్‌పూర్ గ్రామ పంచాయతీకి చెందిన మైనార్టీ వర్గానికి చెందిన నిరుద్యోగులకు మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ ద్వారా మంజూరైన స్వయం ఉపాధి రుణాలను బుధవారం ఆయన తమ నివాసం దగ్గర పంపిణీ చేశారు. ఈ సందర్భంగా స్వామిగౌడ్ మాట్లాడుతూ... ప్రభుత్వం అన్నివర్గాల వారి సంక్షేమానికి వివిధ పథకాలను అందిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచి జయశ్రీసదానంద్, ఎంపీటీసీలు సురేశ్‌గౌడ్, అస్లాం, ఎన్.శేఖర్, రాములు, ఐసయ్య, సురేశ్, నవీన్, గ్రామ కార్యదర్శి మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

టీకా పంపిణీకి ఏర్పాట్లు పూర్తి

నార్సింగి: నార్సింగి ఆరోగ్యకేంద్రం పరిధిలో తట్టు, రుబెల్లా (ఎంఆర్)వ్యాక్సిన్ పంపిణీ కార్యక్రమం గురువారం నుంచి పంపిణీ చేయడానికి అన్ని ఏర్పాట్లు చేసినట్లు వైద్యాధికారిణి పద్మ ఒక ప్రకటనలో తెలిపారు. నార్సింగి ఆరోగ్య కేంద్రంలో ఎంపీపీ తలారి మల్లేష్ గురువారం ఉదయం 9 గంటలకు ఈ మందు పంపిణీని ప్రారంభిస్తారని తెలిపారు. 9 నెలల వయసు నుంచి 15 ఏళ్లలోపు పిల్లలందరికీ ఈ వ్యాక్సిన్ వేయించాలని ఆమె కోరారు.

నేడు విద్యుత్తు ఉండని ప్రాంతాలు

నార్సింగి: పెద్ద మంగళారం 11 కె.వి. ఫీడర్‌లో మరమ్మతు పనుల కారణంగా గురువారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 వరకు సన్‌సిటీ, భాగ్యనగర్, కపిలానగర్, హైదర్షాకోట్, పీజీ కాలనీ, మాధవీనగర్, గంధంగూడ, కె.కె.నగర్-2, శ్రీనివాస కాలనీలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్ విభాగం ఏఈ తిరుపతయ్యగౌడ్ తెలిపారు.

లారీ డ్రైవర్ అనుమానాస్పద మృతి

అంత్యక్రియల్ని అడ్డుకున్న పోలీసులు ☛ విచారణ చేస్తున్న వైనం

పహాడీషరీఫ్: లారీ డ్రైవర్ అనుమానాస్పదంగా మృతి చెందిన సంఘటన పహాడీషరీఫ్ ఠాణా పరిధిలో ఆలస్యంగా వెలుగుచూసింది. ఇన్‌స్పెక్టర్ లక్ష్మీకాంత్‌రెడ్డి కథనం ప్రకారం... పాతబస్తీ తాడ్‌బన్‌కు చెందిన మొహ్మద్ సలీం(35), షాహిన్‌బేగం దంపతులు. వారికి ముగ్గురు సంతానం. రెండేళ్లుగా పహాడీషరీఫ్‌లో నివసిస్తున్నారు. వృత్తిరీత్యా లారీ డ్రైవర్ అయిన సలీం మద్యానికి బానిస. ఎప్పటిలా మంగళవారం అతిగా మద్యం తాగాడు. అర్ధ రాత్రి దాటాక రెండు గంటలకు ఇంటికి చేరుకున్నాడు. మత్తులో టీవీ పెట్టుకుని, చూస్తూనే నిద్రకు ఉపక్రమించాడు. బుధవారం ఉదయం 7 గంటలకు షాహిన్‌బేగం భర్తను లేపడానికి ప్రయత్నించింది. లేవకపోవడంతో పక్కనే ఉండే ఫారూక్ అనే వ్యక్తికి పిలిచి, పరిశీలించాలని వేడుకుంది. అతను అప్పటికే మృతి చెందినట్లు గుర్తించారు. అదేరోజు చాంద్రాయణగుట్టలో ఉండే వారి సోదరులు అక్కడే అతని అంతిమ సంస్కారాలు చేస్తున్నారు. ఈ మేరకు పోలీసులకు సమాచారం అందడంతో... వారు అక్కడికి చేరుకున్నారు. మృతునికి ముక్కు, మెడ భాగాల్లో రక్తం కారడంతో అనుమానాలున్నాయని అక్కడి పోలీసులు పహాడీషరీఫ్ పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు అంత్యక్రియల్ని ఆపు చేయించి, మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్నారు.

పాత పనులకే రూ.లక్షలు

శంషాబాద్ గ్రామీణ: పన్నుల రూపేణా ప్రభుత్వానికి చెల్లిస్తున్న ప్రజల కష్టార్జితం ప్రతిపైసా వృథా కాకుండా ఆచితూచి అభివృద్ధి పనులకు ఖర్చు చేయాల్సిన అధికారులు బాధ్యతా రాహిత్యంగా వ్యవహరిస్తున్నారు. ప్రజల సంక్షేమం కోసం రాజకీయాలకు అతీతంగా ప్రజాప్రతినిధులు నిస్వార్థంగా తీర్మానం చేసి, అభివృద్ధి పనులను క్షేత్రస్థాయిలో ఇంజినీరింగ్ అధికారులు పరిశీలించి రూపకల్పన చేయాలని నిబంధనలు స్పష్టంగా ఉన్నాయి. ప్రభుత్వ నిబంధనలను శంషాబాద్‌లో అధికారులు, ప్రజాప్రతినిధులు తుంగలో తొక్కుతున్నారు. శంషాబాద్ మండల కేంద్రంలోని సాయి బాబా కాలనీలో ఇటీవలే రూ.లక్షలు వెచ్చించి 8 అంగుళాల వెడల్పు పైపులతో 120 మీటర్ల నిడివి గల భూగర్భ డ్రైనేజీ వ్యవస్థను అధికారులు పటిష్ఠంగా నిర్మించారు. మరమ్మతులు, నిర్వహణ చేయాల్సిన పంచాయతీ అధికారుల అలసత్వం, కాలనీ వాసుల నిర్లక్ష్యం కారణంగా... మురుగు పారాల్సిన భూగర్భడ్రైనేజీ వరద నీరు, మట్టి, ప్లాస్టిక్ కవర్లతో నిండిపోయింది. మరమ్మతులు చేయాల్సిన పనులను అధికారులు అనాలోచితంగా భూగర్భ డ్రైనేజీ వ్యవస్థను యంత్రాలతో ధ్వంసం చేయడంతో స్థానికంగా చర్చనీయాంశమైంది. తాజాగా రూ.3 లక్షలు వెచ్చించి 12 అంగుళాల వెడల్పు గల పైపులతో పాత పనులు చేసిన ప్రాంతంలోనే మరోసారి భూగర్భ డ్రైనేజీ పనులను గుత్తేదారుకు అప్పగించారు. కమీషన్లకు కక్కుర్తి పడి ఇలాంటి పనులు చేస్తున్నారంటూ స్థానికులు మండి పడుతున్నారు. ఈ పనులపై పంచాయతీ ఇంజినీరింగ్ సహాయ ఇంజినీరు యాదగిరిరెడ్డిని 'ఈనాడు' వివరణ అడగగా సాయిబాబా కాలనీలో నిర్మించిన భూగర్భ డ్రైనేజీ వ్యవస్థ ఎక్కడికక్కడ నిండి పోవడంతోనే ధ్వంసం చేశామని వివరణ ఇచ్చారు.



పైపులను ధ్వంసం చేసిన అధికారులు

EENADU CLASSIFIEDS

IRON & CEMENT, EYE CARE, COOKING, FLOORINGS, YOGA & MEDIDATION, BEAUTY PARLOUR, DIABETIES, HOUSE KEEPING, COURIERS, DRIVING SCHOOLS, TAILORING, CELL PHONES, SCHOOL UNIFORMS, GENERATORS, ELECTRICAL, FURNITURE FOR SALE, SWEETS, MESS

AUTOMOTIVE



BEAUTY PERSONAL CARE

BEAUTY PARLOUR

"Mirrors Academy" Ofers Career Oriencted Courses with Placement Hairdressing with "LOREAL" make up with "KRYOLAN" NailArt with "NUBAR" of USA & Beauty By MIRRORS. ✆ 9618991818.

HOME NEEDS

PEST CONTROL

Golden Pest Control Termit TRMT- 2B/R 2,000/- 3B/R- 2,500/- 10Yrs Guarantee. Cockroach Bite TRMT. Ph: 9618034224/ 9676211260

తేజశ్రీ పెస్ట్‌కంట్రోల్ చెదలు, ఉడ్‌బోరర్ నివారణ 10 సం॥ గ్యారంటీ బొద్దింకలకు జెల్ ట్రీట్‌మెంట్ ఏ వస్తువు కదపనక్కర్లేదు. Rs. 1000/- ★ దేప ఈశ్వర్‌రెడ్డి ✆ 8106000303

JOBS

కపిల్‌చిట్స్ Hyd ప్రై లిమిటెడ్ దిల్‌సుఖ్‌నగర్, కూకట్‌పల్లి లీగల్ సెల్స్ హైదరాబాద్, సికింద్రాబాద్ పరిసర ప్రాంతాలలో పని చేయుటకు కలెక్షన్ మేనేజర్స్, అసిస్టెంట్స్, అకౌంట్స్ అసిస్టెంట్స్ డ్రైవర్స్ కావలెను. అనుభవమున్నవారికి ప్రాధాన్యత. దిల్‌సుఖ్‌నగర్ 9848526842, 8096910320 కూకట్‌పల్లి 9948822025/ 7660010098

AGRIBUSINESS

POULTRY

నిన్నటిరోజు NECC, హైదరాబాద్ జోన్ 100 కోడిగుడ్ల ఫారంగేటు ధర రూ॥ 355/- చిల్లర ధర రూ॥ 4.15 ఫోన్: 23240329, కల్‌బర్డ్ ధర రూ॥ 62/-per KG, ఫర్‌బర్డ్ ఫోన్: 9000371404.

AUTOMOTIVE

We Purchase used Cars @ Your Doorstep, Spot Cash more than market price Free Immd Transfer. 9550892044/ 7673903901

AUTO FINANCE

New & Used Car Loans Upto 90% Funding Spot Approval Simple Documention from MNC & Nationalised Banks ✆ 7842478428

BUSINESS SERVICES

WANTED DEALERS/AGENTS

AYHC GHP ఫార్మసీ Hyd/ AP/ TS లో అన్ని మెడికల్ షాప్‌కి సప్లై కొరకు C/F డిస్ట్రిబ్యూటర్స్/ ఏజెంట్స్ up to 40% Income మీ పెట్టుబడి 8500906282.

BUSINESS OFFER

Data Entry new Project available with High Payout & Long Term Contract Min 5- Systems & Office setup Mandatory ✆ 8978148055.

Master Franchise For E-Commerce Co. Excellent Income And Long Term Opportunity for Details Call: ✆ 8008831019.

Invest (2L) in Bike Zone Business and Get 15K - 30K, Month Upto Lifetime More Details Contact. ✆ 8919525103/ 8501049271

సత్యదేవ - ప్లాస్టిక్ వస్తువులు తయారుచేయు మెషిన్లు అమ్మకం. నెలకు 20 వేలు పైగా ఆ॥, ముడిసరుకు ఇచ్చి తయారైనవి కొంటాం, 5 సం॥ బై బ్యాక్ అగ్రిమెంట్. ✆ 95810 56712.

సత్యదేవ - ప్లాస్టిక్ వస్తువులు తయారుచేయు మెషిన్లు అమ్మకం. నెలకు 20 వేలు పైగా ఆ॥, ముడిసరుకు ఇచ్చి తయారైనవి కొంటాం, 5 సం॥ బై బ్యాక్ అగ్రిమెంట్. ✆ 77995 18807.

BUILDING & CONSTRUCTION

BOREWELLS

Srisujala Borewells: 6 1/2, 2000 Ft, 4 1/2, 600 Ft Drilling Flushing & Rebore. with Latest Technology ✆ 9948318666/ 9948329666

EDUCATION

Lecturers Training for JEE-Mains, NEET IIT-Foundation: facultyfactory. Balaram: 9885526890, facultypoint@gmail.com

Forest Beat Officers TSPSC-Exam Coaching Best Faculty Kohinoor Academy Mehdipatnam Hyd. 9533938753/ 66881770

HOME TUTIONS

Sairam Home Tutions Offer Exp, 1-XII SSC, CBSC, ICSC Inter, EAMCET AIEEE, IIT, B.Tech, Deg, Welcome M/F. Ph: 8328099273/ 9247315777

Sri Chaitanya Academy Top No-1 In Hyd Home/ Class Room Tutions I-XII, Inter, EAMCET/ NEET, JEE, (Mains/ Adv) Deg, MBA, B.Tech ✆ 9885734904.

క్యాపిటల్ హోమ్‌ట్యూషన్స్ KG to PG, Inter, T. EAMCET, NEET, IIT, JEE- మెయిన్స్, CA-CPT, B.Com, B.Tech, PG. వెల్‌కమ్ ట్యూటర్స్ ✆ 70362 98104.

JOB TRAINING

Learn & Earn: Accounts, Tally, GST, Taxation & MS-Office Training, Upgrade Skills & Get Best Package @ Ameerpet. Ph: 7661817444

HEALTH CARE

జీవితం చాలా బాధాకరంగా వుందా? బ్రతుకు భారంగా వుందా? మానసికంగా కృంగిపోతున్నారా? బాధల్ని పంచుకునేందుకు మానసిక ధైర్యం కోసం రోష్నికి ఫోన్ చేయండి. ఉచిత, గోప్యమైన సేవ ✆ 66202000, 66202001 ఉ॥ 11-9 వరకు Mon - Sat

WEIGHT LOSS CENTERS

5 వారాలలో డైట్ లేకుండా 8-10 KG ల బరువు, చేతులు, తొడలు, పొట్ట సైజు, మలబద్ధకం, గ్యాస్ట్రిక్ ప్రాబ్లం, మోకాళ్ళనొప్పులు తగ్గుతాయి. Ph: 9059320974

HOME NEEDS

PEST CONTROL

Om Swasthik White Ants & Woodbores Tremt. 10 Yrs Guarantee. Cockroach Gel & Spray Tremt. Rs. 499/- ✆ 9542212700, 9542212800.

PERSONAL CLASSIFIEDS

LOST

Flot డాక్యుమెంట్స్ పోయినవి. దిల్‌షుక్‌నగర్ నుండి మలక్‌పేట్ వెళ్ళుతుండగా పోయినవి. Flot అడ్రస్: 4-1-358/40, 3rd ఫ్లోర్, అస్కర్ ఆర్కెడ్ అపార్ట్‌మెంట్, హనుమాన్‌టెకిడి, హైద్రాబాద్. దొరికినవారు సంప్రదించవలసిన అడ్రస్: దొడ్డ పుష్ప, 16-11-511/C/20, ప్రతాప్‌నగర్, దిల్‌సుక్‌నగర్. ✆ 9966615111.

REAL ESTATE

FLAT FOR SALE

1St Floor Flat For Sale. 2BHK, Lift, Modular Semifurnished, 2 Balconies, 2 Bathrooms, Security Door To Balcony Road Facing Excellent Rent Value. Cellar Parking 950Sft. Matrusri Abode, Rk puram Flyover, Neredmet X Roads. ✆ 9544062036

HOUSE FOR SALE

Indp 2BHK 19,90,000/- Nr. Hayathnagar Gated Community with all Development Loan LRS R.Laxmareddy. ✆ 9290009902/ 9441091936/ 9000139851

Indp & Duplex Houses HMDA Layout 25 L To 50L 5Km From Adibatla IT Companies Nr. ORR Loans. B.Bheem Reddy ✆ 8885060742/ 9700974808

గండి మైసమ్మ దగ్గర గాగిల్లాపూర్‌లో గేటెడ్ కమ్యూనిటీ నందు ఇండ్లను ఆనుకొని అన్ని డెవలప్‌మెంట్స్‌తో 150 చ॥గ॥ల ప్లాట్స్ & 2BHK Indp 70% బ్యాంక్‌లోన్స్. ✆ 9494100200

PLOT FOR SALE

Adibatla ITIR Zone HMDA Approved Plots close to TCS, CTS, ORR Junction. Fully developed. Spot Regd. Loans ✆ 9618882020.

Bachupully, Mallampet, ORR Junction (Exit-4) Road Facing Venture 150, 200 (Y) Plots with all Developments ✆ 9030033207, 9959991155.

APPA Junction @ Chevella New Venture for Low Cost Fruit Plantation, Malabar Trees, Model Farm House, Farm Plots Ph: 9849096826

133, 200, 267 (Sq.yd) Sandalwood Plots @ Shadnagar, Good Investment Opportunity Swarga Seema Sandalwood Farms Pvt. Ltd. ✆ 9849012500.

Moula- Ali Industrial Plot for Sale 1023 Sq.Yards North West Corner Plot Contact: 9849619544

Adibatla 540 Acres HMDA Mega Venture Sagar Hi-way Facing @ IBP, Intl Dev LP No: 45/2017 Nr.TCS, ORR Wonderla, Loans ✆ 8919372692

5.88 Laks 1 Plot @ Shadnagar highway facing, DTCP with Bank loans. Gated community 24x7Sft, (Opp. Baba Dhaba) ✆ 9177385251.

Buy 200Sq. Get 20g. Gold Free Joynivas HMDA B.B. Nagar 100' City Bus Rd. Facing in Side of R.R.R. Nims, Aims, CCMB, Near Railway Station, EMI & Loans 9963859318.

Excellent Investment Opportunity, Near Yadagirigutta. Plots Available at Nature Orchid, A HMDA approved Highway facing layout on Warangal Highway at Bhongir, Near Hotel Vivera, Opp: Government ITI. If Interested. Cont: Bhargavi : 9573051769.

Adibatla HMDA ప్లాట్లు సాగర్ హైవే TCS, వండర్‌లా పార్కు BDL దగ్గరలో All Dev. రెడీ టు కన్‌స్ట్రక్షన్, స్పాట్ రిజి॥ లోన్స్ సౌకర్యం. ✆ 9866227875.

శ్రీశైలంహైవే, కడ్తాల్ ఫార్మాసిటీ, RRR కి అతి సమీపంలో నెలసరి Rs: 6 వేల సులభ వాయిదాలతో 18 మలబార్ నీమ్ మొక్కలతో కూడిన ప్లాట్స్ కలవు. Ph: 8186867777

విజయవాడ, బెంజిసర్కిల్‌కి కేవలం 6 కి.మీ. దూరంలో అవనిగడ్డ బైపాస్‌రోడ్డు, ఇన్నర్ రింగ్‌రోడ్డు దగ్గర ప్లాట్లు. చ.గ. రూ. 4,900/-, 8,200/- మీ సొంతం. సంప్ర: 99486 43388.

షాద్‌నగర్ టౌన్‌లో 100 గజాలు 1,00,000/- మాత్రమే ఫ్రీ రిజి॥ & సైట్ విజిట్ ఫ్రీ. సంప్ర: Maathrubhoomi Housing Pvt Ltd. # 73/A, 2nd ఫ్లోర్, మాస్టర్‌బ్లిస్ అపార్ట్‌మెంట్, శివబాగ్ కాలనీ, Nr.S.R.నగర్, P.S. అమీర్‌పేట్ ✆ 8185936389, 040-40246023.

కేవలం 55000తో బుకింగ్ మిగతా 36 నెలలలో చెల్లించండి. ముంబై హైవే ORR, Exit-3, మెడికల్ కాలేజ్ దగ్గర HMDA లేఅవుట్, MMTS, మెట్రో విస్తరణ, గీతం IITకి దగ్గరలో. 9390080335

రాజేంద్రనగర్‌కు శంషాబాద్‌కు దగ్గరలో రంగారెడ్డి జిల్లా నందు లోకల్ బస్సుల సౌకర్యంతో 100 గ॥, 1,50,000/- మాత్రమే. EMI, ఫ్రీ రిజి॥ & సైట్ విజిట్ ఫ్రీ, సంప్ర: Maathrubhoomi Housing Pvt Ltd. # 73/A, 2nd ఫ్లోర్, మాస్టర్ బ్లిస్ అపార్ట్‌మెంట్. శివబాగ్ కాలనీ, Nr.S.R.నగర్ P.S, అమీర్‌పేట్ ✆ 9849973149, 040-23739969.

గండిమైసమ్మ x రోడ్ వద్ద, ORR లోపల న్యూ HMDA అప్రూవ్ వెంచర్‌లో ప్లాట్స్ LPNo:46/ HMDA/2017, చ॥గ॥ రూ॥ 13,700/-లకే బ్యాంక్ లోన్స్ & స్పాట్ రి॥ Ph: 9951381533.

శంషాబాద్ & అప్పాజంక్షన్ దగ్గరలో రంగారెడ్డి జిల్లా నందు లోకల్ బస్ సౌ॥ 100 చ॥గ॥ 9000తో మీ సొంతం, మిగిలినది EMIలో కట్టండి. ఫ్రీ సైట్ విజిట్, డైరెక్ట్ కంపెనీ RS ఎస్టేట్స్ ✆ 8790201417

కేవలం రూ: 1,25,000/- లకే 200 చ॥గ॥ల ఇంటిస్థలం హైదరాబాద్ (రామోజీఫిల్మ్‌సిటీ) చౌటుప్పల్ సమీపంలో NH:9, క్లియర్‌టైటిల్, స్పాట్ రిజి॥ ✆ 9948078062, 9848305444

వంగపల్లి: వరంగల్ హైవేకి 1Km లో 100 Ft రోడ్ ఫేసింగ్ DTCP అప్రూవ్, గేటెడ్ కమ్యూనిటిలో ప్లాట్లు కలవు ప్రతి బుకింగ్‌పై 5 గ్రా॥ గోల్డ్ ఫ్రీ. Ph: 9951662211

గుంటూరు విజయవాడ మధ్య మంగళగిరి సమీపంలో గేటెడ్ కమ్యూనిటీ విల్లాలు, ప్లాట్లు, S.R.M. యూనివర్శిటి 4km HCL IT Park 6 km , AP CRDA, RERA నిబంధనలతో. ✆ 99661 49858

150 గ॥ 15 వేలకే రిజి॥ & మిగతా 6500x16 నె॥ వాయిదాలు Nr. ఎయిర్‌పోర్ట్ @ షాద్‌నగర్ Nr. సువర్ణభూమి ఇండ్లకు దగ్గరలో సంప్రదించండి: 9505289998

ఆదిభట్ల @ బొంగ్లూరు HMDA గేటెడ్ కమ్యూనిటీ (LP.No)తో "Rich Meadows" ప్లాట్లు & ఇండ్లు అన్ని Devp.తో విశ్వేశ్వరయ్య కాలేజ్ ఎదురుగా Ph: 7306432555, 8885937555

యాదగిరిగుట్ట వరంగల్ హైవే @ వంగపల్లి J.S.R గ్రూప్ సన్‌సిటీలో హైవే ఫేసింగ్‌కు DTCP 8 వెంచర్‌లలో ప్లాట్లు కలవు. రిజి॥ + రిసార్ట్స్ మెంబర్‌షిప్ ఫ్రీ. సంప్ర: 9440697029

ఇల్లు కట్టుకోవడానికి 150 గ॥. 1.49 వేలకే. షాద్‌నగర్, మోమీన్‌పేట్, వికారాబాద్, సంగారెడ్డి, యాదగిరిగుట్ట, చౌటుప్పల్, 7 వేలకే బుకింగ్ & 7000x20 నె॥. 9542671999

ఇల్లు కట్టుకోవడానికి 60 గ॥. 57 వేలకే. 5 వేలకే బుకింగ్ & మిగితా 4000x13 నె॥ Nr. ఎయిర్‌పోర్ట్ @ షాద్‌నగర్, Nr. సువర్ణభూమి. Ph: 9346887779

న్యూ HMDA సుల్తాన్పూర్ లేఅవుట్‌లో Plots ORR లోపల Exit-4, మెడికల్ డేవిస్ పార్క్ దగ్గర 150, 200, 500 Sq.Yds 120' రోడ్‌కి కలవు. బ్యాంకులోన్‌తో ✆ 9247476767.

99000/- లకే 100 చ॥గ॥ల ఇంటి స్థలం శంషాబాద్‌కు అతి దగ్గరలో రంగారెడ్డి జిల్లానందు డైరెక్ట్ కంపెనీ ఆఫర్. స్పాట్ రిజి॥ సైట్ విజిట్ ఫ్రీ, సంప్ర: 9949695027.

గండిమైసమ్మ 'X' రోడ్ HMDA అప్రూవ్ Open Plots for Sale (With LPNo) 12KM from బాలానగర్ 'X' రోడ్, 5KM from Pragathinagar, Kukatpally. ✆ 9948458202

శంషాబాద్ To షాబాద్ రోడ్డులో క్లియర్ టైటిల్‌తో 300 చ॥గ॥ ఫామ్ ప్లాటు కేవలం 4,50,000/- మాత్రమే, EMI: 30x10,000, డైరెక్ట్ కంపెనీ M.S. ఎస్టేట్, ✆ 9949190981

WANTED

రాంపల్లి సత్యానారాయణకాలని, యమనంపేట్, ఘట్కేసర్ పరిసరప్రాంతంలో పెద్దకంపౌండ్ గోడతో ప్రశాంతమైన స్థలం, ఇల్లు కారాయికి కావలెను. అందులో కుక్కలను, కోళ్ళను పెంచుకోవడానికి కావలెను. ✆ 9553643587.

LEASE / SALE

Mallapur FCI Main Road 100' Road Commercial 2000 Sft Shed With 10HP Power + Bore Suitable for Godowns/ Small Care Industry ✆ 9848856701

TO-LET

COMMERCIAL

Bank/ Offices, 2500Sft G.Floor Godown 2500Sft Cellar near Sagar ring road L.B.Nagar contact: 9000139851.

WANTED

ఆనంద్‌నగర్ కాలనీ, ఖైరతాబాద్ నందు 2BHK ఫ్లాట్ అద్దెకు కావలెను. (అపార్ట్‌మెంట్/ ఇండిపెండెంట్ హౌస్) ఫోన్: 9000602983.

JOBS

Part/Full Time Home Based On/Offline, DataEntry, Ad-Posting, Copy-Paste, SMS Send, Form Filling, Page Type Convert to Words, No Target, Earn:25-40K. 6Y.Old Govt.Reg. Co. AN ISO:9001-2015 Certified Co, Daily/Weekly Pay. Free Trng.& 9502750123/ 7095750123/ 040-42000192/ 94.

A Leading Financial Services Invites Retd/ Unemployed/ Housewives/ Businessmen P/F Business Associates Earn upto Rs. 30K PM, A: 25-65Y. Q: Inter & Above. Raghava 9985254641.

Wanted Delivery Boys Required Bike, Driving Licence & Androidmoble Salary 13,000/- Contact: 8886699764.

Wanted Male Sales Executives For Anu Furniture Showroom in Chandanagar. Contact: 9912846932/ 9177806633

Wanted Telecallers, Data Entry Operators, Field Executives and Accountant # Kakateeya Auto Lines Masabtank, Hyd. ✆ 7799906585/ 7799906584.

Wanted Accountant Exp. With Tally ERp9, Lady Telecallers, Xerox Serv. Engineers @ Padmaraonagar ✆ 9849019067/ 9177132689

Wanted Field Executives for A Reputed Company @ Nagole. Fixed Salary + Commission Contact: 9985509327

Female Telecallers & Marketing Exe to CCTV Products to Uppal Near Venkateshwara Temple. ✆ 9618044053, 9603569509.

Earn Extra Income. Work 2-3 Hours/ Day with MNC Trainings provided, Limited & serious People Required call/ message ✆9000304914

Wanted Marketing Executives, Telecallers and H.R.Managers at Habsiguda Salary + Commission, Can Contact: 7095465666.

Female Telecallers: Fix Sal. Food & Accmd. Free @ 2nd Flr, F-24, Madhukunj Aprts, beside YMCA & UCO Bank, Sec-bad. ✆ 9849207399

Wanted Accountant (Jr/ Sr) for Super Market. Shamsheergunj, Faluknuma, Hyd. Cont: 7386493037, 9849049457

Wanted Lady Office Executive for DSA of LIC Housing Finance # 6, HUDA Mytrivanam, Ameerpet. ✆ 9246501890/ 040 - 66731890.

Wanted Marketing Executives Freshers (M/F) DTP Operator for Company Compaign DSNR Hyd ✆ 9573786212

Wanted Computer & Mobile Employees M/F Salary Depends On Experience S.V.R. Soulutions Saidabad. ✆ 9000297773/ 24077044

Wanted only Male Typist Part Time Higher Typing Speed Exp.Stenographer for Lawyer Office at Abids Job Time 6 PM to 10 PM ✆ 9346211110

Wanted Telecallers for used car outlet @Nagole. Fluency in Hindi, English, Telugu. Contact: 9246547179/ 7093827888.

Wanted Exp. Receptionist (F) Communication Skills in Hindi, Tel & Eng. Sal: 8K-15K Ad Solutions Begumpet, Hyd. 9618405459

Wanted Office Boys salary 7000. ITC Engineering company Begumpet Hyderabad contact✆ 9246501672/ 27760387

Wanted Lady Office Asstnt Cum Computer Operators, Marketing Executives & Office Boy Con: 7997953164, 7997953168

Female Telecallers (No's 25) Freshers/ Exp for Personal Loans Fixed Sal+ Inc, Off @ Chaitanyapuri, Dilsukhnagar ✆ 9866116401

Wanted Female Residential Wardens a Himayathnagar College Salary: 9000 to 13,000/- Cont: ✆ 7093589327/ 7382293841

Wanted Mark Exe's for Local & Out Station. Qly: Degree. Sal: 10-12K + T.A. 2 Wheeler Must. Signet, 415, Amrutha Estate, Himayathnagar. ✆ 9133488800

SBI Life Insurance Req Unit Managers (2.1 to 2.5L PA), AM(3L-3.5L P.A) + 42000 PA Extra Mobile+ Conveyance. 1-2yrs Exp Candidates From Casa, Banks, Pharma, Microfin & Chits, Other Insurance Companies Top Advisors & Managers Interview Dates 17,18,19 Aug ✆ 9246574567.

Urg Req Store Managers Incharge/ Sales Persons (M/F) for our Kids Store Exp/Fre @ Miyapur / Nizampet ✆ 9701701563

Urg, Req.. Female HR, Incharge & Telecallers, Male Mrktg Exe's, Officers & Managers for Real Comp @ Madhapur. Q: Inter/Deg/ MBA Fixed Salary+inc+ Bonanzas ✆ 8121333347 / 9652328899

ఆఫీస్‌బాయ్స్: జీతం 10 వేలు, స్వంత Bike & License వున్నవారికి పెట్రోల్‌కు రూ.2 వేలు అదనం. 2 సం॥ల అనుభవం, ఇంటర్ (పాస్/ ఫెయిల్), వయస్సు 30 సం॥లోపు సోమాజిగూడ, ఫో: 9133467333.

UBER Bike Taxi: మీ 2 వీలర్‌ని ట్యాక్సీగా నడుపుతూ గంటకి 100/- సంపాదించండి. వెంటనే 040-39560690 పై కాల్ చేయండి.

అర్జంటుగా డైరెక్ట్ (తెలుగు) మాట్లాడే కా॥సె॥కై M/F స్టాఫ్, DSNR, ఉప్పల్, సి॥బాద్, అ॥పేట, ECIL, KPHB, MP, B.హిల్స్, హైటెక్‌సిటీ P/F, D/N. జీ: 14-25 K, Q: 10th- PG. ✆ 7032473870.

లేడీస్ టికిలి డిజైన్, ప్యాకింగ్‌చేసి రోజు రూ॥1100/- సంపాదించుకోవచ్చు (హోం డెలివరి) ధనశ్రీ నాంపల్లి ✆ 9030444383, 9704086431.

ప్రముఖ రియల్‌ఎస్టేట్ సంస్థ HMDA లేఅవుట్స్ మార్కెటింగ్ చేయుటకు (M/F) ఫ్రెష్/Exp. మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్, స్టాల్‌బాయ్స్, MM, AGM's కావలెను. సాలరీ+ ఇన్సెంటివ్స్. ✆ 8185962568.

ప్రముఖ టెలికాం కంపెనీ కొరకు 4G మొబైల్ కలిగిన స్త్రీ & పు Promotors కావలెను. Sal + PF & ESI + Inc. ✆ 95332 22991, 79816 32010.

షాడోఫ్యాక్స్‌కు 200+ డెలివరీ బాయ్స్ కావలెను. బైక్/ DL తప్పనిసరి. జీతము 20 వేల వరకు ఉంటుంది. ★ వెంటనే చేరవలెను. మిస్డ్ కాల్ యివ్వండి- : 01139586596

"సువర్ణావకాశం" – మీరు VRS/ రిటైర్డ్ అయ్యి బోర్ ఫీలౌచున్నారా? మరలా మేనేజర్‌గా పనిచేస్తూ నెలకు 40,000/- ఆపైన సంపాదన కొరకు సంప్ర॥ - స్త్రీలకు ప్రత్యేక విభాగం కలదు. సుమిత్రా: సెల్: 8374109968/ 9246262646.

టి-షర్ట్స్ కుట్టడం కొరకు టైలర్స్ కావలెను. ఇండస్ట్రియల్స్‌లో పనిచేసిన వారై ఉండాలి. ఫోన్ నెంబర్: 9000901651.

ప్రముఖ కంపెనీకై ఫ్రీలాన్సర్‌గా పనిచేయుటకు గృహిణులు, వ్యాపారవేత్తలు, రిటైర్డ్, ఉద్యోగులు, మార్కెటింగ్ సిబ్బంది, వ: 35-65 సం॥లు, Q: 10 ఆపైన, ✆ 7981608668/ 7989273250

TV 24x7 న్యూస్ ఛానల్‌లో పనిచేయుటకు న్యూస్ రిపోర్టర్స్ కావలెను. Q: ఇంటర్, డిగ్రీ జీతం: 18,000 ✆ 9703561149, 9676452995.



EENADU CLASSIFIEDS

CARE, COOKING, FLOORINGS, YOGA & MEDITATION, BEAUTY PARLOUR, DIABETIES, HOUSE KEEPING, COURERS, DRIVING SCHOOLS, TAILORING, YOGA & MEDITATION, BEAUTY PARLOUR, DIABETIES
UNIFORMS, GENERATORS, CELL PHONES, SCHOOL UNIFORMS, GENERATORS, ELECTRICAL, FURNITURE FOR SALE, SWEETS, MESSCELL PHONES, SCHOOL UNIFORMS, GENERATORS

JOBS

MNC రియల్ ఎస్టేట్ కంపెనీకి M/F మార్కెటింగ్ ఎగ్జి॥లు, టీచర్స్ LIC/ రిట్డ్ వారు, గృహిణులు, MLM, బిజినెస్/ మార్కెటింగ్ Exp వారు కావలెను. Age:25 సం॥లు పైన పార్ట్/ ఫుల్‌టైం ✆ 9951381717/ 9581831242

తాం(డ్రపారాయ వెలమ సత్రం శ్రీశైలంలో పనిచేయుటకు అడ్మిన్ ఆఫీసర్ (50 సం॥ పైబడి డిగ్రీ చదివిన) సూపర్‌వైజర్, కంప్యూటర్ నాలెడ్జ్‌గల అకౌంటెంట్ కావలెను. మంచి జీతం + ఉండుటకు వసతి + ఉచిత భోజనం. ఆల్ ఇండియా వెలమ అసోసియేషన్, హిమాయత్‌నగర్. ✆ 9246559119/ 9160672023

లేడీ వార్డెన్ కావలెను. రెసిడెన్షియల్ స్కూల్‌లో పనిచేయుటకు అనుభవం కల్గిన లేడీవార్డెన్ కావలెను. జీతం రూ॥ 8000/- భోజనం & వసతి ఇవ్వబడును. సంప్రదించండి. 9640873332 గురుకుల విద్యాపీఠ్ హైస్కూల్, ఇబ్రహీంపట్నం, రంగారెడ్డి జిల్లా.

5&3 స్టార్ హోటల్స్‌లో క్యాటరింగ్ బాయ్స్/ గర్ల్స్ కావలెను. గర్ల్స్ 600-1200/- బాయ్స్ 450-900/- P/F టైం. రూం+మీల్స్ స్పాట్ పేమెంట్స్ ✆ 7995280048, 9666847563

ప్రముఖ MNCలో MBA, MCA, B.టెక్, డిప్లొమా చదివిన వారు & సెక్యూరిటీ గార్డ్స్, హౌస్‌కీపింగ్, డ్రైవర్స్, ప్యాకింగ్ బాయ్స్ కావలెను ✆ 9394166524/ 9676849071

హైదరాబాద్‌లోని ఇళ్లల్లో 24గం॥లు వృద్ధులకు సేవ చేయడానికి, వంట చేయడానికి, పిల్లలను చూసుకోవడానికి 100 మంది ఆడవారు/ మగవారు కావలెను. జీతం: 9 వేలు భో+ వసతి ఫ్రీ. ✆ 7032025222.

Medplus మెడికల్ షాపుల్లో D/B Pharmacy చదివి PCI కలిగిన అభ్యర్థులు Pharmacistలు గాను SSC పాసైన అభ్యర్థులు Pharmacy Assistantsగా మెడికల్ షాపుల్లో అనుభవం కలిగినవారు కార్పొరేట్ ఆఫీసులో Prescription Readersగా మరియు Any Graduation పాసైన అభ్యర్థులు Call Center Executivesగా పనిచేయుటకు కావలెను. సంప్ర: 9666662481/ 8498095747.

హాస్టల్‌లో ఉండి పనిచేయుటకు బాయ్ కావలెను. ఉచిత వసతి, భోజనం కలదు. కూకట్‌పల్లి. Ph: 9393655567.

సేల్స్‌బాయ్స్ & గర్ల్స్, కంప్యూటర్ ఆపరేటర్, క్యాషియర్స్, హెల్పర్స్ అనుభవం వున్నా/లేకున్నా వ॥30లోపు. రూపలక్ష్మి ప్రె.మార్కెట్, షాప్ నెం.423/B. 4th ఫ్లోర్, కోత్తపేట్. ✆ 9248019916.

Wanted Helpers మా ఆఫీస్‌లో పనిచేయుటకు వ॥ 35 సం॥లోపు ఎలాంటి విద్యార్హత లేని పురుషులు కావలెను. (P/F) టైం మంచి జీతం ✆ 8367418967/ 9704710880

డైరెక్ట్ తెలుగు మాట్లాడి కాల్‌సెంటర్ కలెక్షన్ ఎగ్జి॥ రిసెప్షనిస్ట్, డేటాఎంట్రీ, M/F స్టాఫ్ కావలెను P/F 10th-P.G. జీ॥ 6K to 20K Exp ✆ 9100849004/ 8801064739

హియర్‌వెల్ క్లినిక్ మలక్‌పేట్‌లో పనిచేయుటకు తెలుగు, హిందీ వచ్చిన మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ & ఆఫీస్ స్టాఫ్ (M/F)3 అర్హత+2, వ॥ 22-35 ✆ 9703235513/ 9985631926.

డెలివరి బాయ్స్ కావలెను. జీతం: 7500 + బస్‌పాస్ Q: 10th ఏజ్: 30 సం॥లోపు, Signet 415, అమృత ఎస్టేట్స్, హిమాయత్‌నగర్ ✆ 9133488800/ 66668890.

RK స్వీట్స్ షాపు మదురనగర్, ప్రగతినగర్‌లలో పనిచేయుటకు పర్మినెంట్ వర్కర్స్ కావలెను. ఉచిత భోజనవసతి మరియు బ్యాడ్జి వున్న డ్రైవర్ కావలెను✆ 9885582620

నార్సింగిలోని కాలేజీ హాస్టల్‌లో పనిచేయుటకు హెల్పర్స్ (భార్యభర్తలు) కావలెను. మంచి జీతం + వసతి + భోజనం. Ph: 040-69993046/ 8142833164

హార్డ్‌వేర్‌షాపులో పనిచేయుటకు సేల్స్‌బాయ్స్ అర్జెంటుగా కావలెను. సికింద్రాబాద్ పరిసర ప్రాంతాలవారికి ప్రాధాన్యత రవి వినర్స్ హైదరబస్తి, సికింద్రాబాద్ ✆ 040-27541803.

అర్జంటుగా కావలెను. హైదరాబాద్‌లో ఇంట్లోనే ఉండి 24 గంటలు పనులు చేయుటకు ఆడవారు కావలెను. మరియు Manpower Marketing Exe. కావలెను. ✆ 7097203331

FACULTY / TEACHERS

Global Art Kompally Center Invites Young Female as Course Instructor with a Passion for Working with Children Having Flair for Art & Good Communications Skills. Work Only Saturday, Sunday. ✆ 9705782140 (11-2PM)

Looking For Female Trainer in Kompally Area To Teach Abacus for Children Bet Age 6-12yrs. Work only on Saturday, Sunday earn Upto 10,000 PM. Training Provided By SIP Academy. 9705782260 (11-2pm)

Qualified & Exp. Teacher for Primary- Maths, Science & Social, Higher- P.Science Cum Biology, PET for School ✆ ECIL. ✆ 9030887700/ 9032100071

Wanted VI to X Hindi Teachers St. Donald's High School P&T Colony DSNR Hyd. Come along with Originals

Capable & Sincere Lady Teachers Required to Teach Telugu Up to V & Hindi Upto IV. Contact: Little Tulips High School, Tombs Road, Tolichowki. ✆ 9676596528/ 040- 23562911

DRIVERS

Driver Wanted for Doctor's Car at KPHB. Min 5yrs Experience Good Salary ✆ 8121298298

డ్రైవర్లు కావలెను. జీతం 15-16 వేలు+ బెనిఫిట్స్, ఓనర్ వద్ద లగ్జరీ కార్లు నడుపుటకు సిటీ, హైవేలో 3-4 సం॥ల అనుభవం, 35 సం॥లోపు వయస్సు, బంజారాహిల్స్. ఫో: 9666872553

కేవలం Rs.30,000 డిపాజిట్ కట్టి UBERలో కారు యజమాని అవ్వండి. వెంటనే 040-39594688 పై కాల్ చేయండి.

వాంటెడ్ డ్రైవర్స్ (ప్రతిష్టాత్మక ట్రాన్స్‌పోర్టు కంపెనీకి 32 అడుగుల (6 Wheeler) & 20 అడుగుల కంటైనర్ డ్రైవర్ అవసరం. 3yrs Exp AP & TS యొక్క భారీ సరుకుల లైసెన్స్ వాహనాలు South & West ప్రాంతాల్లో ఉంటాయి. ప్రావిడెంట్‌ఫండ్, యాక్సిడెంట్ మెడిక్లెయిమ్ ఇన్సూరెన్స్ పాలసీ సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయి. Documents: డ్రైవింగ్ లైసెన్స్, ఆధార్‌కార్డు, చిరునామా రుజువు, ఫోటో ✆ 09923207112 / 09370147183 / 09325949801 (10am to 7pm)

సిటీరూట్స్ తెలిసిన బ్యాడ్జినంబరు గల డ్రైవర్లు కావలెను. డే/డే డ్యూటీ(24 గం.), డేలీడ్యూటీ (12గం.) కలదు. ఉప్పల్.✆ 9440065411, 9100088330.

ACCOUNTING

B.Com/M.Com/ MBA as Accountants Without Exp. Sal:Upto 12,000/- Job Thru 45 days Tarining for Details STPL,Tarnaka ✆ 98855 67344.

Required Tax Practitioner Especially for GST work at Vanasthalipuram ✆ 9885551192/ 9949952225.

BPO / CALL CENTER

Imm Requirement for Telecalling Executives at RTC 'X' Rds, Kannada/ Tamil/ Telugu. No Consultancy. Cont: Sandeep. 9160904020

ENGINEERING

CMAS Mtg of Construction Machinery @Cherlapally Looking for Electrical Engg with 3-5 Yrs Exp in Control Panel Wiring & VFD's HMI. ✆ 9397811468. admin@cmac.co.in

FASHION DESIGNING / MERCHANDISING

Need Cutting Master & Tailor, 15-20 Years Experience, Salary Based ✆ 9908528770

MEDICAL

Wanted Staff Nurse/ANM for Multi Speciality Clinic @ Miyapur. Salary: 8k-10k. Exp: 2-3years Cont: ✆ 9701262673 / 9160483484

కోఠి క్లినిక్‌లోని మెడికల్ షాపులో పనిచేయుటకు మెడికల్ బాయ్ అర్జంటుగా కావలెను. జీతం: 8000/-+, సంప్ర॥ 040-65985515, 9573085521

SECURITY GUARDS

అర్జెంటుగా ఎక్స్- సర్వీస్‌మెన్/ ఎక్స్ - పోలీస్ సెక్యూరిటీ గార్డ్స్ & హౌస్‌కీపింగ్ బాయ్స్ కావలెను. కూకట్‌పల్లి/ సంగారెడ్డి. 8 గం॥ Rs/ 16 వేలు (నెలకు) (ESI, PF తో సహా) సంప్రదించండి. 7993460805/ 8686294069

సెక్యూరిటీగార్డ్స్ అర్జెంటుగా కావలెను. Qly: 10th-డిగ్రీ, హిమాయత్‌నగర్, పంజాగుట్ట, నారాయణగూడ, అశోక్‌నగర్, పద్మారావునగర్, సికింద్రాబాద్. జీతంపై 9వేలు+రూం ఫ్రీ ✆ 9642824799

సెక్యూరిటీ గార్డ్స్ కావలెను. నల్లకుంట, ఉప్పల్, చందానగర్ పరిసర ప్రాంతాలలో తెలుగు/హిందీ వచ్చిన గార్డ్స్ కావలెను. ✆ 8106104948 / 9553973123

TOURS & TRAVELS

శ్రావణమాసం అమ్మవారి దర్శనాలు తమిళనాడు AUG 12, (6500) కావేరిపుష్కరాలు, Sep.13 (7500/-), కర్నాటక. కార్తీకమాసం, కాశీ 9 నిద్రలు Nov-6 (7500/-). వ +భో+ ఫ్ర. ✆ 7702108471

దసరాకి ఒరిస్సా 5 రోజుల AC యాత్ర సెప్టెంబర్ 26న పూరి, కోణార్క్, భువనేశ్వర్, గిరిజాదేవి శక్తి పీఠం, అన్నవరం, తలుపులమ్మ లోవ, సింహాచలం, అరసవిల్లి, శ్రీకూర్మం, శ్రీముఖ లింగం, పిఠాపురం, ద్రాక్షారామం, ద్వారకాతిరుమల. లక్ష్మీటూర్స్ ✆ 98662 46466.

కావేరిపుష్కరాలు, మొదటిరోజు శ్రీరంగపట్నంలో స్నానమాచరించే గోవా & కర్నాటక 20 క్షేత్రా AC యాత్ర Sep 4న & తమిళనాడు శ్రీరంగంలో పుష్కర స్నానమాచరించే రామేశ్వరం 30 క్షేత్రాల AC యాత్ర Sep 15న. ✆ 98662 46466.

కాశీయాత్ర కాశీ, ప్రయాగ, నైమిశారణ్యం, గయ 9రో॥ వ॥ భో॥ 6000/- Oct-2 రామేశ్వరం, కన్యాకుమారి, మధురై, కంచి 8రో॥ 6200/- వ॥ భో॥ 7-9& 20-9. సత్యసాయి సేవా సమాజ్ 9618933189

సాయిటూర్స్: మహారాష్ట్ర 5 జ్యోతిర్లింగాలు, అష్టగణపతులు, షిరిడి Oct 5, రూ॥ 9000/- ★ కేరళ: గురువాయర్, కొచ్చిన్, త్రివేండ్రం, మున్నార్ రూ॥ 8500/-, Oct-13. భో+వ ✆ 9848664831

శ్రీవిఘ్నేశ్వరటూర్స్: తమిళనాడు 21/09, 15/10, కర్నాటక 17/8, 9/12, గుజరాత్ 9/9, చార్‌ధామ్ 5/10, వైష్ణోదేవి 25/10 ✆ 9059125230/ 9030123243

కావేరీ పుష్కర యాత్ర (ప్రతిరోజు) శ్రీరంగపట్నం (కర్నాటక) 5 క్షేత్రాలు 3 రో॥ మనిషికి రూ॥ 8,500/- గంగాసాగర్- కామాఖ్య -19/11-12 రో॥ సహస్ర టూర్స్ ✆ 7993478851/2/3

సాయిటూర్స్: కర్ణాటక: మైసూర్, శృంగేరి దర్శనలు Sep-20 రూ॥ 7200/- ★ రామేశ్వరం, కన్యాకుమారి, మధురై, శ్రీరంగం Aug-26, Sep-27, Oct-21 రూ॥ 6500/- ✆ 9848664831

శివహంపారి ఛార్‌ధామ్ యాత్ర సెప్టెంబర్ 7, 15 రో॥ 19,500/- షిర్డీ+ 4 జ్యోతిర్లింగ, 3/10, 8 రో॥ 6,000/-, 13/11 నవదేవియాత్ర, 13 రో॥ 16,500/- ✆ 96766 37578.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతి స్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.



● 'ఇన్‌స్పైర్'కు పేర్ల నమోదులో నత్తనడక
● తాజాగా నెల రోజుల గడువు పెంపు
● పాఠశాలలు స్పందిస్తే విద్యార్థులకు ఉజ్వల భవిత

సైన్స్ ప్రయోగాలు అందిపుచ్చుకుందాం!

ఈనాడు, హైదరాబాద్

వైజ్ఞానిక శాస్త్ర పరంగా పాఠశాల స్థాయి విద్యార్థుల జ్ఞానతృష్ణను, సృజనాత్మకతను వెలికితీసే ఉద్దేశంతో కేంద్రం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించే వేదిక 'ఇన్‌స్పైర్'. ఇందులో పాల్గొనే విషయమై ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలనే తేడా లేకుండా అన్ని రకాల యాజమాన్యాలు కొంత నిర్లక్ష్య ధోరణితో వ్యవహరిస్తుండడం ఆందోళన కలిగిస్తోంది. ప్రదర్శనల నమోదుకు గత బుధవారంతో గడువు ముగిసినా ఆశించిన స్పందన లేదు. తాజాగా మరో నెల రోజుల గడువు పెంచుతూ కేంద్రప్రభుత్వం నిర్ణయించడంతో ఇప్పుడైనా ఈ అవకాశాన్ని అందిపుచ్చుకుని స్పందిస్తే భావితరాలకు చేయూతనిచ్చినట్లవుతుంది.

చక్కటి అవకాశం

కేంద్ర ప్రభుత్వం అధీనంలోని శాస్త్ర సాంకేతిక విభాగం(డీఎస్‌టీ) ఈ ఇన్‌స్పైర్ కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. పాఠశాల స్థాయిలోని విద్యార్థుల ప్రతిభను వెలికితీసి జాతీయ స్థాయికి తీసుకెళ్లేందుకు దీంతో ఆస్కారమేర్పడుతుంది. ప్రతీ ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల నుంచి 6-10 తరగతుల విద్యార్థులు తమ సైన్స్ ప్రదర్శనల గురించి ఆన్‌లైన్‌లో నమోదుచేయాలి. ఒక్కో పాఠశాల నుంచి అయిదుగురు విద్యార్థులకు అవకాశముండగా.. తప్పనిసరిగా ప్రతీ తరగతి నుంచి ప్రాతినిధ్యం వహించాలి. జిల్లాస్థాయిలో ఉత్తమంగా నిలిచే ప్రదర్శనలకు తయారీ ఖర్చుల నిమిత్తం ప్రభుత్వమే రూ.5వేల చొప్పున సమకూర్చుతుంది. జిల్లాస్థాయిలో పది శాతం ఉత్తమ ప్రదర్శనలను రాష్ట్రస్థాయికి, అందులో పది శాతాన్ని జాతీయ స్థాయికి ఎంపిక చేస్తారు. జాతీయస్థాయిలో ఉత్తమంగా నిలిచే 60 నమూనాలను రాష్ట్రపతి భవన్‌లో ఏటా గణతంత్ర దినోత్సవం రోజు ప్రదర్శించే అవకాశం దక్కుతుంది. గత ఏడాది హైదరాబాద్ నుంచి రెండు ప్రదర్శనలు ఎంపికయ్యాయి. ఒక్కో జాతీయ ఉత్తమ ప్రదర్శనకు రూ.20వేల పురస్కారం లభిస్తుంది. అంతే కాకుండా విద్యార్థులు భవిష్యత్తులో శాస్త్రవేత్తలుగా ఎదిగేందుకు బాటలు పడతాయి. ఇప్పుడు సైన్స్ ప్రయోగాల పరంగా ఈ కార్యక్రమమే కీలకంగా మారింది. ప్రస్తుతం జిల్లాస్థాయి పోటీల నిమిత్తం ఆన్‌లైన్‌లో దరఖాస్తుల ప్రక్రియ కొనసాగుతోంది.

పాఠశాలలు 2,800.. ప్రదర్శనలు 400

హైదరాబాద్ జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేటు, సెంట్రల్ బోర్డు.. ఇలా అన్ని రకాల ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు సుమారు 2,800 ఉన్నాయి. ఈసారి ఇన్‌స్పైర్ ప్రదర్శనల కోసం మొదటి విడత గడువు ముగిసేనాటికి దాదాపు 400 పాఠశాలల నుంచి విద్యార్థులు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకున్నారు. విద్యార్థులతో రిజిస్ట్రేషన్ చేయించాల్సిన బాధ్యత ఆయా పాఠశాలల యాజమాన్యాలదే. గత ఏడాది కనీసం 200 ప్రదర్శనలైనా నమోదు కాలేదు. ఈసారి రాష్ట్రస్థాయి సైన్స్ అధికారులతోపాటు జిల్లా విద్యాధికారి రమేశ్, జిల్లా సైన్స్ అధికారి ప్రభాకర్.. యాజమాన్యాలపై ఒత్తిడి పెంచడంతో ఆ మాత్రమైనా కదలిక వచ్చింది. గత రెండునెలల పాటు ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ సైట్‌పై ఒత్తిడి ఉండటంతో నమోదుకు అడ్డంకులు ఎదురయ్యాయి. తాజాగా కేంద్రం వచ్చే నెల 15వరకు గడువు పెంచడంతో మరి కొందరు విద్యార్థులకు అవకాశం దక్కినట్లయింది.



సమావేశంలో మాట్లాడుతున్న నడికుడి జయంత్‌రావు

'కుండల తయారీకి ఆధునిక పరికరాలు ఇవ్వాలి'

సోమాజిగూడ, న్యూస్‌టుడే: కుండల తయారీకి ఆధునిక పరికరాలు అందుబాటులోకి తేవాలని తెలంగాణ కుమ్మర సంఘం విజ్ఞప్తి చేసింది. బుధవారం సోమాజిగూడలోని ప్రెస్‌క్లబ్‌లో జరిగిన సమావేశంలో సంఘం గౌరవ అధ్యక్షుడు బండారు భిక్షపతి, ప్రధాన కార్యదర్శి మొగిలివర్ల వీరన్న మాట్లాడుతూ.. ఎంబీసీ కులాల అభివృద్ధికి ప్రభుత్వం పాటుపడుతోందని, ఎంబీసీ ఛైర్మన్‌గా కుమ్మర సామాజికవర్గానికి చెందిన తాడూరి శ్రీనివాస్‌ను నియమించడంపై ప్రభుత్వానికి కృతజ్ఞతలు చెబుతూ ఈనెల 18న రవీంద్రభారతిలో అభినందన సభ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. బ్యాంకుల ద్వారా 80శాతం రాయితీతో కూడిన రుణాలు అందజేయాలని, తమను బీసీ 'బి' గ్రూప్ నుంచి 'ఎ' గ్రూప్‌లోకి చేర్చాలని కోరారు. కార్యక్రమంలో కోశాధికారి కొత్తపల్లి రాజమల్లయ్య వివిధ జిల్లాల అధ్యక్షులు పాల్గొన్నారు.

నగరంలో ఈనాడు

● బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఉదయం 11 గంటలకు 'రైతు సమస్యలు' అనే అంశంపై సదస్సు.

● చిక్కడపల్లి త్యాగరాయ గానసభలో సాయంత్రం 4 గంటలకు 'స్వర మాధురి' సాంస్కృతిక సంస్థ ప్రథమ వార్షికోత్సవ వేడుకలు. 5.30 గంటలకు రసమయి ఆధ్వర్యంలో వైద్యం ఆంజనేయులు రచించిన 'ఏ ప్రొఫైల్ ఆఫ్ డా.సి.నారాయణరెడ్డి' ఆంగ్ల గ్రంథావిష్కరణ.

గమనిక: 'నగరంలో ఈనాడు' శీర్షికన ప్రచురించాల్సిన కార్యక్రమాలను వాట్సాప్ నెంబరు: 7995564377కు లేదా మెయిల్ hydcitybureau@eenadu.in కు పంపించగలరు.

సాహిత్యాన్ని అధ్యయనం చేయండి

● నవతరం రచయితలకు అమ్మంగి వేణుగోపాల్ సూచన

నారాయణగూడ, న్యూస్‌టుడే: రచనలు చేయడమే కాకుండా సాహిత్యాన్ని అధ్యయనం చేయాలని ప్రముఖ సాహితీవేత్త, కాళోజీ పురస్కార స్వీకర్త డా. అమ్మంగి వేణుగోపాల్ నవతరం రచయితలకు సూచించారు. తెలంగాణ సారస్వత పరిషత్తు ఆధ్వర్యంలో 65 ఏళ్ళు పైబడిన ప్రఖ్యాత కవులు, పండితులు, ప్రముఖుల స్వీయ సాహిత్య జీవిత విశేషాలని ఆవిష్కరింపజేసే ఉపన్యాస పరంపరలో బుధవారం రాత్రి డా.అమ్మంగి వేణుగోపాల్ 75వ ప్రసంగం చేశారు. నవతరం రచయితలు తెలుగే కాకుండా వివిధ భాషల్లో వస్తున్న రచనల్ని అధ్యయనం చేస్తే మరింత పరిణతి సాధించే అవకాశం ఉందన్నారు. వికారాబాద్ సమీపంలోని అలంపల్లిలో జన్మించానని, 'మిణుగురు', 'పచ్చబొట్టు పటంచెరు' 'భరోసా', 'గంధం చెట్టు' వంటి కవితా సంపుటాలు, 'వట్టికోట ఆళ్వారుస్వామి జీవిత చరిత్ర, సాహిత్య సందర్భం సమకాలీన స్పందన'వంటి విమర్శ గ్రంథాలు, అనువాదాలు వెలువరించానని తెలిపారు. పరిషత్తు అధ్యక్షులు ఆచార్య ఎల్లూరి శివారెడ్డి, ప్రధాన కార్యదర్శి డా. జుర్రు చెన్నయ్య, కోశాధికారి మంత్రి రామారావు, కార్యక్రమ సలహాదారు గోవిందరాజు రామకృష్ణారావులతో పాటు సాహితీవేత్తలు హాజరయ్యారు.

కళ... భళా!




రాజస్థాన్ నుంచి వలస వచ్చిన వారు వీరు. రాజ్‌పథ్, బిర్బు, విజయ్... నల్లకుంట శివం రోడ్డులో ఐసీఐసీఐ బ్యాంకు వద్ద కనిపిస్తారు. చెట్ల కొమ్మలను అందమైన బొమ్మలుగా చెక్కుతూ ఆకట్టుకుంటున్నారు.

–శ్యామ్, కాచిగూడ

ఇదేం సుందరీకరణ



నిత్యం రద్దీగా ఉండే నారాయణగూడ చౌరస్తా పిచ్చిమొక్కలతో కళావిహీనంగా ఉంది. సార్లూ... కాస్త పట్టించుకోండి. –రజిత, నారాయణగూడ

దాతలూ... ఆర్టీసీకి లేవు చేతలు



షాపూర్‌నగర్‌లో రైతు బజార్ ఎదురుగా దాతలు కట్టించిన బస్‌స్టాప్ ఇది. కానీ డ్రైవర్లు రోడ్డుపై బస్సులు ఆపి వెళ్లిపోతున్నారు. షెల్టర్ ఉండీ ఏం ప్రయోజనం? –జి.సీతారామారావు, జీడిమెట్ల

పౌర పాత్రికేయం

వాట్సాప్ నంబరు: 8008001763

మీ చేతిలో సెల్‌ఫోన్ ఉందా? ఎక్కువ మందిని ప్రభావితం చేస్తున్న అంశాలను, విభిన్నమైన చిత్రాలను క్లిక్ మనిపించారా? వాటిని మీరూ 'ఈనాడు'కు పంపొచ్చు.

మానవతం... కావాలి పటిష్ఠం



'మానవత్వపు గోడ' ఆలోచన మంచిదే... కానీ ఆచరణకే అడ్డంకులొస్తున్నాయి. ప్రస్తుతం వర్షాకాలం... ఎవరైనా ఉప్పల్ పోలీసు స్టేషన్ వద్ద ఉన్న ఈ గోడ వద్ద దుస్తులు, ఇతర వస్తువులు ఉంచితే నాని పనికిరాకుండా పోతాయి. కనీసం రెండు, మూడు రోజులైనా భద్రంగా ఉండేలా ఏర్పాట్లు చేస్తే బాగుంటుంది. –శేఖర్ పిన్నపురెడ్డి, అంబర్‌పేట

పొగ... ఆరోగ్యానికి సెగ



నగరంలో ఈ బస్సులంటే బెంబేలెత్తే పరిస్థితి నెలకొంది. నల్లటి పొగను మేఘాల్లా వదులుతూ వాటి వెనుక వెళ్లే వాహన చోదకుల ఆరోగ్యాన్ని తినేస్తున్నాయి. ఏదైనా ప్రభుత్వ విభాగం స్పందించి చర్యలు తీసుకొంటే బాగు.

–సాయిగౌడ్ చెవిగోని, నాగోలు

చారిత్రక సొబగు



దిల్‌సుఖ్‌నగర్ మెట్రో స్టేషన్ వద్ద ఉన్న 1940 సంవత్సరం నాటి సమాధి ఇది. ఇప్పటికీ చెక్కుచెదరకుండా అలాగే ఉంది.

–శివప్రసాద్, చైతన్యపురి

నాణెం... దైన్యం



నిజాంపేట మధురా నగర్‌లో ఓ షాపు ముందు ఏర్పాటు చేసిన బ్యానర్ ఇది. రూ.10 నాణేలు రద్దవుతున్నాయన్న అవాస్తవ ప్రచారంతో కొంతమంది ఇలా బ్యానర్లు ఏర్పాటు చేసి వాటిని తీసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. –దేవి, మధురానగర్

జలకాలాటలు



అడపాదడపా కురుస్తున్న వర్షాలకు భవనాలపై నీళ్లు నిలుస్తున్నాయి. అందులో జలకాలాటలు ఆడుతున్న పావురాలు స్నేహపురి కాలనీ రోడ్ నంబరు-2లోని ఓ ఇంటిపై ఇలా కనిపించి ఆకట్టుకున్నాయి. –శ్రీకాంత్‌రెడ్డి, నాగోలు

వినాయక మండపాల ఏర్పాటుకు పోలీసు అనుమతులు తప్పనిసరి

రాయదుర్గం, న్యూస్‌టుడే: వినాయక మండపాల ఏర్పాటుకు నిర్వాహకులు పోలీసులనుంచి తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలని సైబరాబాద్ పోలీసు కమిషనర్ సందీప్‌శాండిల్య పేర్కొన్నారు. పోలీసు నిరభ్యంతర(ఎన్‌ఓసీ), పోలీసు క్లియరెన్స్ సర్టిఫికెట్లు పొందాలని సూచించారు. నవరాత్రుల్లో అధిక శబ్దాలు విడుదలచేసే డీజేలు కాకుండా బాక్సు మాదిరి లౌడ్‌స్పీకర్లను మాత్రమే ఏర్పాటుచేసుకోవాలన్నారు. మండపాల అనుమతుల కోసం సైబరాబాద్ వెబ్‌సైట్లో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని, పోలీసుస్టేషన్‌లలో కూడా దరఖాస్తు ఫారాలను అందుబాటులో ఉంచుతామని తెలిపారు.

● ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నాక వాటి ప్రింట్‌ను సంబంధిత పోలీసుస్టేషన్‌లో అందజేయాలి. ● అన్ని పోలీసుస్టేషన్లలో ఈనెల 25 నుంచి 31వ తేదీ వరకు దరఖాస్తు ఫారాలు అందుబాటులో ఉంటాయి. పూరించిన వాటిని అదే గడువులో స్థానిక పోలీసుస్టేషన్లలో అందజేయాలి. నిర్వాహకుల దరఖాస్తుల ఆధారంగా మండపాల ఏర్పాటుచేసే ప్రదేశాలను పరిశీలించి పోలీసులు అనుమతులిస్తారు. ● మండపం ఏర్పాటుచేసే స్థలానికి సంబంధించిన యజమానినుంచి ఎన్‌ఓసీ, ఆ ప్రదేశం వివరాలు, నిమజ్జనం చేసే తటాకం, మార్గం వివరాలు, విద్యుత్ విభాగం అనుమతి పత్రాన్ని దరఖాస్తుకు జతచేయాలి. ● నిమజ్జనానికి వెళ్లే సమయం, మార్గానికి సంబంధించిన వివరాలను సంబంధిత ఏసీపీలనుంచి తీసుకోవాలి. ● అపార్ట్‌మెంట్ల వారు కూడా ఏర్పాటుచేసే విగ్రహాలకు నిమజ్జన అనుమతి పొందాలి. ● ప్రజలు రాకపోకలు సాగించే రహదారులపై మండపాలను ఏర్పాటుచేయకూడదు. ● మండపాలు, పరిసరాల్లో అనుమానాస్పద వస్తువులు, వ్యక్తులు కనిపిస్తే వెంటనే డయల్ 100 లేదా 94906 17444కు సమాచారమివ్వాలి.



సంతకం చేస్తున్న వినోద్‌కుమార్ యాదవ్

స్వచ్ఛ రైల్ - స్వచ్ఛభారత్ ప్రతిజ్ఞ

స్వచ్ఛరైల్-స్వచ్ఛభారత్ పేరిట పరిసరాల పరిశుభ్రత కార్యక్రమాన్ని ద.మ. రైల్వే జీఎం వినోద్‌కుమార్ యాదవ్ బుధవారం రైల్ నిలయంలో ప్రారంభించారు. ఈ నెల 16 నుంచి 31వ తేదీ వరకూ సంతకాల సేకరణతో పాటు.. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుదామనే అవగాహన కార్యక్రమాన్ని సంతకాల సేకరణతో నాందీ పలికారు. ఈ సందర్భంగా అన్ని విభాగాల ముఖ్య అధికారులు, డివిజనల్ రైల్వే మేనేజర్లు, వర్కుషాపుల మేనేజర్లతో పాటు ఇతర అధికారులతో ఈ మేరకు ప్రతిజ్ఞ చేయించారు.

–ఈనాడు, హైదరాబాద్

పాత నేరస్థుని అరెస్టు
రూ.2.20 లక్షల సొత్తు స్వాధీనం



నిందితుడు శ్రీనివాస్

కాప్రా, న్యూస్‌టుడే: రాత్రి వేళ తాళాలు వేసి ఉన్న ఇళ్లలో దొంగతనాలకు పాల్పడుతున్న పాత నేరస్థుడిని కుషాయిగూడ పోలీసుల అరెస్టు చేశారు. సీఐ కె.చంద్రశేఖర్, క్రైం ఎస్‌ఐ జి.చంద్రశేఖర్ మాట్లాడుతూ.. మేడ్చల్ జిల్లా ఫిర్జాదీగూడకు చెందిన శ్రీనివాస్ (38) గతంలో పలు ప్రాంతాల్లో చోరీలకు పాల్పడ్డాడు. ఈసీఐఎల్‌లో చోరీ సొత్తుతో సంచరిస్తుండగా మల్కాజిగిరి సీసీఎస్ పోలీసుల సహకారంతో అరెస్ట్ చేసినట్లు సీఐ తెలిపారు. కుషాయిగూడ ఠాణా పరిధిలో మూడు ఇళ్లల్లో చోరీ చేసినట్లు విచారణలో వెల్లడైందని, అతని నుంచి రూ.2.20 లక్షల నగలను స్వాధీనం చేసుకుని, రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

గంజాయి రవాణా.. నలుగురి అరెస్టు : 14కిలోల సరకు స్వాధీనం

బాలానగర్ (మూసాపేట), న్యూస్‌టుడే: గంజాయి రవాణా కేసులో నలుగురిని బాలానగర్ ఎక్సైజ్ పోలీసులు బుధవారం అరెస్ట్ చేశారు. సీఐ జీవన్‌కిరణ్ తెలిపిన ప్రకారం.. నగరంలోని ధూల్‌పేట నుంచి ఫతేనగర్‌కు ఆటోలో గంజాయి రవాణా అవుతున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. దీంతో కాపుకాసిన పోలీసులు తనిఖీలు నిర్వహించారు. మారుతీ, నందినిలతో పాటు ఆటోడ్రైవర్ రాజులను అదుపులోకి తీసుకుని వారినుంచి 14 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. వీరినుంచి సరకు అందుకునే ఫతేనగర్ పిట్టలబస్తీ నివాసి జగన్‌లాల్ పరారీలో ఉన్నాడు. ఇక మరో కేసులో పిట్టలబస్తీకే చెందిన సురేష్‌సింగ్ ఇంట్లో నిల్వఉంచిన 1.5కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. రెండుకేసుల్లో స్వాధీనం చేసుకున్న సరకు విలువ రూ.1.50లక్షలు ఉంటుందని సీఐ తెలిపారు. నిందితులను న్యాయస్థానంలో హాజరుపరిచారు.

కారులోనే క్యాబ్ డ్రైవర్ మృతి!

మూసాపేట, న్యూస్‌టుడే: అనుమానాస్పద స్థితిలో ఓ కారు డ్రైవర్ మరణించిన సంఘటన కూకట్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్సై జి.గోపినాథ్ తెలిపిన ప్రకారం.. మూసాపేటకు చెందిన ఎన్.నరేంద్రప్రసాద్(44) ఉబర్ సంస్థలో క్యాబ్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. మూసాపేట గూడ్స్‌షెడ్ రోడ్డులోని పోచమ్మఆలయం సమీపంలో ఇతని కారు మంగళవారం రాత్రి ఆగి ఉండటాన్ని స్థానికులు గమనించారు. కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వగా వారు వచ్చి చూశారు. అదే కారులో అతను డ్రైవింగ్ సీటులోనే కూర్చుని మృతిచెంది ఉన్నాడు. ఎలా మృతిచెందాడనేది తెలియరాలేదు. క్యాబ్ సంస్థ నిర్వాహకుల ఒత్తిడి కారణంగానే అతను మానసిక సంఘర్షణకు గురై మరణించినట్లు మృతుని బంధువులు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.



పచ్చదనం, పరిశుభ్రత నిలయంగా నానక్‌రాంగూడ ప్రాథమికోన్నత పాఠశాల

పరిశుభ్రతకు ప్రాధాన్యం..

విద్యార్థుల్లో అవగాహన

● ఫలితమే స్వచ్ఛ విద్యాలయ పురస్కారం..

● నానక్‌రాంగూడ ప్రాథమికోన్నత పాఠశాల ఘనత

రాయదుర్గం, న్యూస్‌టుడే

కొన్నేళ్లుగా ఆ పాఠశాలలో పరిశుభ్రతకు ప్రాధాన్యమిస్తున్నారు.. విద్యార్థులకు స్వచ్ఛత పట్ల అవగాహన కల్పించడంతో పాటు వివిధ చర్యలతో పరిసరాలు నిత్యం పరిశుభ్రంగా ఉండేలా చూస్తున్నారు.. నిర్వహణకు ప్రభుత్వం ఇస్తున్న సహాయానికి ప్రైవేటు సంస్థల చేయూత తోడుకావడంతో ఆ పాఠశాల స్వచ్ఛతను నిలబెట్టుకుంటోంది... వెరసి పరిశుభ్రత, స్వచ్ఛతతో అలరారుతున్న నానక్‌రాంగూడ మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల జిల్లాస్థాయి స్వచ్ఛ విద్యాలయ పురస్కార్(2016)ను సాధించింది. అలా పురస్కారాలు అందుకున్న నాలుగు పాఠశాలల్లో ఒకటిగా నిలిచింది. మంగళవారం సైబరాబాద్ కమిషనరేట్‌లో జరిగిన స్వాతంత్ర్య దిన వేడుకల్లో పురస్కారానికి సంబంధించిన ధ్రువీకరణ పత్రాన్ని ఉపముఖ్యమంత్రి మహమూద్ అలీ చేతుల మీదుగా ఈ పాఠశాల ఉపాధ్యాయులు అందుకున్నారు. ఈ పురస్కారం సాధనకు తోడ్పడిన అంశాలు.. ఇతర విశేషాలను పరిశీలిస్తే...

ప్రత్యేక శ్రద్ధ..

ఈ పాఠశాలలో మొత్తం 250 మంది విద్యార్థులు చదువుతున్నారు. కార్యాలయ గది సహా ఏడు తరగతి గదులున్నాయి. బాలబాలికలకు వేర్వేరుగా నాలుగు చొప్పున ఎనిమిది మరుగుదొడ్లు, ప్రత్యేకంగా మూత్రశాలలు ఉన్నాయి. వాటిని రోజూ ఉదయం, సాయంత్రం వాచ్‌మన్ శుభ్రంచేస్తాడు. విద్యార్థులు వాటిని వినియోగించుకున్నాక ఎప్పటికప్పుడు నీరు పోసేలా అవగాహన కల్పించారు. ఇందుకు పుష్కలంగా నీటిని అందుబాటులో ఉంచుతారు. పాఠశాల ప్రాంగణంలో సంప్(భూగర్భ ట్యాంకు) ఏర్పాటుచేశారు. నీటి సరఫరా జరిగే రోజు ఆ సంప్‌ను నింపుతారు. అనంతరనం మరుగుదొడ్ల పైకప్పులపై ఉంచిన ట్యాంకుల్లోకి మోటర్ ద్వారా నీటిని పంపుతారు. విద్యార్థులు మరుగుదొడ్లు, మూత్రశాలలు వినియోగించుకున్నాక నల్లాలను విప్పడం ద్వారా అవి శుభ్రపడే ఏర్పాటుచేశారు. దీంతో నిత్యం స్వచ్ఛంగా ఉంటాయి.



వివిధ అంశాలపై చార్టులు, చిత్రాలున్న గోడలతో తరగతి గది..

వ్యక్తిగత స్వచ్ఛతపైనా..

విద్యార్థులందరూ వ్యక్తిగత స్వచ్ఛతను పాటించేలా ఉపాధ్యాయులు చర్యలు తీసుకున్నారు. పాఠశాల ఆవరణలో వాష్‌బేసిన్ ఏర్పాటుచేసి నల్లాలు బిగించారు. అక్కడ నిత్యం హ్యాండ్ వాష్ ద్రావణాన్ని అందుబాటులో ఉంచుతారు. విద్యార్థులు మరుగుదొడ్లకు వెళ్లొచ్చాక తప్పనిసరిగా ఆ ద్రావణంతో చేతులు శుభ్రపరుచుకుంటారు. మధ్యాహ్న భోజన సమయంలోనూ ఇలాగే చేతులు కడుక్కుంటారు.

చెత్తబుట్టలు..

పాఠశాల ఆవరణ, తరగతి గదుల్లో కాగితాలు, చాక్లెట్ కవర్లవంటి చెత్తను ఎక్కడపడితే అక్కడ వేయకుండా.. అటు తరగతి గదులతోపాటు ప్రాంగణంలో చెత్తబుట్టలు ఏర్పాటుచేశారు. ఎక్కడైనా చెత్త కనిపించగానే విద్యార్థులు తీసుకెళ్లి బుట్టల్లో వేస్తారు. విద్యార్థులు తమ చెప్పులను కూడా తరగతి గది బయటే వదిలేస్తారు.

ప్రార్థన సమయంలో అవగాహన..

నిత్యం పరిశుభ్రతను పాటించేలా విద్యార్థులందరికీ రోజూ ఉదయం సంబంధిత అంశాలపై ప్రార్థన సమయంలో ఉపాధ్యాయులు అవగాహన కల్పిస్తారు. పరిశుభ్రత, ఆరోగ్య విషయాలపై విద్యార్థులు ప్రసంగించేలా, చర్చించేలా చూస్తారు. ఎవరైనా విద్యార్థి చెత్తను బయట పారవేస్తే అతడికి కౌన్సిలింగ్(నచ్చచెప్పడం) చేస్తారు. స్వచ్ఛతను బడికే పరిమితం చేయకుండా ఇళ్లవద్దా పాటించాలని, తల్లిదండ్రులు, అన్నదమ్ములు, స్నేహితులు కూడా ఇదే మార్గాన్ని అనుసరించేలా చూడాలని విద్యార్థులకు సూచిస్తారు. భోజనాలు ముగిశాక వ్యర్థాలను ఇష్టానుసారం కాకుండా క్రమ పద్ధతిలో బుట్టలో వేస్తారు. ఆరు, ఏడు తరగతుల విద్యార్థులు పదిమందితో స్వచ్ఛకమిటీలను నియమించి పరిశుభ్రతను పర్యవేక్షించేలా చర్యలు తీసుకుంటున్నారు.

అవగాహన కల్పనే ప్రధానం: అనంతరాములు, ప్రధానోపాధ్యాయుడు



పలు అనారోగ్య సమస్యలకు అపరిశుభ్రతే కారణం.. అందుకే పరిశుభ్రతపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తే వారితో పాటు కుటుంబ సభ్యులూ పాటించేలా చూస్తారు. స్వచ్ఛతకు అధిక ప్రాధాన్యమిస్తున్నాం. పాఠశాల నిర్వహణకు ప్రభుత్వం కేటాయిస్తున్న నిధులతో హ్యాండ్‌వాష్ తదితరాలను కొనుగోలు చేస్తున్నాం. ప్రైవేటు సంస్థలూ మరుగదొడ్ల నిర్వహణకు సిబ్బందిని నియమించి సహకరిస్తున్నాయి. ఫిల్టర్ ద్వారా స్వచ్ఛమైన తాగునీటిని విద్యార్థులకు అందుబాటులో ఉంచుతున్నాం.



శ్రీకాంత్‌తో కలిసి వివరాలు వెల్లడిస్తున్న గాంధీ ఆసుపత్రి వైద్యులు

శ్వాస నాళంలోని కణతి తొలగింపు

గాంధీ ఆసుపత్రి, న్యూస్‌టుడే: శ్వాస నాళంలో ఉన్న కణతి వల్ల ఓ విద్యార్థి మూడు నిమిషాలకోసారి విపరీతమైన దగ్గు.. శ్వాస తీసుకోవడానికి తీవ్ర ఇబ్బంది పడేవాడు. గాంధీ ఆసుపత్రి వైద్యులు ఆ విద్యార్థికి ఆరు గంటలు పాటు శస్త్రచికిత్స చేసి శ్వాస నాళం నుంచి కణతి తొలగించడమే కాకుండా ఇబ్బంది తొలగించారు. గాంధీ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శ్రావణ్‌కుమార్, సీటీ సర్జరీ విభాగాధిపతి డాక్టర్ రవీందర్ ఈ వివరాలను బుధవారం మీడియాకు వెల్లడించారు. ఆదిలాబాద్ జిల్లా జైనథ్ మండలం పార్డీ(బి) గ్రామానికి చెందిన సంతోష్, రమ దంపతుల కుమారుడు శ్రీకాంత్(16) ఇంటర్ చదువుతున్నాడు. చిన్నప్పటి నుంచి దగ్గు, దమ్ము, ఆయాసం వంటి సమస్యలతో బాధపడేవాడు. గత నెలలో సమస్య తీవ్రమవడంతో మహారాష్ట్రలోని యావత్‌మాల్, అక్కడి నుంచి వార్ధా, ఆ తర్వాత నాగ్‌పూర్‌లలోని ఆసుపత్రులకు తీసుకెళ్లారు. వైద్యులు పరీక్షించి కణతి ఉన్నట్లు గుర్తించారు. శస్త్రచికిత్సకు భారీగా ఖర్చవుతుందని, ప్రాణాలకు నమ్మకం లేదని చెప్పడంతో ఆగస్టు 1వ తేదీన గాంధీ ఆసుపత్రికి వచ్చారు. డాక్టర్ రవీందర్‌కు తమ కుమారుడి పరిస్థితిని వివరించారు. శ్రీకాంత్‌ను పరీక్షించిన రవీందర్ వెంటనే శస్త్రచికిత్స చేయాలని నిర్ణయించారు. అప్పటికే సాయంత్రం కావడంతో వైద్యులు, సిబ్బంది ఇళ్లకి వెళ్లిపోయారు. అవసరమైన వారిని తిరిగి రప్పించి సాయంత్రం ఆరు గంటలకు శస్త్రచికిత్స ప్రారంభించి అర్ధరాత్రి ఒంటి గంటకు పూర్తి చేశారు. కణతి తొలగించడంతో శ్రీకాంత్ కోలుకున్నాడు. వైద్యపరిభాషలో దీన్ని 'ఎక్సిషన్ ఆఫ్ ట్రెకియల్ ట్యూమర్'గా పేర్కొంటారని, అరుదైన ఈ కణతికి విజయవంతంగా శస్త్రచికిత్స చేశామని తెలిపారు. వైద్యులు అరుణ్, సత్యజీ, సురేష్, భానులక్ష్మి తదితర బృందం ఇందులో పాల్గొన్నారు.

'లీడర్ ఫర్ ఎవర్' కార్యశాల నేడు

శంషాబాద్ గ్రామీణ: భగవద్రామానుజాచార్యులు ఈ భూమ్మీద జీవించి వెయ్యి సంవత్సరాలు పూర్తి అవుతున్న సందర్భంగా శ్రీరామనగరంలోని జీవా ప్రాంగణంలో నేడు ఇంజినీరింగ్ విద్యార్థులతో కార్యశాల నిర్వహిస్తున్నట్లు బుధవారం చిన జీయర్ స్వామి తెలిపారు. దివ్య సాకేతంలో అంగరంగ వైభవంగా చాతుర్మాస దీక్షలను చిన జీయర్ స్వామి నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో గురువారం ఉదయం 9నుంచి సాయంత్రం 5 వరకు నగరానికి చెందిన దాదాపు 800 మంది ఇంజినీరింగ్ విద్యార్థులతో 'లీడర్ ఫర్ ఎవర్' అంశంపై కార్యశాల ఏర్పాటు చేస్తున్నారు. విద్యార్థుల సందేహాలను చిన జీయర్ స్వామి నివృత్తి చేయనున్నారు.



చినజీయర్ స్వామి

మాయమాటలతో ఆభరణాలు చోరీ

జూబ్లీహిల్స్, న్యూస్‌టుడే: ఇంటి పక్కనున్న మహిళలను తన మాయమాటలతో నమ్మించి బంగారు ఆభరణాలను తస్కరించిన నిందితురాలిని జూబ్లీహిల్స్ పోలీసులు అరెస్టు చేశారు. జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఇన్‌స్పెక్టర్ సామల వెంకటరెడ్డి, డీఐ ముత్తు, డీఎస్సై శ్రీను వెల్లడించారు. కుత్బుల్లాపూర్ సమీపంలోని పాండుబస్తీకి చెందిన మహ్మద్ మైమున్నా (29) కార్మికనగర్‌లో పనిమనిషిగా పని చేస్తోంది. తనకు వచ్చే డబ్బుతో ఇల్లు గడవడం కష్టంగా మారడంతో చోరీ మార్గం ఎంచుకుంది. ఇంటి పక్కన నివసించే ఆసీఫ్ ఖాన్ కుటుంబ సభ్యులతో మాటలు కలిపి, తరచూ వాళ్ల ఇంటికి వెళ్తూ జులైలో వారింట్లోని 4.75 తులాల బంగారు ఆభరణాలను చోరీ చేసింది. ఈ విషయాన్ని ఆసిఫ్ కుటుంబ సభ్యులు ఆలస్యంగా గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకొని, బుధవారం నిందితురాలిని అరెస్టు చేశారు. ఆమె నుంచి ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు.



ఉస్మానియా యూనివర్సిటీలో విద్యార్థులు కళాశాల క్యాంపస్‌నుంచి బయటకు వెళ్లేందుకు దూరాభారం తగ్గించుకునేందుకని ఇలా గోడ దూకుతున్నారు. దీంతో వారు ప్రమాదాల పాలయ్యే అవకాశముంది.

లండన్ సదస్సుకు ఆహ్వానం

హైదరాబాద్: శాస్త్రీయ పరిశోధన, సాంకేతిక ఆవిష్కరణలపై సెప్టెంబరు 13 నుంచి రెండు రోజుల పాటు లండన్‌లో నిర్వహించే అంతర్జాతీయ సదస్సులో పాల్గొనేందుకు వర్సిటీ ఎడ్యుకేషన్ మేనేజ్‌మెంట్ లిమిటెడ్ ముఖ్య కార్యనిర్వహణాధికారి డాక్టర్ మన్నం కృష్ణమూర్తికి ఆహ్వానం అందింది. అంతర్జాతీయ సమాఖ్య ఆధ్వర్యంలో లండన్‌లోని సుప్రసిద్ధ విద్యాసంస్థ, ఇంపీరియల్ కళాశాలలో నిర్వహించే ఈ సదస్సులో తీర ప్రాంతాల్లోని భూగర్భ జలాల గుణాత్మక విశ్లేషణ, రసాయన పరిశీలన అనే అంశాలపై ప్రసగించనున్నట్లు కృష్ణమూర్తి తెలిపారు. 'ఈనాడు' ప్రతిభ, అంతర్జాల విభాగంలో ఆయన విషయ నిపుణులుగా ఉన్నారు.



మన్నం కృష్ణమూర్తి

50 రోజులు... రూ. 3 కోట్లు

- పెట్రోల్ పంపు నిర్వహణలో మహిళా ఖైదీల సత్తా
- వినియోగదారుల ఆదరణ.. అధికారుల అభినందన



బంకులో విధులు నిర్వర్తిస్తున్న చంచల్‌గూడ మహిళా జైలు ఖైదీలు

ఈనాడు, హైదరాబాద్ - న్యూస్‌టుడే, చంచల్‌గూడ

పెట్రోల్ పంపుల్లో పనిచేయాలంటే దేహదారుఢ్యం అవసరం.. కనీసం ఆరేడు గంటలు నిలబడే ఉండాలి... వినియోగదారుల రద్దీ ఉన్నప్పుడు సమయం వృథా చేయకుండా వెంటవెంటనే వాహనాల్లో ఇంధనం నింపాలి.. అందుకే పురుషులు మాత్రమే ఈ పనులు చేయగలరన్న అభిప్రాయాన్ని.. చంచల్‌గూడ జైలు మహిళాఖైదీలు మార్చేశారు. కేవలం 50 రోజుల్లోనే రూ.3 కోట్ల ఇంధనాన్ని విక్రయించారు. చంచల్‌గూడ జూనియర్ కళాశాల ఎదురుగా వీరు విధులు నిర్వహించే పెట్రోల్ పంపును జూన్ 23న ప్రారంభించారు. ఆ రోజు నుంచి సగటున రోజుకు రూ.8 లక్షల పెట్రోల్, డీజిల్‌ను విక్రయిస్తున్నారు. శిక్ష అనుభవిస్తున్న వారితో పాటు విడుదలైన వారికి ఉపాధి కల్పించేందుకు జైళ్ల శాఖ తెచ్చిన కొత్త పథకం ద్వారా 25 మంది ఇందులో ఉపాధిని పొందుతున్నారు. ముందే శిక్షణ ఇవ్వడంతో విధుల్లో సమయస్ఫూర్తితో వ్యవహరిస్తూ వినియోగదారులు, జైలు అధికారుల నుంచి అభినందనలు అందుకొంటున్నారు. ఖైదీలు కుట్లు, అల్లికలతో తయారు చేసిన ఉత్పత్తులను విక్రయించేందుకు బంకు ఆవరణలోనే ఓ స్టాల్‌ను ఏర్పాటు చేశారు. వీటికీ ప్రజలు మంచి ఆదరణ లభిస్తోంది.



బంకు ఆవరణలో ఖైదీలు తయారు చేసిన ఉత్పత్తుల స్టాల్

ఆత్మవిశ్వాసం... ఆర్థిక ఆలంబన..

ఖైదీలకు శిక్షణ ఇచ్చిన అధికారులు.. ప్రధానంగా వారి ప్రవర్తనను సునిశితంగా గమనించారు. శిక్ష అనుభవించి సత్ప్రవర్తనతో జైలు నుంచి విడుదలైన వారినీ పరిగణనలోకి తీసుకున్నారు. మహిళలు జైలు శిక్ష పూర్తయి విడుదలయ్యాక సమాజంలో కొన్నిరకాల ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ప్రధానంగా జీవనాధారం దొరకడం సమస్యగా ఉంది. ఈ నేపథ్యంలో జైళ్ల శాఖ డీజీ వినయ్‌కుమార్‌సింగ్ వీరికి పెట్రోల్ బంకులో పనిచేసే అవకాశాన్ని కల్పించారు. ఆర్థికంగా మరొకరిపై ఆధారపడకుండా ఆత్మవిశ్వాసంతో జీవించేలా భరోసా ఇస్తున్నారు. కొందరు మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకోవడంతో పాటు పిల్లలను చదివించుకొంటున్నారు. ఇక్కడ పనిచేస్తున్న ప్రతి మహిళా ఖైదీకి నెలకు రూ.12వేల జీతాన్ని జైలు అధికారులు ఇస్తున్నారు. ప్రస్తుతం ఇక్కడ పెట్రోల్, డీజిల్ యూనిట్లు రెండు మాత్రమే ఉన్నాయి. భవిష్యత్తులో మరో రెండు పెంచేందుకు అధికారులు ప్రణాళికను సిద్ధం చేశారు.

రాష్ట్రవ్యాప్తంగా ఆదరణ...

చంచల్‌గూడ జైలు వద్ద 5 ఏళ్ల క్రితం ఏర్పాటు చేసిన పురుష ఖైదీల నిర్వహణలోని పెట్రోల్ బంకు ఇప్పటికే ఏడాదికి రూ.100 కోట్ల టర్నోవర్ దాటేసింది. జైళ్ల శాఖకు సంవత్సరానికి రూ.3.60 కోట్ల ఆదాయాన్ని జమచేస్తోంది. ఈ బంకు ద్వారా వస్తున్న ఆదాయాన్ని పరిగణనలోకి తీసుకొని... ఆ శాఖ ఉన్నతాధికారులు రాష్ట్రంలోని ఇతర ప్రాంతాల్లోనూ ఖైదీలు నిర్వహించే పెట్రోల్ పంపులను ప్రారంభించి విజయవంతంగా నడుపుతున్నారు. అధికారులు తమపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా, క్రమశిక్షణతో ఖైదీలు విధులు నిర్వహిస్తున్నారు. తెలంగాణా జైళ్లశాఖ ఆధ్వర్యంలో ఖైదీలు నడుపుతున్న 13 బంకుల వార్షిక టర్నోవర్ రూ.450 కోట్లు దాటింది. ఆ శాఖకు వస్తున్న ఆదాయం రూ.15 కోట్లకు చేరింది.

మళ్లీ నేరాలొద్దనే...: ఆకుల నరసింహ, జైళ్లశాఖ ఐజీ

ఒకసారి జైలుకు వచ్చిన వారు మరోసారి నేరాల వైపు చూడకుండా, నేర రహిత సమాజ నిర్మాణం కోసం మా శాఖ చేస్తున్న ప్రయత్నాల్లో పెట్రోలు బంకుల వ్యాపారం చేరింది. కార్మిక చట్టాలను అనుసరించి వీరికి వేతనాలు ఇస్తున్నాం. ఖైదీలు తమలో తాము పోట్లాడుకోవడం మాని.. క్రమశిక్షణతో మెలిగి అధికారులు మెప్పు సంపాదించి ఇలాంటి ఉపాధి పొందేందుకు పోటీ పడుతున్నారు. వారిలో వస్తున్న పరివర్తనతో మరిన్ని సేవలకు వినియోగించుకునేందుకు ప్రయత్నిస్తున్నాం.

జీవితంపై ప్రేమ చిగురించింది

-అనిత, ఉప్పల్



క్షణికావేశంలో తెలిసీ తెలియక హత్యా నేరంలో జైలుకు వచ్చాను. మొదట్లో చాలా నిరాశ ఆవరించింది. ఇక జీవితం జైల్లోనే ముగుస్తుందన్న భావనతో అన్యమనస్కంగా ఉండేదాన్ని. అధికారులు నాతో మాట్లాడటంతో పాటు కౌన్సెలింగ్ ఇప్పించారు. అప్పటి నుంచి ప్రవర్తన మార్చుకున్నాను. మంచిగా ఉంటే జైలు నుంచి విడుదలవుతావ్ అన్న మాటలతో జీవితంపై మళ్లీ ప్రేమ చిగురించింది. అవమాన భారంతో కాకుండా ఆత్మవిశ్వాసంతో మెలిగాను. అందుకే అధికారులు బంకులో ఉపాధి కల్పించారు.



గతాన్ని పీడకలలా వదిలేశా

-పద్మ, మహబూబ్‌నగర్

చట్టం దృష్టిలో నేను హత్యానేరంలో దోషిని. నాకు తెలియకుండా జరిగిందని చెప్పినా ఎవరూ నమ్మలేదు. జైలుకు వచ్చాక కొద్దిరోజులు మానసిక క్షోభను అనుభవించాను. అధికారుల చొరవతో గతాన్ని పీడకలలా వదిలేశాను. అప్పటి నుంచి జైల్లో ఉపాధి శిక్షణ, ఇతర కార్యక్రమాల్లో పాల్గొన్నాను. తప్పుచేసినా సరిదిద్దుకునేందుకు అవకాశం ఉందని అధికారులు తెలిపారు. కొత్త ఉత్సాహంతో పనులు చేస్తున్నాను. పెట్రోలు పంపులో నాకు అవకాశం రావడం ఎంతో సంతోషంగా ఉంది.

కచ్చితమైన కొలత ఉంటోంది

- శ్రీనివాస్, చంపాపేట్, వినియోగదారుడు

ఈ బంకు ప్రారంభించిన రోజు నుంచి పెట్రోల్ పోయించుకొంటున్నాను. ఇతర బంకుల్లో కొలతల్లో మోసం ఉంటోంది. అది నాకు ప్రత్యక్ష అనుభవం. ఈ బంకులో ఆ పరిస్థితి లేదు. డబ్బుకు సరిపడా పెట్రోల్ కచ్చితంగా వస్తోంది.

'భరోసా' కల్పించి.. ఖ్యాతిని పెంచి...



- హైదరాబాద్ పోలీస్‌కు ప్రతిష్ఠాత్మక 'నారీ చేతన' పురస్కారం
- ఇతర రాష్ట్రాల్లోనూ అమలుకు సన్నాహాలు

ఈనాడు, హైదరాబాద్

భార్యాభర్తల మధ్య అభిప్రాయభేదాలు... గృహహింస బాధితులు.. తాగుబోతు భర్తలతో చిత్రహింసలు అనుభవిస్తున్న వారి సమస్యలను పరిష్కరిస్తున్న 'భరోసా' కేంద్రం జాతీయస్థాయిలో ఖ్యాతిని పెంచుకొంటోంది. దేశంలోనే తొలిసారిగా నగరంలో హైదరాబాద్ పోలీసుల నిర్వహణలో ఈ కేంద్రం ప్రారంభమైంది. దంపతుల్లో విభేదాలు తీవ్రస్థాయికి చేరి పోలీసులను ఆశ్రయించిన సందర్భాల్లో కేసులు నమోదు చేయకుండా .. వారి మధ్య అపోహలను తొలగించేందుకు మానసిక నిపుణులతో కౌన్సెలింగ్ ఇప్పిస్తోంది. ఇక్కడికి వచ్చే ప్రతి ఒక్కరితో పోలీస్ అధికారులు ఆప్యాయంగా మాట్లాడుతున్నారు. అవకాశమున్నంత వరకు సామరస్యపూర్వక పరిష్కారాలకు ప్రయత్నిస్తున్నారు. భర్త, అత్తమామలు పెట్టే చిత్ర హింసలు భరించలేం అంటున్న వారి మనోగతాన్ని గౌరవిస్తున్నారు. మద్యానికి బానిసై భార్యను వేధించేవారిలో తాగే అలవాటును మాన్పించేందుకు 'డీ-అడిక్షన్' కేంద్రాలకు పంపుతున్నారు. ఇలా వైవిధ్యమైన సేవలతో ఇంటా, బయటా 'భరోసా'కు గుర్తింపు రావడంతో పలు పురస్కారాలు వస్తున్నాయి. తాజాగా కేంద్రప్రభుత్వం, మహిళా ఔత్సాహిక పారిశ్రామికవేత్తల సంఘం నారీ చేతన అవార్డును అందించాయి. దిల్లీలో ఈ నెల 9న జరిగిన ప్రదానోత్సవంలో కేంద్రమంత్రులు హరిభాయ్.పి.చౌదరి, కృష్ణరాజ్ చేతుల మీదుగా అదనపు సీపీ(నేరపరిశోధన) స్వాతిలక్రా పురస్కారాన్ని స్వీకరించారు.



ఇతర రాష్ట్రాల్లోనూ... 'భరోసా'ని పోలీసు అధికారులే పర్యవేక్షిస్తున్నా.. ఎక్కడా బాధితులకు పోలీస్ ఠాణాకు వచ్చామన్న భావన కలగకుండా... కార్పొరేటు కార్యాలయం తరహాలో కేంద్రాన్ని తీర్చిదిద్దారు. తెలంగాణలోని ప్రతిజిల్లాలో ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తామని హోంమంత్రి నాయిని నర్సింహారెడ్డి ప్రకటించారు. కేరళ, తమిళనాడు, ఒడిశా, మధ్యప్రదేశ్, రాజస్థాన్, మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాల అధికార బృందాలు ఈ కేంద్రాన్ని సందర్శించాయి. ఆయా రాష్ట్రాల్లోనూ ఏర్పాటుకు కసరత్తు జరుగుతోంది.



ఈ నెల 9న దిల్లీలో పురస్కారాన్ని అందుకొంటున్న స్వాతిలక్రా

సమస్యలు పరిష్కరిస్తూ.. ఉపాధి కల్పిస్తూ..

ఈ కేంద్రం ద్వారా యువతులు, మహిళల సమస్యలను పరిష్కరించడంతోపాటు.. వారిలో కొందరికి పునరావాసం కూడా కల్పిస్తున్నారు. జీహెచ్‌ఎంసీ, స్వచ్ఛంద సంస్థల సహకారంతో ప్రైవేటు సంస్థల్లో ఉద్యోగాలిప్పిస్తున్నారు. స్వయం ఉపాధిపై ఆసక్తి ఉన్న వారికి బ్యాంకుల ద్వారా రుణం సమకూరుస్తున్నప్రాఉ. ఇలా కొద్దినెలల వ్యవధిలోనే గృహహింస తాళలేక సొంతంగా జీవించేందుకు ముందుకు వచ్చిన 98 మంది మహిళలకు సాయం చేశారు. గృహిణులు, యువతుల జీవితాల్లో మార్పు తెస్తున్న వ్యక్తులు, సంస్థలను కేంద్ర సూక్ష్మ, మధ్యతరహా పరిశ్రమల మంత్రిత్వశాఖ, మహిళా ఔత్సాహిక పారిశ్రామికవేత్తల సంఘం గుర్తించి 'నారీ చేతన'పేరుతో పురస్కారాలను అందజేస్తోంది. ఈ ఏడాది తొలిసారిగా హైదరాబాద్ పోలీసులకు ఈ ప్రతిష్ఠాత్మక పురస్కారం దక్కింది. దక్షిణాది రాష్ట్రాల్లో 'భరోసా'కేంద్రం అత్యుత్తమ సేవలు అందించినందుకు ఈ అవార్డును ఇస్తున్నామని నిర్వాహకులు వివరించారు.

పర్యాటక రాణులు!

- సందర్శనీయ స్థలాల ఎంపికలో మహిళలే కీలకం
- వారి నిర్ణయాలకే కుటుంబ సభ్యుల ఓటు
- టాయ్ అధ్యయనంలో వెల్లడి



ఈనాడు, హైదరాబాద్

మహిళలు వంటింటికే పరిమితం అనేది ఒకప్పటి మాట.. ఇప్పుడు ఉద్యోగ, వ్యాపార రంగాల్లోనూ సత్తా చాటుతున్న విషయం తెలిసిందే. ఇవన్నీ ఒకెత్తైతే.. విహార యాత్రల్లోనూ వారి నిర్ణయాలే కీలకంగా ఉంటున్నాయని పర్యాటక పోకడలపై నగరాల్లో ట్రావెల్ ఏజెంట్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా(టీఏఏఐ-టాయ్) చేసిన తాజా సర్వేలో వెల్లడైంది.

బృందాలుగా వెళ్లేందుకు ఆసక్తి..



ఇంటి బాధ్యతల నిర్వహణలో ఎక్కువ ఒత్తిడిని.. తీరిక లేని జీవితాన్ని అనుభవించేది మహిళలే. ఉదయం లేచిన దగ్గర నుంచి.. రాత్రి నిద్రకు ఉపక్రమించే వరకు యాంత్రిక జీవితమే. ఇక సెలవులొస్తే మరింత ఇంటి పని.. పిల్లలకు, భర్తకు ఇష్టమైన వంటకాలు చేయడంలో బిజీబిజీగా ఉంటారు. ఉద్యోగాలు చేసే మహిళలైతే ఇక వారు ఎదుర్కొనే వృత్తిపరమైన, వ్యక్తిగత ఒత్తిళ్ల గురించి చెప్పాల్సిన పని లేదు. దంపతులిద్దరూ ఉద్యోగాలు చేసే కుటుంబాల్లో పిల్లలకు సెలవులొచ్చినా.. వారాంతపు సెలవుల్లో.. ఎక్కడకు వెళ్లాలి.. ఎంత బడ్జెట్ కేటాయించాలనే విషయాలన్నీ 80 శాతం మహిళలే నిర్ణయిస్తున్నారనేది సర్వే సారాంశం. కుటుంబాలతోనే కాదు.. వారూ బృందాలుగా పర్యటనలకు వెళ్లేందుకు ఆసక్తి చూపుతున్నారు.



చారిత్రక ప్రదేశాల సందర్శనలో మహిళల బృందం (పాతచిత్రం)

మహిళా క్లబ్బులు... నగరాల్లో మధ్యతరగతి మహిళల కిట్టీ పార్టీల గురించి ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. ప్రతి నెలా ఎవరో ఒకరి వంతుగా పార్టీ ఇస్తుంటారు. అలాగే లాభాపేక్ష లేకుండా.. లాటరీ పద్ధతిలో చిట్టీలు వేసుకుని .. వచ్చిన డబ్బులను విహార యాత్రలకు వినియోగిస్తున్నారు. మహిళలు బృందంగా ఏర్పడి.. సమీపంలోని పర్యాటక ప్రాంతాల సందర్శనకు వెళ్తున్నారు. ధనిక వర్గాల మహిళలైతే క్లబ్బులు ఏర్పాటు చేసుకొని.. టూర్ మేనేజర్ల ద్వారా దేశ, విదేశీ యాత్రల ప్రణాళికలను సిద్ధం చేసుకొంటున్నారని సర్వేలో తేలింది.

ప్రకృతి అందాలకే ప్రాధాన్యం

అందమైన ప్రాంతాల్లో ఫొటోలు దిగి.. వీడియోలు తీసి వాటిని పదిలపరచుకోవడంపై మహిళలు ఎంతో మక్కువ చూపుతున్నారు. కుటుంబ సమేతంగా వెళ్లిన యాత్రలను, అక్కడ పిల్లల ఆటపాటలను వీడియోలు తీసి డాక్యుమెంటరీగా రూపొందిస్తున్నారు. ప్రకృతి రమణీయత ఉట్టిపడే ప్రాంతాల సందర్శనకే మహిళలు అధిక ప్రాధాన్యం ఇస్తున్నారని టాయ్ ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల విభాగం ఛైర్మన్ అజయ్ కె. రామిడి చెప్పారు. వీటితో పాటు.. ఎప్పుడూ తాను చేసిన వంటకాలేనా.. బయట ఎలా చేస్తున్నారు. నోరూరించే రుచులు ఎక్కడ దొరుకుతున్నాయో తెలుసుకుని.. ఆహార ఉత్సవాలు ఎక్కడ జరిగితే అక్కడకు మహిళలు పరుగులు పెడుతున్నారని అధ్యయనంలో తేలిందన్నారు.

అనుభవాల వేదిక టాయ్..

1951లో దేశంలోని 12 మంది టూర్స్ అండ్ ట్రావెల్ ఏజెంట్స్‌తో ఏర్పడిన టాయ్ ఇప్పుడు 2500 మంది సభ్యుల సంస్థగా ఎదిగింది. ఎప్పటికప్పుడు పర్యాటక ప్రాంతాలను పరిచయం చేస్తూ.. ప్రదర్శనలు నిర్వహించడమే కాదు.. ఆయా యాత్రలు చేసిన వారి అనుభవాలనూ ఈ ప్రదర్శన సమయంలో అందరూ తెలుసుకునే విధంగా సదస్సులు నిర్వహిస్తోంది.

అలవాట్లు మారాలి.. ఆచరణ ఉండాలి..



ఈనాడు, హైదరాబాద్

ఐటీ కొలువులు.. రెండు పదుల వయస్సులోనే ఐదంకెల జీతం.. వారాంతాల్లో రెండు రోజులు సెలవులు.. విదేశాల్లో పనిచేసే అవకాశం.. ఇవన్నీ పైకి కన్పించేవైతే.. వేళాపాళా లేని పనివేళలు.. ఎప్పటికప్పుడు మారిపోయే బాధ్యతలకు తోడు..అంతర్గత లక్ష్యాలతో తీవ్ర ఒత్తిడి ఎదుర్కొంటున్నారు.. తట్టుకోలేక కొందరు చిత్తవుతున్నారు.. ఇది ఉత్పాదకతపై ప్రభావం చూపుతుండటంతో ఐటీ సంస్థలు తమ ఉద్యోగులకు ఎప్పటికప్పుడు ఆరోగ్యకర జీవనశైలిపై చైతన్యం కల్పిస్తున్నాయి.

నగరంలో దాదాపు నాలుగు లక్షల మంది ఐటీ, ఐటీ ఆధారిత సంస్థల్లో పనిచేస్తున్నారు. పెద్ద కంపెనీలే కాదు.. ఎన్నో చిన్న సంస్థలూ ఇక్కడ కొలువుదీరాయి. కళాశాల చదువులు ముగియగానే ప్రాంగణ నియామకాల్లో చాలా మంది కుర్రకారు ఉద్యోగాలు సాధిస్తున్నారు. పాతికేళ్ల లోపే తాము కోరుకున్న జీవితాన్ని అనుభవిస్తున్నారు. ఈ క్రమంలో మారిన జీవనశైలితో శారీరకంగా, మానసికంగా పలు సమస్యలు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా ఒత్తిడి నుంచి బయటపడేందుకు వారాంతాల్లో పార్టీలతో మొదలై మత్తు పదార్థాలు తీసుకునే వరకు పరిస్థితి వెళుతోందని ప్రచారం జరుగుతోంది. కొలువుపైనే కాదు.. ఇది కుటుంబ సంబంధాలపైనా తీవ్ర ప్రభావం చూపుతోంది. బయట ఆహారం ఎక్కువగా తినడం.. ఎప్పుడంటే అప్పుడు లాగిస్తుండటం.. ఇలా ఒకదానికి ఒకటితోడై ఉద్యోగుల శారీరక ఆరోగ్యాన్ని దెబ్బతీస్తున్నాయి. ఇలాంటి అలవాట్ల నుంచి మంచి జీవనశైలి దిశగా అడుగులు పడేలా బడా ఐటీ సంస్థలు ఫిట్‌నెస్‌పై పలు కార్యక్రమాలను చేపడుతున్నాయి.

- ఒత్తిడి.. ఆరోగ్య సమస్యల నుంచి బయట పడేందుకు మార్గమిదే
- ఉద్యోగులకు జీవన కళ అలవరుస్తున్న ఐటీ సంస్థలు

ఉద్యోగులు దారుఢ్యంగా ఉండేందుకు కార్యాలయాల్లోనే వ్యాయామ కేంద్రాల ఏర్పాటు, యోగా శిక్షణ తరగతులు నిర్వహించడం, వాకింగ్ ట్రాక్ నెలకొల్పడం, సైకిల్‌పై కార్యాలయానికి వచ్చేవారికి ప్రోత్సాహకాలు అందించడం వంటివి చేస్తున్నాయి. వారాంతాల్లో నడక, పరుగుల్లో సిబ్బంది పాల్గొనేలా చొరవ చూపుతున్నాయి. నడకను ప్రోత్సహించేందుకు రోజూ ఎన్ని అడుగులు వేశారో తెలుసుకునేందుకు పెడో మీటర్లను అందిస్తున్నాయి. ఎక్కువ దూరం నడిచిన వారికి నజరానాలను ప్రకటిస్తున్నాయి. వారంలో ఒకరోజు ప్రజారవాణాను వినియోగించేలా ప్రోత్సహిస్తున్నాయి.

ఫిట్‌నెస్ క్యాలండర్.. ఇలా ఒక్కో సంస్థ తమ ఉద్యోగులు జీవనశైలి సమస్యలను దీటుగా ఎదుర్కొనేలా చర్యలు చేపడుతున్నాయి. టీసీఎస్ తమ ఉద్యోగుల కోసం ఫిట్‌నెస్ క్యాలండర్‌ను రూపొందించింది. ఐటీ ఉద్యోగులే కాదు దాదాపు ప్రతి రంగంలోని వారు.. వయస్సుతో సంబంధం లేకుండా వేర్వేరు రూపాల్లో ఒత్తిడికి గురవుతున్నారు. దీన్ని సమర్థంగా ఎదుర్కొంటూ శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉండేందుకు క్యాలండర్‌లోని అంశాలు అందరూ తప్పక ఆచరించ తగ్గవే. వీటిలో చాలావరకు మనకు తెలిసినవే అయినా పాటించడంలో అలక్ష్యం ప్రదర్శిస్తుంటాం. ముఖ్యంగా మూడు పదులు దాటిన వారు కొన్ని అలవాట్లను మార్చుకోవడంతో పాటు.. మరికొన్నింటిని ఆచరణలోకి పెట్టాల్సిన తరుణం వచ్చేసింది.

1 ప్రతిరోజూ అరగంట వ్యాయామం తప్పనిసరి. నడక, పరుగు, జిమ్, యోగా.. ఇలా ఏదైనా కావొచ్చు. ఉదయాన్నే త్వరగా నిద్రలేచి వ్యాయామం చేస్తే రోజంతా ఉత్సాహంగా ఉంటుంది.



2 ఉదయం లేవగానే నీరు తాగాలి. చాలామంది అల్పాహారం తీసుకొనే వరకు నీళ్లు ముట్టుకోరు. నిత్యం 3 లీటర్లు తాగాలి. కేవలం నీళ్లే కాదు పండ్ల రసాలు, సూప్‌లు, ఆరోగ్యానికి మేలు చేసే ఇతర ద్రవాలు ఏవైనా తీసుకోవచ్చు.




3 ఆలస్యమైందని ఉదయం పూట పిల్లలు, పెద్దలు అల్పాహారం మానేసి పాఠశాల, కళాశాల, కార్యాలయాలకు వెళుతున్నారు. ఉదయం లేచాక ఎక్కువ సమయం ఖాళీ కడుపుతో ఉండటం మంచిది కాదని వైద్యులు సూచిస్తున్నారు.



4 ఉరుకులు పరుగుల నగర జీవనంలో కుటుంబ సభ్యులు కలిసి భోజనం చేయడం లేదు. రోజులో ఒక పూటైనా కలిసి భోంచేయాలి. దీంతో ఒకరితో ఒకరు మాట్లాడుకోవడానికి, బంధాల బలోపేతానికి దోహదం చేస్తాయి.



5 మన శరీరానికి కావాల్సిన విటమిన్లు, పోషకాల కోసం కాలానుగుణంగా దొరికే పండ్లను రోజుకు రెండు తినడం మేలు. ఆకలైనప్పుడు స్నాక్స్‌కు బదులు వీటిని తీసుకోవచ్చు.



6 రోజంతా ఉత్సాహంగా ఉండాలంటే తగినంత నిద్ర తప్పనిసరి. రోజులో కనీసం 7-8 గంటలు నిద్రపోవాలి. మరీ ఎక్కువైనా.. తక్కువైనా ఇబ్బందులు తప్పవు.



7 ఇంట్లో ఏసీ, కార్యాలయాల్లోనూ ఏసీ.. బయటికి రాగానే కార్లో ప్రయాణం.. కాసేపైనా ఎండలో, వెలుతురులో గడపడం లేదు. రోజులో తగినంత సేపు ఎండలో సహజ వెలుతురులో ఉండటం అవసరం.



8 పడుకునే సమయంలో కాఫీలు వంటివి తాగొద్దు. కెఫైన్, నికోటిన్ పదార్థాలు నిద్రను దూరం చేస్తాయి.



9 ఇంట్లో చేసుకునే తీరిక లేక కొందరు, నచ్చక కొందరు బయట ఆహారాన్ని ఎక్కువగా తింటున్నారు. ప్యాకేజ్డ్ ఆహారానికి ప్రాధాన్యమిస్తున్నారు. వీటికి దూరంగా ఉండాలి.



10 ఒత్తిడి నుంచి బయటపడేందుకు ఎక్కువగా కాఫీలు, టీలు తాగుతున్నారు. రోజూ ఏదైనా ఒకటి ఒకసారి మాత్రమే తాగడానికి పరిమితం కావాలి.



11 కడుపు నిండిందనే సంకేతాలు అందగానే తినడం ఆపేయాలి. రుచిగా ఉందని చాలాసార్లు ఎక్కువ తిని భుక్తాయాసంతో బాధపడుతుంటారు. ఆయాసమే కాదు.. అధిక క్యాలరీలతో బరువూ పెరుగుతారు.




12 పడుకునే సమయంలో మొబైల్ వంటి ఎలక్ట్రానిక్ గాడ్జెట్స్ దగ్గర ఉండకుండా చూసుకోవాలి. కొందరు పక్కనే పెట్టుకొంటారు. ఈ అలవాటు మంచిది కాదు.



13 క్రమంతప్పక వ్యాయామం చేస్తే సరి.. కుదరని వారు కార్యాలయాల్లో, నివాసాల్లో లిఫ్టులు కాకుండా మెట్లను ఉపయోగించాలి. ఇంట్లో చిన్నచిన్న పనులు చేయాలి.



14 రాత్రిపూట ఆలస్యంగా ఇంటికి చేరుకోవడం, నిండుగా తిని ఆ వెంటనే నిద్రకు ఉపక్రమిస్తున్నారు. పడుకోవడానికి కనీసం రెండు గంటల ముందు రాత్రి భోజనం ముగించాలి.



15 రుచిగా ఉంటాయని వేపుళ్లు ఎక్కువగా తింటున్నారు. ఈరోజు నుంచి వీటిని తిననని నియమం పెట్టుకొని పాటించాలి.



16 వేళాపాళా లేకుండా తినడం కూడా చాలారకాల ఆరోగ్య సమస్యలకు దారితీస్తుంది. ఎప్పుడో ఒకసారి మినహా రోజూ ఒకే సమయానికి తినేలా చూసుకోవాలి.



17 మనోవ్యాకులత(డిప్రెషన్)తో ఉంటే మౌనంగా ఉండకుండా.. ఎవరితోనైనా ఆలోచనలు పంచుకోవాలి. దీంతో మనసుకు కొంత ఊరట, ధైర్యం లభిస్తాయి.



18 ఆహారంలో తాజా కూరగాయలు ఉండేలా చూసుకోవాలి. కావాల్సిన ప్రొటీన్లు వీటి నుంచే సగం అందేలా తీసుకోవాలి. ఆకుకూరలకు ప్రాధాన్యం ఉండాలి. ఇష్టం లేదని తినని కూరగాయలను ఇప్పటినుంచైనా రోజుకొకటి తినే ప్రయత్నం చేయాలి.



19 సహజంగా దొరికే ఆహార పదార్థాలను ఎక్కువగా తినాలి. నిల్వ ఉండే వాటిని, మైదాతో తయారు చేసే వాటిని దూరం పెట్టాలి.







అతిథిగృహాలు.. అక్రమాలు

నేరాలకు చిరునామా.. ప్రైవేటు గెస్ట్‌హౌస్‌లు



ఈనాడు, హైదరాబాద్

దొంగతనాలు, దోపిడీలు, హత్యలు, నేరాలతోపాటు పోలీసులు ఇకపై ప్రైవేటు అతిథిగృహాలపై నిఘా సారించాల్సిన పరిస్థితులు ఉత్పన్నమయ్యాయి. నగరం, శివారు ప్రాంతాల్లోని ప్రైవేటు గెస్ట్‌హౌస్‌ల్లో కొన్ని మినహా మిగిలిన వాటి నిర్వాహకులు పోలీస్‌శాఖకు సమాచారం ఇవ్వకుండా వ్యాపార కార్యకలాపాలు నిర్వహిస్తున్నారు.

మాజీ మంత్రి ముఖేష్‌గౌడ్ కుమారుడు విక్రమ్‌గౌడ్ తనపై ఆత్మహత్యాయత్నానికి ప్రణాళికను ఓ ప్రైవేటు అతిథిగృహంలోనే సిద్ధం చేశాడు. పోలీసులు ముఖేష్‌గౌడ్‌తోపాటు నిందితులను అరెస్ట్ చేశాకే ఈ విషయం వెలుగులోకి వచ్చింది. దీంతో టాస్క్‌ఫోర్స్, శాంతిభద్రతల పోలీసులు సంయుక్తంగా ప్రైవేటు అతిథిగృహాలపై తనిఖీలు నిర్వహించారు. పదిహేడు అతిథిగృహాల్లో లోపాలు ఉండడంతో వాటి యజమానులపై పోలీసులు కేసులు నమోదు చేశారు. జీహెచ్ఎంసీ అధికారుల నుంచి ట్రేడ్ లైసెన్స్ పొందినా..ఇకపై పోలీసులకు సమాచారం ఇవ్వకుండా వ్యాపారాలు నిర్వహిస్తే సిటీ పోలీస్ చట్టం ప్రకారం చర్యలు చేపట్టనున్నట్లు పోలీస్ అధికారులు తెలిపారు.



పోలీసుల అనుమతి లేకుండా నిర్వహణ

అనుమతి తప్పని సరి..

ప్రైవేటు అతిథిగృహాల వ్యక్తులు.. సంస్థలు వ్యక్తిగతంగా లేదా సంస్థ అవసరాల కోసం వినియోగిస్తే భద్రత, ఇతర అంశాల దృష్ట్యా సంబంధింత పోలీసులకు సమాచారం తప్పనిసరిగా ఇవ్వాలి. ప్రైవేటు అతిథిగృహాలు, సర్వీస్ అపార్ట్‌మెంట్ల పేరుతో వ్యాపారం నిర్వహిస్తే మాత్రం పోలీసుల అనుమతి తీసుకోవాలి. ఇందులో ఎలాంటి మినహాయింపులు ఉండవు. వాణిజ్య పన్నులు, జీహెచ్ఎంసీ, విద్యుత్తు, జల మండలి నుంచి అనుమతి ఉన్నా.. సిటీ పోలీస్ చట్టం ప్రకారం తాము ఫలానా ప్రాంతంలో వ్యాపారం నిర్వహిస్తున్నామంటూ పోలీస్ ఠాణాలో సమాచారం ఇవ్వడంతోపాటు అనుమతి పత్రం పొందాలి. నగరంలో ప్రైవేటు అతిథిగృహాలతోపాటు, లాడ్జిలు, వసతిగృహాల యజమానులూ సిటీ పోలీసులకు సమాచారం ఇవ్వకుండా కార్యకలాపాలు నిర్వహిస్తున్నారు. బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, పంజాగుట్ట, ఎస్సార్ నగర పోలీస్‌ఠాణాల పరిధిలలో ప్రైవేటు అతిథిగృహాల్లో ఎవరు వస్తున్నారు? ఎవరు వెళ్తున్నారు? తదితర వివరాలను నిర్వాహకులు నమోదు చేయడం లేదు.

అనైతిక కార్యకలాపాలు

ప్రైవేటు అతిథి గృహాల్లో అనైతిక కార్యకలాపాలు, నేరాలకు పథక రచన చేసే రహస్య ప్రాంతాలుగా మారుతున్నాయి. కొందరు నిర్వాహకులు మద్యం సరఫరా చేయడంతోపాటు ఇతర రాష్ట్రాల నుంచి యువతులను తీసుకువచ్చి సెక్స్‌రాకెట్లను నిర్వహిస్తున్నారు. జూబ్లీహిల్స్, బంజారాహిల్స్ పోలీస్‌ఠాణాల పరిధిల్లోనే వందకు పైగా ప్రైవేటు అతిథిగృహాలున్నాయి. వీటిలో సింహభాగం అతిథిగృహాలు నిబంధనలు పాటించకుండా అనైతిక కార్యకలాపాలను ప్రోత్సహిస్తున్నాయి. కొన్ని ప్రైవేటు అతిథిగృహాలు కేవలం పేకాట కోసమే ఉన్నాయి. రోజుకు రూ.లక్షల్లోనే ఆటలు కొనసాగుతున్నాయి. ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, తెలంగాణ జిల్లాలకు చెందిన పేకాటరాయుళ్లు ఇక్కడికి వస్తున్నారు. పోలీసులకు సమాచారం అందినప్పుడు మాత్రమే వాటిపై దాడులు నిర్వహిస్తున్నారు. ఇంతేకాదు.. హత్యలు, దోపిడీలకు పథక రచన ఇక్కడే చేస్తున్నారు. గతేడాది నవంబరు నెలలో పెద్దనోట్లను రద్దు చేసినప్పుడు పాతనోట్లున్న నేరగాళ్లు ప్రైవేటు అతిథిగృహాల్లోనే మకాం వేశారు. గతంలో మద్దెలచెరువు సూరి, మొద్దుశ్రీను అనుచరులు ప్రైవేటు అతిథిగృహాల్లోనే ఉండగా... ప్రస్తుతం అంతర్ రాష్ట్ర ముఠాల సభ్యులు, గ్యాంగ్‌స్టర్‌ల అనుచరులుంటున్నారని పోలీస్ దాడుల్లో వెలుగులోకి వచ్చాయి.

నిబంధనలు పాటించడం లేదు

– శ్రీనివాస్, ఇన్‌స్పెక్టర్ బంజారాహిల్స్

ప్రైవేటు అతిథిగృహాల నిర్వాహకులు, యజమానులు నిబంధనలు పాటించడం లేదు. నేరగాళ్ల కార్యకలాపాలకు అడ్డాలుగా మారుతున్నాయన్న సమాచారంతో తనిఖీలు నిర్వహించగా... 90 శాతం మంది యజమానులు, ప్రతినిధులు నిబంధనలు పాటించడం లేదని గుర్తించాం. వీరిలో చాలామంది రికార్డులను సక్రమంగా నిర్వహించడం లేదు. సీసీ కెమెరాలు లేవు. అతిథి గృహాల్లో ఒక్కరోజున్నా సరే... వారి వివరాలను నమోదు చేసుకోవాలి. ఆధార్ కార్డు లేదా ఇతర గుర్తింపు కార్డుల నకళ్లు ఉంచుకోవాలి. ముంబయి, దిల్లీ నగరాల్లో ప్రైవేటు అతిథిగృహాల నిర్వాహకులు నిబంధనలు తూచా తప్పకుండా పాటిస్తారు. నిర్వాహకులు స్పందించకపోతే తనిఖీలు చేసి కేసులు నమోదు చేస్తాం.

ప్రభుత్వ సిబ్బందితో సమానంగా వేతనాలివ్వాలి

తెలంగాణ సర్వశిక్షా అభియాన్ ఒప్పంద సిబ్బంది వినతి



డీఈఓ రమేష్‌కు వినతి పత్రం అందజేస్తున్న జాక్ నాయకులు

చంచల్‌గూడ, న్యూస్‌టుడే: సర్వశిక్షా అభియాన్ పరిధిలో పనిచేస్తున్న ఒప్పంద సిబ్బందిని ప్రభుత్వ సిబ్బందిగా పరిగణించి వారితో సమానంగా వేతనాలను, ఇతర సౌకర్యాలు కల్పించాలని తెలంగాణా సర్వ శిక్షా అభియాన్ ఒప్పంద సిబ్బంది హైదరాబాద్ జిల్లా విద్యాశాఖ అధికారి రమేష్‌కు వినతి పత్రం అందజేశారు. తెలంగాణ సర్వశిక్షా అభియాన్ పరిధిలో ఆయా జిల్లాల్లో, రాష్ట్రంలోని వివిధ విభాగాల్లో విధులు నిర్వహిస్తున్న సీఆర్‌పీలు, ఐఈఆర్‌పీలు, డీఎల్ఎంటీలు కలిసి జాక్ (జాయింట్ యాక్షన్ కమిటీ)గా ఏర్పడి విద్యాశాఖ అధికారి రమేష్‌ను బుధవారం కలిశారు. ఈ సందర్భంగా వారు వినతి పత్రం ద్వారా సమస్యను విన్నవిస్తూ.. ఐదేళ్లుగా ప్రభుత్వ సిబ్బంది మాదరిగానే తామంతా విధులు నిర్వహిస్తున్నా వేతనాల్లో, సౌకర్యాల్లో, సెలవులు తదితరాల్లో ప్రభుత్వ ఉద్యోగులకున్న సౌకర్యాలేవీ లేక ఇబ్బంది పడుతున్నామన్నారు. తమను ప్రభుత్వ సిబ్బందిగా గుర్తించి ఫించను, పీఎఫ్, మహిళా సిబ్బందికి ప్రసూతి సెలవులు వర్తింప చేయాలని జాక్ కన్వీనర్ వెంకన్న కోరారు.

ఏ హక్కుతో జెండా ఎగరేశారు?

కార్పొరేటరు భర్తపై డీసీకి ఫిర్యాదు

ఉప్పల్, న్యూస్‌టుడే: భార్య పదవిని అడ్డుగా పెట్టుకొని అధికార దుర్వినియోగానికి పాల్పడ్డ కార్పొరేటరు భర్తపై చర్యలు తీసుకోవాలని ఉప్పల్ సర్కిల్ ఉపకమిషనరుకు స్థానికుడు రెవెల్లి రాజు ఫిర్యాదు చేశారు. మంగళవారం ఉప్పల్ భరత్‌నగర్‌లోని బురుజుపైన ఉప్పల్ కార్పొరేటరు భర్త మేకల హనుమంతరెడ్డి జాతీయ జెండాను ఎగురవేసినట్టు బుధవారం ఫిర్యాదు చేశారు. పురాతనమైన బురుజును గత ఏడాదినే జీహెచ్ఎంసీ నిధులతో పూర్తిస్థాయిలో మరమ్మతులు చేయించినట్టు తెలిపారు. స్వాతంత్ర్య దినోత్సవంరోజు బురుజుపైన జాతీయ జెండాను మున్సిపల్ అధికారులు లేదా ప్రజాప్రతినిధులు ఎగురవేయాల్సి ఉండగా ఏ అధికారం లేని కార్పొరేటరు భర్త ఎగురవేయడంపై చర్యలు తీసుకోవాలని వినతిపత్రం ఇచ్చారు. హనుమంతరెడ్డి జాతీయ జెండాను ఎగురవేసిన ఫొటోలను కూడా డీసీ డా.యాదగిరిరావుకు సమర్పించారు. పూర్తిస్థాయిలో విచారణ జరిపి తగు చర్యలు తీసుకోనున్నట్టు డీసీ తెలిపారు.



వైభవోపేతం.. నాట్య మహోత్సవం

రవీంద్రభారతి: పద కవితా పితామహుడు తాళ్లపాక అన్నమాచార్యుల జయంతిని పురస్కరించుకొని బుధవారం రవీంద్రభారతి ప్రధాన మందిరంలో 'సంకీర్తనా నాట్య మహోత్సవం' నిర్వహించారు. సప్తగిరి సంకీర్తన గోష్ఠిగానం ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేసింది. అఖిల భారత కూచిపూడి నాట్యకళామండలి ఆధ్వర్యంలో ప్రముఖ నాట్యగురువులు తమ శిష్యులతో సప్తగిరీషుడికి నృత్యాంజలి ఘటించారు. జ్వాలాముఖి శిష్యబృందం 'ఆంజనేయ హనుమంత'.., కె.రాధిక శిష్యులు 'ఆడరో.. పాడరో', రమణి సిద్ధి శిష్యబృందం 'ఆ రూపముకే హరి' వంటి అన్నమాచార్య విరచిత సంకీర్తనల్లో భావాలను అభినయకౌశలంతో ఆవిష్కరించారు. పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం పూర్వ ఉపాధ్యక్షులు డా.ఆవుల మంజులత మాట్లాడుతూ.. అన్నమాచార్య సంకీర్తనలను ఈతరానికి పరిచయం చేయడానికి పుస్తకాలతో కాకుండా కొత్త పద్ధతుల్లో ప్రయత్నం జరగాలన్నారు. అఖిల భారత కూచిపూడి నాట్యకళామండలి వ్యవస్థాపక కార్యదర్శి పసుమర్తి కేశవప్రసాద్ కార్యక్రమానికి సమన్వయకర్తగా వ్యవహరించారు.



నీరుగారుతున్న నాణ్యత



కూకట్‌పల్లి జేఎన్‌టీయూ యూనివర్సిటీలో వసతిగృహాన్ని ఇటీవల మంత్రి కడియం శ్రీహరి ప్రారంభించారు. విద్యార్థులు రాకముందే ఇలా పెచ్చులూడుతూ వర్షానికి గోడల నుంచి నీరు కారుతోంది. నాణ్యత ప్రమాణాలు పాటించకపోవడం వల్లే ఇలా జరుగుతోంది. మరమ్మతులు చేయకుంటే విద్యార్థులకు ప్రమాదం పొంచి ఉంది.

నగరంలో ఏడాదిలో లక్ష ఇళ్లు పూర్తి

కుత్బుల్లాపూర్ పర్యటనలో మంత్రి కేటీఆర్



అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న కేటీఆర్

దుండిగల్, పేట్‌బషీరాబాద్, షాపూర్‌నగర్, న్యూస్‌టుడే: రాష్ట్రంలో అర్హులందరికీ ఇళ్లు నిర్మించేంత వరకు రెండు పడక గదుల ఇళ్ల నిర్మాణ ప్రక్రియ కొనసాగుతుందని మంత్రి కేటీఆర్ అన్నారు. నగరంలో చేపట్టనున్న లక్ష రెండు పడక గదుల ఇళ్లను ఏడాదిలో పూర్తి చేస్తామన్నారు. బుధవారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని కొంపల్లి, డి.పోచంపల్లి, షాపూర్‌నగర్‌లలో చేపట్టిన పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్న ఆయన మూడు చోట్లా ప్రసంగించారు. కార్వాన్‌లో ఒకే ప్రాంతంలో 1200 ఇళ్లను ఖాళీ చేయడానికి స్థానికులు సహకరించారని వారికి సకాలంలో ఇళ్లను నిర్మించి ఇస్తామన్నారు. నగరంలో కొందరు సహకరించకపోవడం వల్ల శివారు ప్రాంతమైన డి.పోచంపల్లి, బౌరంపేటలలో రెండు పడక గదుల ఇళ్లను నిర్మించాల్సి వచ్చిందన్నారు. గతంలో కేటాయించిన అసైన్డ్ భూములను తిరిగి స్వాధీనం చేసుకొని ఇళ్లను నిర్మించే పరిస్థితి నెలకొందన్నారు. ఈ నేపథ్యంలోనే బౌరంపేటలో అసైన్డ్ భూముల్లో నిర్మాణాలు చేపట్టామన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఉభయతారకంగా సమస్యను పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ఎంవీ.రెడ్డికి సూచించారు. నియోజకవర్గంలో 58, 59 జీవోల ద్వారా ఇప్పటివరకు 25 వేల వరకు పట్టాలను పంపిణీ చేశామని, మరికొన్ని దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని ఎంపీ మల్లారెడ్డి ఈసందర్భంగా మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. సూరారం, జీడిమెట్ల ప్రాంతాలలో కార్మికులు, నిరుపేదలు అధికంగా ఉన్న దృష్ట్యా మరికొంతమందికి పట్టాలు పంపిణీ జరిగేలా కలెక్టర్ పరిశీలన చేయాలన్నారు. షాపూర్‌నగర్‌లో రిజర్వాయర్ ప్రారంభోత్సవంలో పాల్గొన్న జలమండలి ఎండీ దానకిషోర్ మాట్లాడుతూ... కుత్బుల్లాపూర్‌లో రూ.220 కోట్ల వ్యయంతో చేపట్టిన 6 రిజర్వాయర్లలో షాపూర్‌నగర్‌లోని రిజర్వాయర్ పూర్తికాగా మరో ఐదు 90 శాతం మేర పూర్తయ్యాయని రెండు నెలల్లో అన్నీ పూర్తవుతాయన్నారు. వర్షాకాలంలో పైపులైన్లు ఏర్పాటు చేయొద్దని జీహెచ్‌ఎంసీ సూచించడంతో రెండు నెలలుగా పనులు నిలిచిపోయాయన్నారు. నగరంలో మొత్తం 58 రిజర్వాయర్లకు గాను 20 రిజర్వాయర్ల నిర్మాణం పూర్తయిందని, 38 నిర్మాణం దశలో ఉన్నాయని తెలిపారు. మిషన్ భగీరథ పనులు డిసెంబరు 2018 వరకు పూర్తిచేయాల్సి ఉందని అయితే డిసెంబరు 2017 లోగానే పూర్తిచేసి నగరంలోని 35 లక్షల జనాభాకు మంచినీరు అందిస్తామన్నారు.

అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించిన కేటీఆర్

కొంపల్లిలో జాతీయ రహదారిపై సర్పంచి జెమ్మి నాగమణి నెలకొల్పిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని రాష్ట్ర మంత్రులు కేటీఆర్, పి.మహేందర్‌రెడ్డిలు బుధవారం ఆవిష్కరించారు. విగ్రహానికి పూలమాలలు వేశారు. కార్యక్రమంలో నగర మేయర్ బొంతు రామ్మోహన్, ఎంపీలు మల్లారెడ్డి, బూర నర్సయ్యగౌడ్, ఎమ్మెల్సీలు శంభీపూర్‌రాజు, పి.నరేందర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు కె.పి.వివేకానంద్, సుధీర్‌రెడ్డి, తీగల కృష్ణారెడ్డి, సర్పంచి జెమ్మి నాగమణి దేవేందర్, ఎంపీపీ సన్న కవిత, పలువురు ఎస్సీ సంఘాల నేతలు పాల్గొన్నారు.



కొంపల్లి సభకు హాజరైన జనం



మలేరియా వార్డులో రక్తనమూనాలు తీసుకుంటున్న సిబ్బంది

ఫీవరాసుపత్రికి రోగుల తాకిడి

నల్లకుంట, న్యూస్‌టుడే: వాతావరణంలో వచ్చిన మార్పులు.. ఇటీవల కురిసిన వర్షాలకు ప్రజలు జ్వరాల బారిన పడుతున్నారు. రోగులు ఆసుపత్రుల బాట పడుతున్నారు. నల్లకుంటలోని ఫీవరాసుపత్రికి రోగుల తాకిడి పెరిగింది. గత నాలుగు రోజుల సెలవుల్లో అంతంత మాత్రంగా ఉన్న రోగుల సంఖ్య బుధవారం ఒక్కసారిగా పెరిగింది. దీంతో రోగులతో ఆసుపత్రి కిటకిటలాడింది. వీరిలో జ్వరాలు, వాంతులు, విరేచనాలు, జలుబు, గొంతునొప్పి, దగ్గు తదితర సమస్యలతోపాటు డెంగీ, మలేరియా లక్షణాలున్న రోగులు ఉన్నారు. ఈనెల 14న 970 మంది రోగులు ఓపీలో పరీక్షించుకోగా, 15న 456 మంది పరీక్షించుకుని వైద్య సేవలు పొందారు. బుధవారం 1200 మంది రోగులు ఔట్‌పేషెంట్ విభాగంలో చికిత్స పొందారు. వీరిలో 35 మంది ఆరోగ్య పరిస్థితి క్షీణించడంతో ఇన్‌పేషెంట్‌గా చేర్చుకొని వైద్యం అందిస్తున్నారు. జ్వరం తగ్గని 145 మంది పాతరోగులు కూడా మళ్లీ వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ఆసుపత్రికి వచ్చిన వారిలో మలేరియా వ్యాధి లక్షణాలున్న 161 మంది నుంచి రక్తనమూనాలు సేకరించారు. వారికి మలేరియా పరీక్షలు నిర్వహించారు.

డెంగీ కేసులు... : కొన్ని రోజులుగా ఆసుపత్రికి వస్తున్న వారిలో డెంగీ లక్షణాలు కన్పిస్తున్నాయి. అనుమానిత రోగులందరికీ డెంగీ పరీక్షలు నిర్వహిస్తున్నారు. గత నెలలో రోగుల నుంచి సేకరించిన నమూనాల ప్రకారం 12 మందికి డెంగీ సోకినట్లు ఈనెల 8న వైద్యులు నిర్ధారించారు. డెంగీ రోగుల్లో బషీర్‌బాగ్, జీరా, జీడిమెట్ల, ఐడీపీఎల్, అంబర్‌పేట, ఉప్పల్, మంగళ్‌హాట్, బడంగ్‌పేట, దిల్‌సుఖ్‌నగర్, మలక్‌పేట, ఉప్పుగూడ, జగద్గిరిగుట్ట ప్రాంతాలకు చెందిన వారు ఉన్నారు.

స్వచ్ఛ భారత్‌ను విజయవంతం చేయాలి

కేంద్ర మంత్రి బండారు దత్తాత్రేయ




రైల్వే ఆవరణను శుభ్రం చేస్తున్న దత్తాత్రేయ, కిషన్‌రెడ్డి, వినోద్‌కుమార్‌యాదవ్ తదితరులు

కాచిగూడ, న్యూస్‌టుడే: పార్టీలకు అతీతంగా స్వచ్ఛ భారత్‌ను విజయవంతం చేయాలని కేంద్ర మంత్రి బండారు దత్తాత్రేయ కోరారు. బుధవారం కాచిగూడ రైల్వే స్టేషన్‌లో దక్షిణ మధ్య రైల్వే హైదరాబాద్ డివిజన్ ఆధ్వర్యంలో చేపట్టిన స్వచ్ఛ భారత్ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, కార్పొరేటర్లు తమ తమ ప్రాంతాల్లో పరిసరాల పారిశుద్ధ్యంలో భాగస్వాములు కావాలని కోరారు. పారిశుద్ధ్యంపై ముఖ్యమంత్రి కేసీఆర్ ఎంపీలు, ఎమ్మెల్యేలతో సమావేశాన్ని నిర్వహించారని, తర్వాత ఏమైందో తెలియదన్నారు. జీహెచ్‌ఎంసీ పరిధిలో చాలా చోట్ల చెత్త పేరుకుపోయి దుర్గంధం వెలువడుతోందన్నారు. నగరంలో వేస్ట్‌మేనేజ్‌మెంట్ కార్యక్రమాన్ని చేపట్టి రహదారుల పరిశుభ్రతకు పెద్దపీట వేయాలని సూచించారు. రైల్వేలో పారిశుద్ధ్యానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నారని అన్నారు. రైల్వే స్టేషన్లు, ప్లాట్‌ఫారాలు, పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా ప్రయాణికులు సహకరించాలని కోరారు. దక్షిణ మధ్య రైల్వే జీఎం వినోద్‌కుమార్‌యాదవ్ మాట్లాడుతూ... రైల్వే హైదరాబాద్ డివిజన్ పరిధిలో ఈ నెల 16 నుంచి 31 వరకు స్వచ్ఛ భారత్ కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. పారిశుద్ధ్య లోపాలను సవరించుకుని ముందుకెళతామన్నారు. కార్యక్రమంలో భాజపా శాసనసభాపక్ష నేత, ఎమ్మెల్యే జి.కిషన్‌రెడ్డి, డీఆర్‌ఎం అరుణ్‌కుమార్ జైన్ తదితరులు పాల్గొన్నారు.

తెరాసతోనే గీత కార్మికులకు న్యాయం జరిగింది: మంత్రి పద్మారావు

సికింద్రాబాద్, న్యూస్‌టుడే: తెరాస ప్రభుత్వంతోనే గీత కార్మికులకు, గౌడ కులస్థులకు న్యాయం జరిగిందని ఆబ్కారీమంత్రి టి.పద్మారావు అన్నారు. తెరాస అధికారంలోకి వచ్చిన వెంటనే సీఎం కేసీఆర్..గీత కార్మికులు పడుతున్న ఇబ్బందులను గుర్తించి నగరంలో కల్లుదుకాణాలను తెరిపించి వేలాదిమందికి ఉపాధి కల్పించారని పేర్కొన్నారు. మంగళవారం చిలకలగూడ రైల్వే కల్యాణ మండపంలో నియోజకవర్గ గౌడసంఘం ఆధ్వర్యంలో గౌడశంఖారావం సభ జరిగింది. ఈ సభలో మంత్రి పద్మారావు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ కార్మికుడికి పరిహారాన్ని రూ.2 లక్షల నుంచి రూ.5 లక్షలు, శాశ్వత అంగవైకల్యం పొందినవారికి రూ.50 వేల నుంచి రూ.5 లక్షల వరకు పెంచామన్నారు. తాటిచెట్టుపైకి సులభంగా ఎక్కేందుకు ప్రత్యేక యంత్రాలను అందుబాటులోకి తీసుకొస్తున్నామని, వాటిని ఉచితంగా పంపిణీచేస్తామని తెలిపారు. ఈ ఏడాది సుమారు 2కోట్ల తాటి, ఈత మొక్కలను రాష్ట్ర వ్యాప్తంగా నాటామని తెలిపారు.



సభలో మాట్లాడుతున్న మంత్రి పద్మారావు



బోనాలతో అమ్మవారి ఆలయానికి తరలి వస్తున్న మహిళలు

అమ్మా కరుణించు... వానలు కురిపించు

కోట మైసమ్మ ఆలయంలో బోనాలు

మహేశ్వరం: రైతుల కొంగు బంగారంగా ప్రసిద్ధిగాంచిన కోట మైసమ్మ అమ్మవారి ఆలయంలో బుధవారం బోనాల ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. వర్షాలు పుష్కలంగా కురిపించి, కరవు కాటకాల నుంచి ఈ ప్రాంతాన్ని రక్షించాలంటూ భక్తులు కోరుకున్నారు. అక్కన్న, మాదన్నల కోటలో .. బ్యాండు, డప్పు వాయిద్యాలతో సంప్రదాయ దుస్తులు ధరించిన మహిళలు, యువతులు సుందరంగా అలంకరించిన బోనాల్ని నెత్తిన పెట్టుకుని ఊరేగింపుగా వచ్చి అమ్మవారి ఆలయంలో సమర్పించారు. అమ్మవారిని మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, తెరాస నాయకుడు కొత్త మనోహర్‌రెడ్డి దర్శించుకున్నారు. సర్పంచి ఆనందం, ఉప సర్పంచి రాములు, వివిధ పార్టీల నేతలు, వేలాదిగా ప్రజలు పాల్గొన్నారు.



వేడుకలకు హాజరైన మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి



దక్షిణ కొరియా, మంగోలియాలో ఈనెలలో జరిగే బాడీ బిల్డింగ్ ఛాంపియన్ పోటీలకు ఎంపికైన మహమ్మద్ అన్వర్‌ను బుధవారం రామంతాపూర్‌లోని సంతోష్ జిమ్ ఆధ్వర్యంలో అభినందిస్తున్న సభ్యులు, తదితరులు.

మీ బండిచ్చారా... మీదే బాధ్యత!



● పోలీసు తనిఖీల్లో పట్టుబడితే కేసులు, జైలు

● పిల్లలు, పనివారికిచ్చినా చూసుకోవాల్సిందే..

ఈనాడు, హైదరాబాద్

రాజధాని రహదారులపై భద్రతను పెంచేందుకు ట్రాఫిక్ పోలీసులు కొత్త అస్త్రాలను తెరపైకి తీసుకువస్తున్నారు. శిరస్త్రాణం లేకుండా వాహనం నడపడం.. రాంగ్‌సైడ్ పార్కింగ్.. ట్రిపుల్‌రైడింగ్.. డ్రంకెన్‌డ్రైవ్‌లపై దృష్టిపెట్టడం ద్వారా ప్రమాదాలను నియంత్రించేందుకు చర్యలు తీసుకుంటున్న పోలీస్ ఉన్నతాధికారులు ఇప్పుడు వాహన యజమానులపై దృష్టి కేంద్రీకరించారు. బైకులు, కార్లు, ఇతర వాహనాలున్న యజమానులు వారి వాహనాలను డ్రైవింగ్ లైసెన్స్ లేనివారికి ఇస్తే కేసులు నమోదుచేస్తున్నారు. వాహనం నడిపినవారు యజమానుల పిల్లలైనా.. పనివారైనా.. బంధువులైనా సరే.. మోటార్ వాహనచట్టం ప్రకారం చర్యలు చేపడుతున్నారు. జూబ్లీహిల్స్, బంజారాహిల్స్ ప్రాంతాల్లో బైకులు, కార్ల రేసులను నియంత్రించేందుకు, ప్రధాన ప్రాంతాల్లో ప్రమాదాలను తగ్గించేందుకు ఇలా వాహన బాధ్యతను తెరపైకి తీసుకువచ్చారు. భవిష్యత్తులో ఈ నేరాలకు రహదారి భద్రత చట్టం కింద పాయింట్లను కూడా నమోదు చేయనున్నామని పోలీస్ ఉన్నతాధికారులు చెప్పారు.

దొరుకుతున్నారు.. తప్పించుకుంటున్నారు..

వాహనచోదక అనుమతి పత్రాలు లేకుండా దొరుకుతున్న వాహనచోదకులను.. ఈ వాహనాలు ఎక్కడినుంచి వస్తున్నాయని పోలీసులు ఆరా తీయగా.. స్నేహితులు, బంధువులు వాహనాలతో పాటు తల్లిదండ్రుల పేరిట ఉన్న వాహనాలను తీసుకొస్తున్నారని తెలిసింది. లైసెన్స్ లేకుండా వాహనాలను తీసుకురావడంతో పాటు స్నేహితులతో కలిసి పోటీలు పెట్టుకుంటున్నారు. నెక్లెస్‌రోడ్, బంజారాహిల్స్, మాదాపూర్, జూబ్లీహిల్స్‌లో ఇవి నిత్యం జరుగుతున్నాయి. పోలీసులు నిఘా ఉంచినప్పుడు మాత్రం మైనర్లు, డ్రైవింగ్‌లైసెన్స్ లేని యువకులు పోలీసులకు దొరుకుతున్నారు. వీరిని అదుపులోకి తీసుకున్న పోలీసులు తల్లిదండ్రులను పిలిపించి మరోసారి వాహనాలను ఇవ్వబోం.. అంటూ హామీ ఇప్పించుకున్న తర్వాతే విడిచిపెడుతున్నారు. పోలీసులకు ఇతర పనులు, కేసులుండటంతో కొద్దినెలలుగా మైనర్లు, డ్రైవింగ్ లైసెన్స్ లేనివారు రహదారులపై వాహనాలు నడపడం, ప్రమాదాలు చేయడంవంటి ఘటనలు పెరుగుతున్నాయి. దీంతో ట్రాఫిక్ పోలీస్ ఉన్నతాధికారులు స్పందించి ప్రత్యేకడ్రైవ్‌లు నిర్వహించాల్సిందిగా క్షేత్రస్థాయి పోలీసులను ఆదేశించారు. వారు ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహించినప్పుడు యువకులు, విద్యార్థులు పట్టుబడుతున్నా.. రహదారులపై ప్రయాణించేప్పుడు పోలీసులను చూసి గల్లీలోకి మళ్లించి పారిపోతున్నారు. ఇలా పారిపోయే క్రమంలో ప్రమాదాల బారిన పడుతున్నారు.



న్యాయస్థానాల్లో అభియోగ పత్రాలు..

నగరంలోని ప్రధాన ప్రాంతాలు, ట్రాఫిక్ రద్దీ ఎక్కువగా ఉండే ఆబిడ్స్, కోఠీ, నారాయణగూడ, హిమాయత్‌నగర్, ఆర్టీసీ క్రాస్‌రోడ్స్, అమీర్‌పేట, ఎస్సార్‌నగర్‌లలో కొందరు వాహన యజమానులు తమ వాహనాలను ఇతరులకు ఇస్తున్నట్టు పోలీసులు గుర్తించారు. మోటార్ వాహన చట్టం ప్రకారం వాహన యజమానులు ఎవరికీ నడిపేందుకు వాహనాలు ఇవ్వకూడదు. పోలీసులు కౌన్సిలింగ్ నిర్వహించినా, అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నా. . మైనర్, డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపే వారి సంఖ్య క్రమంగా పెరుగుతుండటంతో పోలీసులు చట్టప్రకారం చర్యలు తీసుకుంటున్నారు. వాహనం నడిపినవారితో పాటు యజమానులపై కేసులు నమోదుచేస్తున్నారు. ఒకేసారి ఇద్దరికీ జరిమానా విధించేందుకు ప్రత్యేక పరికరాలను వినియోగిస్తున్నారు. ఇక కేసులు నమోదుచేసిన అనంతరం న్యాయస్థానాల్లో వాహన యజమానులపై అభియోగపత్రాలను సమర్పిస్తున్నారు. రెండుకన్నా ఎక్కుసార్లు వాహనాలను తెలిసిన వారికిచ్చి పంపించిన వాహన యజమానులపై కఠినంగా చర్యలు తీసుకోవాలంటూ న్యాయస్థానానికి నివేదిస్తున్నారు. గతేడాది అక్టోబరునుంచి ఈ విధానాన్ని ఆరంభించారు. మొదట్లో వాహన యజమానులకు, చోదకులకున్న సంబంధాలను పరిశీలించి రక్త సంబంధీకులైతే వాహన యజమానులను హెచ్చరించేవారు. ప్రమాదాల పరంపర పెరుగుతుండడంతో కొడుకులు, కూతళ్లకు వాహనాలు ఇచ్చినా తండ్రులపై కేసులు నమోదుచేస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం రహదారి భద్రతకు సంబంధించిన కఠినంగా వ్యవహరించాలంటూ ఆదేశాలు జారీ చేయడంతో వాటిని తాము పాటిస్తున్నామని డీసీపీ(ట్రాఫిక్) ఎ.వి. రంగనాథ్ తెలిపారు. వాహన యజమానులు ఎవరికీ వాహనాలు ఇవ్వకుండా ఉంటే ఇలాంటి కేసుల ప్రసక్తే ఉండదని ఆయన చెప్పారు.

ఏడు నెలల్లో ఇలా... (2017)	వాహన యజమానులపై కేసులు	జనవరి	ఫిబ్రవరి	మార్చి	ఏప్రిల్	మే	జూన్	జులై	మొత్తం
		913	1026	1182	697	839	541	1136	6334

ముసుగు దొంగలు... మూడోసారి వచ్చారు

● శంషాబాద్ తహసీల్దార్ కార్యాలయంలో చొరబాటు

● డబ్బుకోసమా... మరింకేదైనా కారణమా?



సీసీ కెమెరాల ఫుటేజీలో కనిపిస్తున్న దొంగలు

శంషాబాద్ గ్రామీణ: శంషాబాద్ తహసీల్దార్ కార్యాలయంలో మరోసారి దొంగలు చొరబడటంతో బుధవారం కలకలం రేగింది. ఎరుపు రంగు తువ్వాళ్లతో ముసుగులు ధరించిన ఇద్దరు తెల్లవారుజామున కార్యాలయం వెనుక ద్వారం తలుపులను విరగ్గొట్టారు. లోపలికి ప్రవేశిస్తూనే తహసీల్దార్ ఛాంబర్‌పై ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను పసిగట్టారు. వాటిపై తలుపునకు ఉన్న కర్టెన్‌తో కప్పేశారు. తర్వాత గునపంతో ఛాంబర్ తాళాలను ధ్వంసం చేశారు. లోపలికి వెళ్లి వెతుకులాడారు. టేబుళ్ల తాళాలను పగుల గొట్టారు. నగదు, నగలు దొరక్క పోవడంతో తిరుగుముఖం పట్టారు. రెవెన్యూ కార్యాలయం సిబ్బంది ఉదయం వచ్చి చూసేసరికి తలుపుల తాళాలు ధ్వంసం అయి ఉండటం కనిపించింది. వారు తహసీల్దార్‌కు సమాచారం అందించారు. ఈ ఉదంతంపై పోలీసులకు ఫిర్యాదు చేయడంతో క్లూస్ టీం, ఆర్జీఐఏ క్రైం పోలీసులు వచ్చి ఆనవాళ్లు సేకరించారు. కార్యాలయంలోని సీసీ కెమెరాలో దొంగల చిత్రాలు స్పష్టంగా నిక్షిప్తమయ్యాయి. పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. ఎంతో విలువైన, ప్రాధాన్యం ఉన్న దస్త్రాలుండే తహసీల్దార్ కార్యాలయ భద్రత డొల్ల అని ఈ ఉదంతం బహిర్గతం చేసింది. దొంగలు డబ్బుకోసమేనా? మరింకేదైనా కారణంతో వస్తున్నారా? అని అనుమానాలు తలెత్తుతున్నాయి.



పొగ బస్సు

సాంకేతిక లోపంతో ఈ ఆర్టీసీ బస్సు పొగను వెలువరిస్తుండడంతో ఇతర వాహన చోదకులకు ఇబ్బందిగా మారింది. దీంతో బస్సును నల్లకుంటలో నిలిపివేశారు

వ్యవసాయ సమగ్ర సర్వే గడువులోగా కష్టమే

ఈనాడు–హైదరాబాద్

వ్యవసాయ భూముల సమగ్ర వివరాలు సేకరించాలని ప్రభుత్వం నిర్ణయించిన నేపథ్యంలో ఈ సర్వే గడువులోగా పూర్తి కావడం కష్టమే అన్న అభిప్రాయం బలంగా వినిపిస్తోంది. నగర శివారులు సహా రంగారెడ్డి జిల్లా పరిధిలో ఉన్న మొత్తం వ్యవసాయ భూములు.. సాగు చేస్తున్న రైతుల వివరాలు సేకరించాలని ప్రభుత్వం నిర్ణయించిన విషయం తెలిసిందే. అయితే ఇప్పటి వరకూ మొత్తం 1.77 లక్షల రైతుల సమాచారం సేకరించారు. అంటే ఇది జిల్లాలో సేకరించాల్సిన సమాచారంలో 89 శాతం. అయితే మిగిలిన వారి వివరాలు సేకరించడం.. సేకరించిన సమాచారం ట్యాబ్‌ల్లో(కంప్యూటర్లల్లో) ఫీడ్ చేయడం ఇప్పుడు అధికారులకు సవాలుగా మారింది. గడువులోగా ఈ వివరాలన్నీ కంప్యూటీకరించడం కష్టమని చెబుతున్నారు. ఈ నెల 20లోగా వివరాలన్నీ కంప్యూటీకరించాల్సి ఉన్నా అప్పటికి పూర్తి కావడం అసాధ్యం.

ఇవీ సమస్యలు..

జిల్లాలో ఎంత మంది రైతులు ఉన్నార్నది ఇంకా పక్కాగా తేలలేదు. వ్యవసాయ విస్తరణ అధికారులు ఇప్పటి వరకూ గ్రామాలకు వెళ్లి ఇంటింటి సర్వే నిర్వహిస్తే మొత్తం 1.77 లక్షల మంది రైతుల సమాచారం లభించింది. అయితే మరో 11 శాతం భూములకు సంబంధించి యజమానులు అందుబాటులో ఉండకపోవడంతో వారి వివరాలు సేకరించలేకపోతున్నారు. వీరికి జిల్లాలో వ్యవసాయ భూములు ఉన్నా సాగు చేయడం లేదు. అలాగే గ్రామాల్లో ఉండటం లేదు. వీరంతా హైదరాబాద్‌లో స్థిర నివాసం ఏర్పరుచుకోవడం వల్ల వీరి వివరాలు తీసుకోవడం వ్యవసాయ విస్తరణ అధికారులకు కష్టంగా ఉంది.

కంప్యూటరీకరించడం కష్టమే..

సేకరించిన రైతుల సమాచారం మొత్తాన్ని జిల్లా పరిధిలోని 63 మంది ఏఈఓలు కంప్యూటరీకరించాల్సి ఉంది. వీరికి ఇందుకోసం ట్యాబ్‌లు ఇచ్చారు. అయితే ఒక్కో రైతుకు సంబంధించిన వివరాలు మొత్తం 24 కాలాల్లో నింపాల్సి ఉంటుంది. అలాగే ఒక రైతుకు వేరు వేరు ప్రాంతాల్లో భూములు ఉంటే ఆ వివరాలు కూడా వేరువేరుగా నమోదు చేయాలి.. ఇలా ఒక రైతు సమాచారం కంప్యూటరీకరించేందుకు కనీసం 20 నుంచి 40 నిమిషాల వరకూ సమయం పడుతోంది. ఒక్కో ఏఈఓ ఉదయం నుంచి రాత్రి వరకూ పని చేసినా గరిష్ఠంగా 60 మంది రైతుల సమాచారం నింపగలుగుతున్నారు. ఇది కూడా అంతర్జాలానికి ఎలాంటి సాంకేతిక అవరోధాలూ లేకపోతేనే సాధ్యమవుతోంది. మొత్తం 63 మంది మాత్రమే ఈ పనిలో ఉన్నారు. ప్రస్తుతం ప్రతిరోజు సుమారు 3 వేల మంది రైతుల వివరాలను మాత్రమే కంప్యూటరీకరించడం సాధ్యమవుతోంది. ఇప్పటి వరకూ మొత్తం 1.77 లక్షల మంది రైతుల సమాచారం సేకరించినా ఇందులో కేవలం 54 వేల మంది రైతులకు సంబంధించిన వివరాలు మాత్రమే కంప్యూటరీకరించగలిగారు. ఈ లెక్కన గడువులోగా మరో 30 వేల మంది రైతుల వివరాలు మాత్రమే కంప్యూటరీకరించడానికి వీలవుతుంది. క్షేత్రస్థాయిలో ఉన్న ఈ పరిస్థితులను గమనంలోకి తీసుకొంటే గడువులోగా సర్వే పనులు పూర్తి చేయడం సాధ్యం అయ్యేలా లేదు.



ఎర్రమంజిల్‌లోని నాల్గో మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ న్యాయస్థానానికి వస్తున్న బండారు దత్తాత్రేయ, చింతల రామచంద్రారెడ్డి

న్యాయస్థానానికి హాజరైన కేంద్ర మంత్రి

బంజారాహిల్స్, న్యూస్‌టుడే: కేంద్ర మంత్రి బండారు దత్తాత్రేయ, ఖైరతాబాద్ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి బుధవారం ఎర్రమంజిల్‌లోని నాల్గో మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ న్యాయస్థానంలో విచారణకు హాజరయ్యారు. 2014లో సాధారణ ఎన్నికల సమయంలో హిమాయత్‌నగర్‌లోని లిబర్టీ ప్రాంతంలో భాజపా ఆధ్వర్యంలో ఊరేగింపు తీశారు. ర్యాలీకి అనుమతి తీసుకున్న దానికంటే అధిక సంఖ్యలో జనాన్ని సమీకరించడంతో నారాయణగూడ పోలీస్‌స్టేషన్‌లో అప్పట్లో కేసు నమోదైంది. ఆ కేసు విచారణలో భాగంగా కేంద్రమంత్రి బండారు దత్తాత్రేయ, ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి బుధవారం న్యాయస్థానానికి వచ్చారు. ఆ కేసు వివరాలు తెలుసుకున్న న్యాయమూర్తి తదుపరి విచారణను ఆగస్టు 30కి వాయిదా వేసినట్లు తెలిసింది. అప్పటి వరకు న్యాయస్థానంలోనే ఉన్న కేంద్ర మంత్రి దత్తాత్రేయ విచారణ అనంతరం వెళ్లిపోయారు. కేంద్రమంత్రి, ఎమ్మెల్యే న్యాయస్థానానికి రావడంతో పంజాగుట్ట పోలీసులు భద్రతను ఏర్పాటు చేశారు.